SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 8
January-2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జనవరి 2022
వెల రూ.5/-
పుటలు-56



నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్


తిరుమల తిరుపతి దేవస్థానములు
30-11-2021
నుండి
08-12-2021
వరకు జరిగిన
తిరుచానూరు
శ్రీ పద్మావతీ అమ్మవారి
బ్రహ్మోత్సవాల
దృశ్యమాలిక !
















## గీతాశ్లోకార్థసారం

**శ్లో : నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ**
**న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజన మాహవే ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం - 31వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కేశవ= ఓకృష్ణమూర్తీ!; విపరీతాని= అనర్థసూచకాలగు; నిమిత్తాని చ= శకునాలను కూడ; పశ్యామి= చూచుచున్నాను; ఆహవే= యుద్ధంలో; స్వజనమ్= బంధువులను; హత్వా= చంపి, అను= అటు పిమ్మట; శ్రేయః= శ్రేయస్సును; న పశ్యామి= చూడజాలకున్నాను.

**భావం:** ఓ కృష్ణమూర్తీ! (పెక్కు) అపశకునాల్ని సహితం చూచుచున్నాను. యుద్ధంలో బంధువులను చంపిన తర్వాత పొందబోవు లాభమేదో నాకు కన్పించడం లేదు.

---

### శరణంటే చాలును!

అన్నిటి కెక్కుడుయీవి హరి యిచ్చేది
మన్నించునాతనికంటే మఱి లేరు దొరలు

తగుబ్రహ్మలోకముదాఁకా నెక్కిచూచిన
మగుడఁ బుట్టేలోకాలే మనుజులకు
తెగి యిచ్చే యింద్రాదిదేవతలవరములు
యెగువదిగువలను యీసందివే

మాయలోనఁ బుట్టేది మాయలోనఁ బెరిగేది
కాయదారులకు నెల్లఁ గలిగినదే
సేయరానిపుణ్యమెల్లాఁ జేసి గడించుకొనేది
చాయల బహురూపపుసంసారమే

చెడనివైకుంఠ మిచ్చుఁ జేటులేనివర మిచ్చు
వెడమాయఁ బెడఁ బాపు విష్ణుఁ డితఁడే
యెడయక శ్రీవేంకటేశుఁడై వున్నాఁడు వీఁడె
జడియ కితఁడే కాచు శర ణంటేఁ జాలును

(సంపుటం - 02, సంకీర్తన - 09)





*ఆలోచింపగా బ్రహ్మలోకంవరకుగల అన్నిలోకాలు మానవులు మరల మరల పుట్టే చోటులే. ఇంద్రుడు మొదలగు దేవత లిచ్చే వరాలు ఇంచుమించుగా పుణ్యం క్షీణింపగానే నశించేవే. మాయలో పుట్టి మాయలో పెరుగుట శరీరధారులకు సాధారణధర్మమే. చాలా పుణ్యంచేసి తెచ్చుకున్న ఈ సంసారం నానారూపాలతో కూడుకొన్నది. విష్ణువు పునర్జన్మలేని శాశ్వతవైకుంఠనివాసాన్ని, వరాలను, జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు. ఆ విష్ణువే శ్రీవేంకటేశ్వరుడై విరాజిల్లుచున్నాడు. శరణన్నంతనే సంరక్షిస్తాడు. స్వామిని శరణు పొందితే చాలు నని అన్నమయ్య ఈ సంకీర్తనలో చెపుతున్నాడు.*

# థర్డ్‌వేవ్‌తో జాగ్రత్త!

## వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ భారతదేశ ప్రజానీకాన్ని హెచ్చరించింది



ఇప్పటిదాకా కోవిడ్-19 వైరస్ మొదటి, రెండు వేవ్‌లను మనం చూచినాం.
ఇక రాబోయేది పై రెండింటికన్నా ఎక్కువ ప్రమాదకారి అయిన థర్డ్‌వేవ్.
ఈ ప్రమాదం నుండి మనల్ని మనం కాపాడుకోవాలి.

దీనికి ఒకే ఒక పరిష్కారం - మిమ్మల్ని మీరు మాత్రమే రక్షించుకోవడం.
కుటుంబ సభ్యులందరూ దయచేసి గమనించండి.

- కడుపులను ఖాళీగా ఉంచకండి. వేళకు ఆహారం తీసుకోండి!
- ఈ సమయంలో ఉపవాసాలు ఆచరించడం సముచితం కాదు.
- రోజూ ఒక గంట సూర్యరశ్మిని తప్పక ఆస్వాదించండి.
- ఏ.సి. ఏ మాత్రం ఉపయోగించవద్దు.
- వెచ్చని నీరు త్రాగండి, గొంతు తడిగా ఉంచండి.
- ముక్కుకు ఆవనూనె రాయండి.
- ఇంట్లో హారతికర్పూరం కాల్చండి.
- ప్రతి కూరగాయకు అర టీస్పూన్ పొడిఅల్లం జోడించండి.
- దాల్చినచెక్క వాడండి.
- రాత్రి కప్పుపాలతో ఒక స్పూన్ పసుపు కలిపి త్రాగాలి.
- వీలైతే ఒక చెంచా చ్యవన్ ప్రాశ లేహ్యం తినండి.
- ఇంటిలో కర్పూరం మరియు లవంగాలతో పొగ వేయండి.
- ఉదయం టీలో లవంగం వేసి మరిగించి తాగండి.
- పండ్లలో ఎక్కువ నారింజ మాత్రమే తినండి.
- పాలలో పసుపు మీ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- రెండు మాస్కులను సక్రమంగా ధరించాలి.
- చేతులను తరచుగా సానిటైజ్ చేసుకోవాలి (లేదా) సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

వీలు అయినంత త్వరగా అందరూ వ్యాక్సిన్ వేయించుకోండి.





మీరు థర్డ్‌వేవ్‌ను ఓడించాలనుకుంటే,
దయచేసి ఇవన్నీ చేయండి.

పై వాటిని పాటించడం వ్యక్తిగతమే కాదు,
సామాజిక బాధ్యత కూడా!



50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 జనవరి, 2022 సంచిక : 08



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఈ నిజం తెలుసుకో! | డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు | 07 |
| ఆనందసంక్రాంతి! | విద్వాన్, డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య | 08 |
| మళ్లీ.. అగరబత్తీల రూపంలో దైవసన్నిధికి...! | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 12 |
| అలవైకుంఠపురములో... | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 18 |
| శ్రీఆండాళ్ నీరాట్టోత్సవమ్ | డా॥ ఈ.ఏ.సింగరాచార్యులు | 20 |
| ప్రతి హృదయం త్యాగరాజ హృదయం కావాలి! | డా॥ కప్పగంతు రామకృష్ణ | 21 |
| భద్రాద్రిరామయ్య విశ్వరూపసేవ | శ్రీ ఎస్.టి.జి.అంతర్వేది కృష్ణమాచార్యులు | 24 |
| గురుభక్తి | ఆచార్య కె.సర్వోత్తమరావు | 25 |
| కళాశాల ఒడిలో కమనీయ గుడిగోపురాలు | శ్రీ బి.వి.రమణ | 31 |
| ధనుర్మాసంలో దివ్యాన్నాలు | డా॥ జి.వి.పూర్ణచందు | 36 |
| స్వామివారికి మాత్రమే సాధ్యం! | శ్రీ దేవరకొండ విజయప్రసాద్ | 39 |
| ఈ అమావాస్య ఎంతో పుణ్యప్రదం | శ్రీమతి ఆకెళ్ళ సూర్యకనకదుర్గ | 40 |
| దూడూ.. దూడూ... బసవన్న..!! | డా॥ సుబ్బలక్ష్మి, మర్ల | 42 |
| పరమేశ్వరుడే ప్రథమశ్రోత | బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు | 46 |
| నీలోనే ఉంది దైవత్వం | శ్రీమతి జానపాటి మనస్విని | 48 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| చూసే కళ్లు | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 51 |
| తెరతీయగరాదా... (చిత్రకథ) | కథ : డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు : శ్రీ తుంబలి శివాజీ | 52 |
| బాలవినోదం | | 54 |


ముఖచిత్రం : శ్రీవేంకటేశ్వరస్వామివారు
వెనుక చిత్రం : నాదబ్రహ్మ త్యాగయ్య వర్ణచిత్రం: పి.శివశ్రీ

గౌరవ సంపాదకులు
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# పంటల పండుగ

"ద్వాదశాదిత్యులలో విష్ణువు అనే సూర్యుడు, స్థావరాల్లో హిమాలయం. నదులలో గంగానదీ, మత్స్యాలలో మకరం, అయనాలలో ఉత్తరాయణం కూడా నేనే" అన్నాడు- పరమాత్మ. అందుచే ఉత్తరదిక్కు దేవతలకు ప్రీతికరమైందంటారు. మార్గశిరమాసంలో సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన వేళ "ధనుస్సంక్రాంతి" మొదలుగా, సూర్యుడు మకరరాశిలో ప్రవేశించగా "మకరసంక్రాంతి" అవుతుంది. సూర్యసంచారం పుష్యమాసం నుండి ఉత్తరాయణంలో ప్రవేశించగా అది "ఉత్తరాయణ" పుణ్యకాలం ప్రారంభమౌతుంది. ఆకాలం పరమాత్మ నిలయమని ఋషివాక్కు. ఉత్తరదిక్కున బదరికాదిపుణ్యభూముల్లో నరనారాయణులు ఉద్భవించారు. నారద, మౌద్గల్య, విశ్వామిత్రాది మహర్షులెందరో మంత్రద్రష్టలైనారు- ఆ ఉత్తరహిమాలయభూములమీద. ఆ ఉత్తర దిక్కునే పవిత్రగంగానది పుట్టింది. అష్టాంగధర్మాన్ని పండించటానికి కురుమహారాజు ఉత్తరభూములను దున్ని కురుక్షేత్రాన్ని "ధర్మక్షేత్రంగా" మార్చాడు. ఇలా అనేకవిధాల పుణ్యప్రదమైన ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే మొదటిపండుగ సంక్రాంతి.

ఒకప్పుడు శివుణ్ణి భర్తగా కోరిన కాత్యాయనీదేవి హేమంతఋతువులో ధనుర్మాస ఉషఃకాలాన శివుణ్ణి అర్చించి సాత్త్వికాహారమైన హవిష్యం నివేదన చేసిన కారణంగా ఆవ్రతానికి ధనుర్మాసవ్రతం అని పేరు వచ్చిందట. తరువాత ద్వాపరయుగంలో శ్రీకృష్ణపరమాత్మపొందునుకోరి ఈ వ్రతాన్ని "కాత్యాయనీ" వ్రతంగా ధనుర్మాసంలో ఆచరించి ధన్యులైనారట-గోపికలు. అప్పటినుండి సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించినప్పుడే ఈ వ్రతం చేయటం పరిపాటి అయింది. అన్నింటికన్నా అతిపవిత్రం, ప్రసిద్ధం, పుణ్యప్రదం అయిన గోదాదేవి చేసిన "గోపికావ్రతం" సాక్షాత్తు భగవంతుని సాక్షాత్కారానికి నిదర్శనం.

ఆ గోదాదేవే "చూడికుడుత్త నాచ్చియార్"గా నేటికీ శ్రీరంగాదిక్షేత్రాలలో, శ్రీవేంకటేశునిసన్నిధిలో పూజలందుకుంటున్నది. ఆమె రోజుకొకటిగా పాడినపద్యాలే "తిరుప్పావై" లేదా "ఆండాళ్ పాశురాలుగా" నేటికీ ధనుర్మాసబ్రాహ్మీముహూర్తంలో స్వామిసేవకు గానం చేయబడుతుంటాయి. అదే అనూచానంగా నేటికీ స్త్రీలు ధనుర్మాసవ్రతాన్ని పాటిస్తూనే ఉన్నారు.

అటు తరువాత భూమిని సస్యశ్యామలం చేసేది పుష్యమాసం. పౌష్య అంటే పోషించునది అని అర్థం. పూర్వం వామనావతారంలో శ్రీమహావిష్ణువుచేత పాతాళానికి తొక్కబడిన బలిచక్రవర్తి తాను పాలించిన భూమి మీద ప్రజల సుఖసంతోషాలు చూడటానికి సంక్రాంతినాడు భూమిమీదకు వస్తాడని ఒక నమ్మకం. ఆయనకు స్వాగతంగా ఒక ఇంటినుండి, మరో ఇంటికి ముగ్గులరథాలు వేయటంలో అనూచానంగా వస్తున్న అర్థం ఇదే!

సంవత్సరమంతా కర్షకులు పడినశ్రమకు ఫలితం చేతికందేమాసం ఇది. ధాన్యరాశులు, చెఱకురసాలు, పనసతొనలు, గుమ్మడిపళ్లు, బంతిపూలు, రేగుపళ్లు, గంగిరెద్దుల మేళాలు, గోపూజలు, బొమ్మలకొలువులు, బొంగరాల ఆటలు, గగనతలాన గాలిపటాలపోటీలు. కోడిపందాలు. నీటిలో పడవపందాలు, హరిదాసుల అధ్యాత్మ రామాయణగానాలు, భాగవతుల నగరసంకీర్తనాలు ఇలా అందరిమనసులలో వెల్లివిరిసే ఆనందానికి ప్రతిరూపం ఈ సంక్రాంతిపండుగ.

ఉత్తరాయణంలో సూర్యునిరథచక్రాల వేగం పెరుగుతుందట! ఆ చక్రాలవేగానికి, కిరణాలవేడికీ భూమిమీద సూక్ష్మజీవులు నశిస్తాయి. ఆ వేడిని ఉత్తరదిక్కునుండి వచ్చే హిమప్రకోపం సమశీతలం చేసి సుప్రసన్న వాతావరణాన్ని కల్పిస్తుంది-హేమంతఋతువు. ఉత్తరాయణంలో అగ్ని ప్రాణికోటిలో "జఠర" రూపంలో ప్రకాశిస్తూ ఉంటాడనీ, అందుచేత శారీరకతత్త్వం బాగుంటుందనీ ఆయుర్వేదవైద్యులు చెపుతారు. ఈ విధంగా పాతక్రొత్తల మేలికలయికగా, ధనుర్మాసానికి వీడ్కోలుగా, పుష్యమాసానికి స్వాగతంగా కలిపిచేసుకునే పండుగ ఈ సంక్రాంతి.

సంక్రాంతిలక్ష్మి, రంగురంగుల ముగ్గులరథాన్నెక్కి రంగరంగవైభోగంగా ఊరూరా, వాడవాడలా ఊరేగుతూ ఇంటింటా సుఖసంతోషాలు నిండాలని, చల్లనిచూపులు ప్రసరించాలని స్వాగతాంజలి సమర్పించుదాం! ఆధ్యాత్మికచింతనలో అగ్రగాములుగా ధర్మమార్గాన ప్రజలను నడిపించి ఇహపరానందాలను అందరికీ అందించ మని సంక్రాంతిపురుషునికి భక్తినివేదన చేద్దాం!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

సంపాదకీయం




# ఈ నిజం తెలుసుకో..!

– డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు, 98485 43520

సర్వం కాలంవల్లే పుట్టి, దానిద్వారానే నశిస్తుంది. కాలసంబంధం కానిది ఏదీ ఎక్కడా లేదు. కాలం నిర్ధారించే భోగభాగ్యాలను బ్రహ్మ, విష్ణు, రుద్రాదులైన దేవతలు, రాక్షసులు కూడా అతిక్రమించలేరు. కాలం తనను తాను భూత, వర్తమాన, భవిష్యత్తులు అనే మూడుభాగాలుగా విభజించుకుని ఉంటుంది. పుట్టిన వారిని మెల్లమెల్లగా పెరగనిచ్చి ముసలివాళ్లుగా చేస్తుంది: సర్వాధికారాలను చేజిక్కించుకున్న పాలకుడిలాగా యథేచ్ఛగా కాలం ప్రవర్తిల్లుతూ ఉంటుంది. ఈ కాలాన్నే "భగవానుడు" అని అంటారు.

మహేశ్వరుడి సర్వోత్కృష్టమైన తేజస్సే కాలం. కళ, కాష్ఠ, నిమేషం లాంటి అవయవాలతో అది విరాజిల్లుతుంది. సమస్త చరాచరజగత్తు కాలాన్ని ఎప్పుడూ ఉల్లంఘించలేదు. అది ఈశ్వర అధీనంలో ఉంటుంది. కాలం చేతనే జగత్తంతా నియంత్రితమౌతూ ఉంది. ఈశ్వరుడి నుంచి వెలువడ్డ తేజస్సు కాలపురుషరూపంగా సంక్రమిస్తుంది. ఈ కాలపరిధి చాలా గొప్పది. ఏ మనిషైనా కాలంచేత సంక్రమించిన కర్మఫలాన్ని తప్పించుకోలేదు. తన భుజబలపరాక్రమంతో భూమినంతటినీ జయించినవాడు సహితం కాలాన్ని అతిక్రమించే అవకాశమే లేదు. ఎప్పటికైనా, ఎవరినైనా జయించి నిలువగలిగేది కాలమే. మనిషి ఒకటి తలపెడితే... కర్మఫలాన్ని అనుసరించి కాలం మరొకటి చేసి పెడుతుంది. దాన్ని సరిదిద్దటం ఏ బలవంతుడివల్లా కాదు.



కాలగమనంలో ప్రాణులకు ప్రియమైనవ్యక్తులతో లేదా అప్రియమైనవ్యక్తులతో అనుకోకుండా సమాగమం కలిగించి, మళ్లీ వియోగాన్ని కలిగించేది శివతేజోరూపుడైన కాలపురుషుడే. ఒకేసమయంలో ఒక లాంటి పనే చేసి, దానిప్రతిఫలంగా ఒకడు దుఃఖిస్తుంటే మరొకడు సుఖిస్తుంటాడు. ఈ విచిత్రం కాలమహిమే.. యౌవనం తరిగిపోయి వృద్ధాప్యం రావటం, ధనవంతుడు దరిద్రుడు కావటం... ఇవన్నీ కాలం చేసే చిత్రాలే. ఈ కాలాన్ని ఆపేవారు ఎవరూ లేరు. కాలం ఎవరినైనా సమానంగానే చూస్తుంది. అంతకు ముందు ఎంత కష్టించినా కానిది, కాలం కలిసి వచ్చినప్పుడు సులువుగా అవుతుంది. తగినకాలం రానిదే పుష్టిని పొందటం, సుఖాలను అనుభవించటం వీలు కాదు. కాలాన్ని బట్టే చలిగాలులు, వర్షాలు, ఎండలులాంటివి సంభవిస్తాయి. కాలపురుషుడితత్త్వాన్ని అవగతం చేసుకొని కాలాతీతుడైన ఈశ్వరుణ్ణి ధ్యానిస్తూ, తాను చేయాల్సిన పనిని చేసుకుంటూ పోవడమే మనిషి చేయాల్సిన పని. దాంతోనే ఈశ్వరుడు సంతృప్తి చెంది, కాలాన్ని భక్తుడికి అనుకూలంగా ఉండేలా చేయగలుగుతాడు.



అందుకే మనిషి నిరంతరం కాలయాపన చేయకుండా, దానివిలువను తెలుసుకొని మసలుతూ ఉండాలి. ప్రతిక్షణం దైవసమం అని అనుకొన్నప్పుడు ఆస్తికుడైన భక్తుడు కాలాన్ని ఎంతో పవిత్రంగా చూచుకొని సద్వినియోగపరుచుకొంటాడు. కాలం మీద అంతటి పవిత్రభావన అందరిలోనూ కలిగితే సర్వత్ర శుభమే!




# ఆనందసంక్రాంతి

– విద్వాన్, డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య,
**98481 11794**

మకరసంక్రాంతి మనకు పెద్దపండుగ. పెద్దల పండుగ. పంటలపండుగ. పరిశ్రమించి జీవనం గడిపే మన పూర్వులు తాము పండించుకొన్న పంటలను విజయోత్సాహంతో పొంగించి, వండి, పంచభూతాలకు తృప్తికల్గించి, తామూ సంతోషించి, చలిమంటల వెలుగులో, గొబ్బిళ్లతో, మైమరచే పండుగ ఇది. కనుకనే శ్రీనాథుడు ఈ పండుగను "పెను బండువు" (పెద్దపండుగ) అన్నాడు.

ఈ పండుగ మార్గశిర, పుష్యమాసాల్లో వస్తుంది. 'సంక్రాంతి' – అంటే 'చేరడం' అని అర్థం. సూర్యుడు నెలకు ఒక్కమారు ఒక్కొక్కరాశిని చేర్తాడు. ఈ చేరడాన్నే సంక్రాంతి, సంక్రమణం అంటారు. కనుక సంవత్సరానికి పన్నెండు రాశులనుబట్టి పన్నెండు సంక్రాంతులు వస్తాయి. మరి మకరసంక్రాంతికి ఎందుకింత ప్రాముఖ్యం ఏర్పడిందో చూద్దాం!

ద్వాదశాత్మకుడైన సూర్యుని దివ్యయాత్రలో ప్రధానఘట్టాలు నాలుగు. అవి – మేష, కటక, తులా, మకరసంక్రమణాలు. సూర్యుడు ఈ నాల్గు మజిలీలలో చేరగానే ప్రకృతి పులకించి, అనేకవిలాసాలతో ప్రకాశిస్తుంది. ఈ విలాసాల విశిష్టరూపమే 'మకరసంక్రాంతి'. తొలకరిలో మొలకెత్తిన జొన్న, సజ్జ, మొదలైన మెట్టపైర్లూ, రాగి, వరి, కూరగాయలు మొదలగు మాగాణి పంటలూ కార్తిక, మార్గశిర మాసాలకు కాపువచ్చి, పండి, ఎటుచూచినా కలకలలాడుతూ కనువిందుగా ఉంటాయి. గ్రామాల చుట్టుప్రక్కల నిండుగా పండి, ఒరిగి కోతకు సిద్ధంగా ఉండే వరిచేలూ, చేమంతి, బంతిపూలూ, ఆహ్లాదకరంగా ఉంటాయి. పశువులు పాలతో సమృద్ధిగా ఉంటాయి. రైతుల్లో ఆనందం పెల్లుబుకుతుంటుంది. ఈ సస్యసమృద్ధిని చూచియే కాబోలు కృష్ణభగవానుడు – గీతలో **"మాసానాం మార్గశీర్షోఽ(అ)హమ్"** – "మాసాల్లో మార్గశీర్షమాసం నేనే" – అన్నాడు.

మార్గశిరమాస సమాప్తినుండి ఉత్తరాయణం మొదలౌతుంది. సూర్యునియాత్రలోని రెండవఘట్టం– కటక సంక్రమణం నుండి, నాల్గవఘట్టం అయిన మకరసంక్రమణంవరకూ గల ఆరునెలల కాలం– దక్షిణాయనం. మకరసంక్రమణం నుండి కటకసంక్రమణంవరకూ గల ఆరుమాసాలకాలం ఉత్తరాయణం.

ఉత్తరాయణం దేవతలకు ముఖ్యమైంది కనుక ఉత్తమ కాలం. దక్షిణాయనం పితృదేవతలకు ముఖ్యం కనుక అశుభ కాలమని అనుకొంటాం. ప్రకృతిపరిణామంలో చూస్తే కూడా– దక్షిణాయనంలో వానలు, వరదలు, బురదలు, చీకట్లు, మబ్బులు– అనారోగ్యకాలం కనుక చెడ్డకాలమే! ఉత్తరాయణంలో పాడిపంటల సమృద్ధి, ఇంటి నిండా ధాన్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం ఉంటాయి కనుక– మంచికాలమే! దక్షిణాయనంలో మరణిస్తే

పుణ్యగతులు ఉండవనీ, ఉత్తరాయణంలో మరణిస్తే ఉత్తమ గతులుంటా యనీ భారతీయుల ప్రగాఢవిశ్వాసం! భీష్ముడు కూడా దక్షిణాయనంలో పడిపోయినా ఉత్తరాయణం వచ్చే వరకూ ప్రాణాలు నిల్పుకొని, ఉత్తరాయణపుణ్యకాలం వచ్చా కనే ప్రాణాలు వదిలాడు. మకరసంక్రాంతికి ఉత్తరాయణ పుణ్యకాల మని పేరు.

సంక్రాంతిపండుగను మూడురోజులుగా జరుపు కొంటాం. మూన్నాళ్లూ ఆచార, ఆహార, వ్యవహార, విహారాలలో తేడాలున్నాయి.

## మొదటిది - భోగి (సుఖం కలది)

మకరసంక్రమణానికి వెనుకటి ముప్పైరోజులు ధను ర్మాసం. అపుడు సూర్యుడు ధనూరాశిలో ఉంటాడు. ఈ ధను ర్మాసం ముప్పైరోజులు భక్తులు తెల్లవారుజామున్నే మేల్కొని, స్నానాదికం నిర్వర్తించి, దేవాలయాల్లో పూజలూ, భజనలూ నిర్వహిస్తారు. గ్రామాల్లో భజనలు చేస్తారు. చలికాలం కనుక భోగిమంటలు వేస్తారు. ఈ మంటల్లో పాతవస్తువులు- చేటలు మొదలగునవి వేస్తారు. సంక్రాంతినుండి కొత్తవి వాడ్తారు. ఇండ్లముందు అలికి, అందంగా ముగ్గులు వేస్తారు. ఆవుపేడ ముద్ద లుంచి, వాటిపై గుమ్మడిపూలుంచి, పసుపు కుంకుమలు పెట్టి నమస్కరిస్తారు. వీటిల్ని గొబ్బిముద్దలు, గొబ్బెమ్మలు అంటారు.



భోగిపండుగ ఇంద్రునిప్రీతికొరకు చేసేపండుగ అని కూడా అంటారు. భోగ మంటే సుఖం. గోదాదేవి మకర సంక్రాతికి ముందురోజు- శ్రీరంగనాథునిలో వివాహసంబంధ మైన ఐక్యం చెంది, భోగం పొందింది- కనుక ఆరోజును 'భోగి' పండుగ అనే ఆచారం ఏర్పడింది. భోగిపండుగనాడే శ్రీ గోదా రంగనాయకుల కల్యాణం జరుపుతారు. ఈరోజు కొత్తబియ్యం, కొత్తబెల్లంతో 'భోగి పొంగలి' చేస్తారు. దేవునికి సమర్పించి, భక్తిప్రపత్తులతో ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తారు.

తెల్లవారుజామున వేడినీళ్లతో శిరఃస్నానం చేయడంతో గత ఆరుమాసాల పీడజీవితం సమసిపోయిందనీ, భోగినుంచి ఆనందమయజీవితం మొదలయిందనీ భావిస్తారు. వరికంకుల తోరణాలతో ఇండ్లు అలంకరిస్తారు. సాయంకాలం పిల్లలకు పేరంటంచేసి, రేగిపండ్లు, చెరకుముక్కలు, తలపై పోస్తారు. దీన్ని 'భోగిపండ్లు పోయడం' అంటారు. ఇందువల్ల పిల్లలకు ఆరోగ్యం, ఆయుస్సూ పెరుగుతుందని నమ్మకం. ఇలా భోగిపండుగ మానవులకు ప్రీతికరమైనపండుగ.

## సంక్రాంతి

రెండవనాటిపండుగ సంక్రాంతి. ఉత్తరాయణపుణ్య దినం. ఈ రోజు సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. ఈరోజు నుండి సూర్యకిరణాల్లో వేడి క్రమంగా ఎక్కువవుతుంది. ప్రకృతి క్రమంగా ఉత్తేజితమౌతుంది.

ప్రతిపండుగకూ జ్యోతిశ్శాస్త్రసంబంధా లుంటాయని ముందే తెలుసుకొన్నాంకదా! సంక్రాంతికీ జ్యోతిశ్శాస్త్రసంబంధం ఉంది. మకరరాశికి అధిపతి శని. శని వాతప్రధానగ్రహం. వాతం తగ్గాలంటే నూనె మొదలైన తైలాలూ, వాతాన్ని హరించే 'కూష్మాండం' (గుమ్మడికాయ) మొదలగు కూర గాయలు వండి, తినాలి. కనుకనే ఈరోజు తెలక పిండితో ఒళ్లు రుద్దుకొని స్నానంచేసి, నూగులు, బెల్లం, గుమ్మడికాయలు మొదలగునవి దానం ఇస్తారు. ఇందువల్ల పితృదేవతలు పుణ్యలోకాలకు చేర్తారని శాస్త్రం! వాళ్లకై తర్పణాలు చేస్తారు. వాళ్లప్రీతికై వస్త్రాదిదానాలు చేస్తారు. ఈ రోజు 'లేదు' అనేమాట లేకుండా వారివారిశక్తికి తగినట్లుగా దానధర్మాలు చేస్తారు.

స్త్రీలు మాంగల్యాభి వృద్ధికై వృద్ధదంపతులకు సుగంధద్రవ్యాలు, బెల్లం, పుష్పాలు, వస్త్రాలు దానమిస్తారు. ఉత్తరా యణ పుణ్యకాలంలో నల్లనూగు లతో ఆవును చేసి, దానమిస్తే మహా పుణ్యం. వస్త్రదానం గొప్పపుణ్యాన్నిస్తుంది. నేయిదానం చేయాలి. ఈరోజు ఉదయాన్నే పిన్నలు – పెద్దలకు నమస్కరించి, వాళ్ల నుండి శుభాశీస్సులు పొందాలి.

ఇలా మకరసంక్రాంతి పుణ్యకాలమే కాక– పితృదేవతలకు తృప్తి కల్గించి, వాళ్లను ఆరాధించే పెద్దలపండుగ. త్యాగగుణాన్ని పెంచే పండుగ. దాన దయాగుణాలకు ఈ పండుగ కేంద్రం!




## కనుమపండుగ (పసులపండుగ)

మకరసంక్రాంతి మరునాటిపండుగ కనుమపండుగ. ఇది పూర్తిగా రైతులకు సంబంధించింది. తమ వ్యవసాయానికి బాసటగా నిల్చి, తమకు ఎనలేని సేవలందించిన పశువులను గౌరవించే పండుగ– కనుమ లేక పసుల పండుగ. 'సర్వమూ వాసుదేవ స్వరూపమే'– అనే మహోన్నతసిద్ధాంతాన్ని ఆచరించి, చూపే తత్త్వనిధి– ఈ పండుగ. ఈ ఏర్పాటుచేసిన మహాత్ముడు చిరస్మరణీయుడు. వందనీయుడు! మునుపటికాలంలో గోధనమే దేశానికి నిజమైన ధనం. అందుకే చాలా భాషల్లో పశువుల్ని సొమ్ములనీ, ధనమనీ అంటారు.



ఈ రోజు రైతులు ఉదయాన్నే లేచి, పశువులకొట్టాల ముందు పాలు పోసి పొంగళ్లు వండుతారు. పశువుల్ని శుభ్రంగా కడిగి, ముఖాలకూ, కొమ్ములకూ, తోకలకూ, గిట్టలకూ కుంకుమ, పసుపు పెట్టారు. పూలహారాలు వేస్తారు. "పాలపొంగలి, పసులపొంగలి" అంటూ గట్టిగా కేకలు వేస్తారు. ఆ పొంగలి దేవతలకు నైవేద్యం పెట్టాక, కొంత పశువులకు తిన్పించి, కొంత భాగంలో కుంకుమ, పసుపు కలిపి ఆ అన్నాన్ని



పొలాల్లో చల్లుతారు. అందువల్ల దుష్టశక్తులు దూరమై పంటపొలాలు బాగా పంటనిస్తాయని నమ్మకం.

గంగిరెద్దుల ఆటపాటలు సాయంకాలం ఉంటాయి. గ్రామాల్లో ఎద్దులపోటీలూ, కోడిపందేలు, పొట్టేళ్లపందేలు, పశువుల ఊరేగింపులూ జరుపుతారు.

కొన్నిచోట్ల ఈ కనుముకు తరువాతి దినంకూడా 'ముక్కనుము' అనే పేర్తో పండుగ చేస్తారు.

పొంగలే వండి, తినడానికి వైద్యపరమైన కారణా లున్నాయి. చలికాలంలో రాత్రులు పెద్దవి. పగళ్లు చిన్నవి. కనుక నిద్రలేవగానే ఆకలి ఎక్కువగా ఉంటుంది. అందుకై 'ముద్గాన్నం' తినాలని వైద్యశాస్త్రం చెప్పింది. ఇది నెలంతా తినాలి. అలా చేయడం, స్వీకరించడం అందరికీ సాధ్యంకాదు. అయినా వైద్యుల ఉపదేశాలు ఆచరణలో ఉంచడానికి ఇదొక సులభమార్గం. ముద్గాన్నం (పెసరపప్పు అన్నం) ఆకలిని తగ్గిస్తుంది.

వ్యవసాయదారుడికి పశువులే సంపద. వాటిశ్రమ ద్వారా పంట చేతికివచ్చిన సంక్రాంతిసమయంలో కృతజ్ఞతా సూచకంగా వాటికి కొత్తబియ్యంతో పొంగలి వండి పెట్టే ఆచారం ఏర్ప డింది.

మానవులకు అమృతంతో సమానమైన పానీయాన్ని సమ కూర్చడంకోసం, తానే గోరూపాన్ని ధరించి, అమృతంయొక్క శక్తిని బ్రహ్మదేవుడు గోవుపొదుగులో ఉంచాడు. ఆ పొదుగు నుంచీ వచ్చేవే పాలు. ఆవుపాలు మాన వులకు సమగ్రమైన ఆహారమై, అమృతంతో సమానంగా ఉంటు న్నాయి. కనుక గోవు మాన వునికి పాలు ఇచ్చేతల్లి. ఆమె గోమాత. ఆహారం సమకూర్చి యిచ్చి, పోషించే బ్రహ్మ కావడంతో పూజింపదగింది. గోవును పూజించడంవల్ల తల్లిదండ్రుల్నీ, బ్రహ్మనూ పూజించినఫలం దక్కుతుంది. కనుక పూజింపదగిన గోవుయొక్క పూజకై ఏర్పాటైంది కనుమపండుగ. ఇది జంతుజాతికి కృతజ్ఞత తెలిపేపండుగ. పంటలు పండేట్టుగా చేసే భగవంతునికీ, పొలాల్ని దున్నే ఎద్దులకూ, అందరికీ కృతజ్ఞతలు తెల్పే మంచి పండుగ – ఇది.





# మళ్లీ.. అగరబత్తీల రూపంలో దైవసన్నిధికి..!



– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

**దేవుని సేవకు వికసించాయి. స్వామివారిపాదాల చెంత చేరి పులకించాయి. అమ్మవారి కొప్పున చేరి పరిమళించాయి. సుమనోహర సుమాలు. నారాయణుడికి అలంకృతమై మెరిశాయి. సిరులతల్లి అర్చనలో మురిశాయి. వాడి, దివ్యచరణాలను వీడే సమయంలో విలపించాయి. ప్రస్తుతం పుష్పవిలాపానికి ఉపశమనం లభించింది. మళ్లీ అగరుబత్తీల రూపంలో దైవసన్నిధిని సుగంధభరితంగా మార్చే సువర్ణ అవకాశం వచ్చింది.**

భారతీయులు అర్చామూర్తిని పూజించడం ప్రాచీనకాలం నుంచీ ఉంది. మానసికపూజ, భౌతికపూజ అని పూజ రెండువిధాలు. చంచలత్వం గల చిత్తాన్ని ఏకాగ్రం చేయడానికి మానసికపూజలో కష్టసాధ్యం. మూర్తిపూజలో మనస్సు, చిత్తమూ, బుద్ధి, ఇంద్రియాలు, శరీరం అన్నీ అర్చామూర్తిని చూస్తూనే, సేవిస్తూనే ఉంటాయి. కనుక, మనస్సు త్వరగా భగవంతునిమూర్తియందు ఏకాగ్రమౌతుంది. అర్చానా విధానాన్నిగురించి, అందుకు వాడేవస్తువులు, పూలు మొదలైన వాటినన్నిటినీ ఆగమశాస్త్రాలు స్పష్టం చేశాయి. ఇందులో షోడశోప చారాలు ప్రధానమైనవి.

ఆవాహన మాసనం పాద్య మర్ఘ్య మాచమనీయకమ్।
స్నానం వస్త్రోపవీతే చ భూషణం పుష్పమేవ చ॥
గంధో ధూపశ్చ దీపశ్చ నైవేద్యం ముఖవాసనమ్।
అర్చానాన్తే ప్రణామశ్చేత్యుపచారాస్తు షోడశ॥

ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, వస్త్రం, ఉపవీతం, ఆభరణం సమర్పించడం, పుష్పసమర్పణ గంధం, ధూపం, దీపం, తాంబూలం, నైవేద్యం పూజానంతరం నమస్కారం అని ఉపచారాలు పదహారు.

ఇన్ని చేయలేని వారి కోసం శాస్త్రం సులువుగా అష్టోపచారాలను చెప్పింది.

ఆసనం పాద్య మాచామనం ధూపో దీపో౽ర్ఘ్యమేవ చ।
హవిః పానీయమి త్యష్టావుపచరాః ప్రకీర్తితాః॥

ఆసనం, పాద్యం, ఆచమనం, ధూపం, దీపం, అర్ఘ్యం, హవిస్సు, పానీయం అని ఎనిమిది ఉపచారాలు.

ఈ రెండు విధానాలలో కూడా ధూపం అనే సువాసన ద్రవ్యసేవ విధిగా ఉంది. దేవతలు దివ్యసుగంధశరీరులు. కనుక వారికి చెమటపట్టదు. కానీ, మృదుశరీరుడైన భగవం తుణ్ణి సేవించేటప్పుడు ఒక పసిబిడ్డకు చేసే సేవలుగా భావించి భక్తి, శ్రద్ధలతో, పరమప్రీతితో, మృదుపద్ధతిలో సేవలు సమర్పిం చాలి. పసిబిడ్డకు స్నానం చేయిస్తే, వెంటనే సాంబ్రాణి పొగ వేస్తారు. అది శరీరంపై ప్రసరించి, శరీరంపై ఉన్న తేమను పోగొడుతుంది. బిడ్డ హాయిగా నిద్రించడానికి ధూపం ఎంతో సహకరిస్తుంది.

పూర్వకాలం ఆలయాలలో ముఖ్యంగా గర్భాలయంలో సూర్యరశ్మి, గాలి, వెలుతురు ప్రవేశించడానికి అవకాశం ఉండదు. కనుక అక్కడ వాతావరణం సుగంధభరితంగా ఉంటే, మనసు ప్రశాంతంగా ఉంటుంది. అందుకోసం గంధసేవ, ధూప సేవ విధిగా ఏర్పాటైంది. ఈ రెండూ కూడా మనస్సును ఆకర్షించి, ఏకాగ్రతకు తోడ్పడమే గాక, శారీరిక, మానసిక బాధలను పోగొట్టగల దివ్యశక్తి మంతాలు.

పూజాద్రవ్యాలలో పుష్పాలు చాలా ప్రధానమైనవి. పైన చెప్పిన షోడశ, అష్ట ఉపచారాలతో పాటు ఏకోపచారం కూడా ఒకటుంది. అదే పుష్పోపచారం.




"పుష్పదామ ప్రదానం వా ప్రణామస్త్వేక విగ్రహః"
పుష్పమాలగాని, విడిపుష్పాలుగానీ సమర్పించడం లేక ప్రణామన్ని ఆచరించటం ఒక ఉపచారం.

పుష్పమంటే వికాసమని అర్థం. తాను వికసిస్తూ నిఖిల ప్రాణికోటిని వికసింపజేసేది పుష్పం. మంచిమనస్సు గల్గింది పుష్పం. జనులు దీనిపై మనస్సును బాగా ఉంచుతారు కాబట్టి పుష్పం "సుమనాః" అని పిలువబడుతోంది. సాధారణ లౌకిక పుష్పాలవికాసం తాత్కాలికం, నశ్వరం. కొన్ని దేవతాపుష్పాలున్నాయి. వాటిభౌతికవికాసం కూడా తాత్కాలికమే అయినా వాటివికాసం మాత్రం శాశ్వతం. ఇవి శాశ్వత పరమానందాన్నిస్తాయి. వీటినే దివ్యపుష్పాలు, వైదికపుష్పాలు అంటారు.

పద్మం, ఇందీవరం, మల్లి, నాగమల్లి, పారిజాతం, ఏడాకుల అరటి, కుముదం మొదలైనవి దేవతాపుష్పాలు.

పద్మం లక్ష్మీనివాసస్థానం. ఇందీవరమంటే నల్లకలువ లక్ష్మి. ఈ పువ్వులతో పూజించేవారిని లక్ష్మి వరిస్తుంది. ప్రతి వారిచేత శిరస్సున ధరింపబడేది మల్లిక. ఈ పుష్పవైభవం అత్యంత ప్రసిద్ధం. కుముదం అంటే తెల్లకలువ. ఇది భూమిని సంతోష పరుస్తుంది. ఇక పారిజాతం, చెంగల్వపూవు, ఉత్పలం (కలువ పూవు) కూడా ఔషధగుణాలు కలిగినవే!

ఏడాకుల అరటికి 'శారదః' అని పేరు. శరత్కాలంలో పూచటంచేత 'శారద' అయింది. శారదాదేవి చదువుల తల్లి.

అంటే భాషామతల్లిక. భాష ఏడు వర్గలతో ఒప్పుతోంది. అవి క, చ, ట, త, ప, య, శ వర్గలు. ఈ ఏడు వర్గలకు ప్రతి రూపంగా ఏడు ముఖాలనీ, అందుచేత శారదపుష్పానికి ఏడు ఆకులు ఉంటాయని ఆగమశాస్త్రవచనం. అందుకే గొప్ప విద్వాంసుణ్ణి శారదుడనీ, విశారదుడనీ అంటారు. శారదమంటే శ్వేతపద్మమని కూడా శబ్దకల్పద్రుమమనే గ్రంథం తెల్పుతోంది.

కనుక, శారదాదేవి శారదాన్ని చేతితో ధరించి ఉన్నదంటే భౌతికంగా శ్వేతపద్మాన్ని, దైవికంగా ఏడువర్గలుగల వాఙ్మయాన్ని ధరించి ఉంటుందని అర్థం. ఈ విధంగా వివిధపుష్పాలు వివిధ దేవతాస్వరూపాలని తెలుస్తోంది. "చైతన్య కుసుమ ప్రియా" అని లలితాదేవి నామం. ప్రాణులలో ఉండి మహాఫలాల నొసంగే "చిత్" అనే పుష్పమే చైతన్యం. ఈ పువ్వు దేవికి చాలా ఇష్టం. ఈ చైతన్యపుష్పం ఇతర అష్టపుష్పాలకన్నా విలక్షణమైంది.

విష్ణుసహస్రనామాలలో భగవంతుడు "పుష్పహాసః" అని కీర్తింపబడుతున్నాడు. నాలుగువేదాలు నాలుగుపుష్పాలని ఛాందోగ్యోపనిషత్ చెప్పింది. సూర్యుడు దేవతలందరిలోనూ తేనె వంటివాడు. ఆ సూర్యునికి స్వర్గం అడ్డుకొయ్యగా ఉంది. ఆకాశం ఆ అడ్డుకొయ్యను పట్టుకొని వ్రేలాడే తేనెపట్టు. సూర్యుడు ఆ తేనెపట్టులోని తేనె. కిరణాలు తేనెటీగలు. తూర్పు దిక్కువైపు ప్రసరించే కిరణాలు తేనెపట్టు నుండి తేనెను కార్చే తూర్పునాడులు. ఋఙ్మంత్రాలే తుమ్మెదలు. ఋగ్వేద మంత్రాలే తూర్పుదిక్కు లోని పుష్పం. ఆ ఋగ్వేదమంత్రాలు అమృతాలు. దక్షిణదిక్కువైపు ప్రసరించే కిరణాలు తేనెను కార్చే దక్షిణ నాడులు. యజుర్వేదమంత్రాలు తుమ్మెదలు. యజుర్వేదం దక్షిణ దిశలోని పుష్పం. ఆ వేదమంత్రాలు–అమృతాలు, సుధామయాలు.

పడమటిదిక్కువైపు ప్రసరించే సామవేదమంత్రాలు, ఉత్తరదిక్కువైపు ప్రసరించే అథర్వవేదమంత్రాలు అమృతాలు. ఈ విధంగా నాలుగువేదాలు నాలుగుపుష్పాలు. ఓం కారం కూడా పుష్పమే. ఆ వేదమంత్రాలు తుమ్మెదలు. తుమ్మెదలనగా తేనెటీగలు. ఇవి పువ్వులనుండి తేనెను తేనెపట్టులో సమ కూర్చునట్లు వేదమంత్రరూపాలైన తేనెటీగలు వేదరూప పుష్పాలనుండి ఆకాశమనే తేనెపట్టులో సూర్యుడనే తేనెను సమకూర్చుతున్నాయి. ఆ తేనెపట్టునుండి తేనెను కిరణాలనే నాడులు కార్చి లోకానికందజేస్తున్నాయి. ఆ తేనెయే సూర్య తేజం. అలా నాలుగువేదాలు నాలుగుపుష్పాలై సూర్యకాంతి రూపమైన తేనెను లోకానికి ప్రసాదిస్తున్నాయి. ఈ జగత్పుష్పా నికి వికాసాన్నిస్తున్నాయి. ఆ విధంగా నాలుగువేదాలు లోకోత్త రాలు, ప్రధానాలైన దేవతాపుష్పాలే!

పంచభూతాలలో భూమి గంధగుణం కలది. అందు వల్ల భూమికూడా పుష్పమే! పరాదేవతను చూపేటటువంటి ద్వారం గంధద్వార మని శ్రీసూక్తం చెబుతోంది. ఏ గంధం? ఏ పుష్పంనుండి వచ్చే గంధం? వేదరూపపుష్పం నుండి వచ్చే గంధమే ఆ దేవీదర్శనానికి ద్వారం. రామాయణంలో హను మంతుణ్ణి "పుష్పగిరి" స్వరూపుడుగా వాల్మీకి స్మరించాడు. "యథా పుష్పమయోగిరిః" అని. సముద్రలంఘనం చేసే టప్పుడు, అశోకవనంలో సీతాదేవిని వెదికేటప్పుడు చెట్లనుండి అనేక పుష్పాలు రాలాయట. ఆ పుష్పాలతో మునిగిపోయిన







హనుమంతుడు పుష్పమయమైన కొండవలే ఉన్నాడట. పుష్పగిరి అంటే వేదపుష్పగిరియే. మంత్రపుష్పగిరియే. అందుకనే భగవంతుడు "గిరీశః, గిరిశః" అని కీర్తింపబడుతున్నాడు. గిరి వేదవాక్కునందు శః అంటే శయనించియున్న వాడని అర్థం. పరమేశ్వరుని నివాసం వేదవాక్కే గద!

మంచి పుష్పాలతో ఉన్న చెట్టునుండి చాలా దూరం వరకు మంచి గంధం, సువాసన వస్తాయి. మంచి పుణ్యకర్మలు చేసే మానవుడుకూడా మంచి సువాసన గల పుష్పాలతో గూడిన వృక్షరూపుడే. పుష్పించిన వృక్షమే. పుణ్యకర్మలే పుష్పాలు. పుణ్యకర్మలు చేసేవారి మనస్సులుకూడా మంచిపుష్పాలే. వారిసత్కర్మలు అనే పుష్పాలు వికసించి మంచి ఫలాలనిస్తాయి. పాపకర్మలు ఎండిపోయిన పుష్పాలవలే రాలిపోతాయి. సత్పురుషుని నుండి మంచిమాటలే వినబడుతాయి. ఇవి కూడ పుష్పాలే! ఈ పుష్పాలకోసం లోకం వెతుకుతుంది.

సాధారణపుష్పాలతోనే లోకం ఇంత ఆనందాన్ని పొందుతుంటే లోకోత్తరాలు, దివ్యాలు అయిన వైదిక పుష్పాలతోనూ, వేదపుష్పాలతోనూ ఇంకెంత ఆనందాన్ని పొందవచ్చు?

ఇంతటి విశిష్టత గలిగిన పుష్పాలు పూజాద్రవ్యాల్లో చాలా ప్రధానమైనవి. ఇందుకోసం ప్రత్యేకంగా ఆలయాలకు అనుబంధంగా పూలతోటలు పెంచడం ఆలయకైంకర్యాలలో ప్రముఖస్థానం వహిస్తుంది. ఈ పుష్పసువాసనలు అటు భగవంతునికి, ఇటు భక్తులకు కూడా ఎంతో ఆనందాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయి.

చంపకాऽశోకపున్నాగమల్లికా జాతి పంకజమ్।
గ్రాహ్యం సుగంధికుసుమం నిర్గంధం వర్జయేద్ధరేః॥

చంపకం కరవీరం చ మల్లీ జాత్యుత్పలాదికమ్।
దమనోశీరలా మఙ్ఞా తులస్యాదీన్ సమాహరేత్॥

తులసీపూజనాద్విష్ణోరన్యత్ప్రీతికరం న చ।
నాऽహరేత్తులసీ రక్తాం కృష్ణాం వాపి హరేత్తథా॥

నాశయేత్తులసీ కృష్ణా దత్తా కేశవమూర్ధని।
యద్యుత్పుష్పాణి చోక్తాని తత్తత్పత్రైశ్చ పూజయేత్॥
ఉత్పలస్యారవిందస్య కేతక్యాః పత్రమన్యథా॥

చంపక, పున్నాగ, అశోక, తెల్లని వాసనగల మల్లె, జాజి, మంచితామరపుష్పాలు, గన్నేరు, మల్లి, జాజి, నల్లకలువ, దవనం, వట్టివేరు, కురువేరు, తులసి మొదలగువాటిని దేవతల ఆరాధనకు వినియోగిస్తారు.

తులసిపూజచే విష్ణువు ప్రీతినొందుతాడు.

పై పువ్వులన్నీ కేవలం దేవతల ఆరాధనకే గాక, ఔషధాలుగా కూడా ఉపయోగపడతాయి.

కమలపుష్పం రక్తపైత్యవ్యాధిని పోగొడుతుంది. కంటికి చాలా హితమైంది. శరీరతాపాన్ని పోగొడుతుంది. గర్భస్రావాలు లేకుండా చేస్తుంది. మల్లెపూవులు వాతపిత్తాలను, రక్తదోషాలను హరిస్తాయి. నేత్రవ్యాధులను పోగొడుతాయి. విరజాజి శరీరానికి తేలికదనాన్ని ఇస్తుంది. శరీరం కాంతిమంతం అవుతుంది. చెంగల్వపూలు కంటిజబ్బులను పోగొడుతాయి. పలు శారీరక















బాధల్ని పోగొట్టుంది. ఇది చాలా ఆరోగ్యకరమైంది. మశూచిని పోగొడుతుంది. గుండెకు మేలు చేస్తుంది. ఇలా ఎన్నోరకాలైన పత్ర, పుష్పాలు శ్రీవారిసేవలో ఉపయోగిస్తున్నారు. వీటి సువాసన, స్పర్శమూలకంగా అనేకచర్యల దోషాలు నివారింపబడుతాయి.

భగవంతుడికి అర్పించిన పూలు,హారాలను నిర్మాల్యం అంటారు. ఈ నిర్మాల్యాన్ని ఎక్కడో బావుల్లోనో, చెరువుల్లోనో వేస్తూవచ్చారు. ప్రస్తుతం ఆ సంప్రదాయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రస్తుత తి.తి.దే.పాలకమండలి, అనేక వైద్యగుణాలున్న పుష్పాలను వృథా చేయడం కంటే వాటిని నేటి వైజ్ఞానికతతో మేళవించుకుని, వాటి కున్న ఔషధగుణాల్ని ధూపరూపంలోకి మార్చాలని నిర్ణయించింది. దీనికోసం చక్కటి ప్రణాళిక రూపొందించింది. వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయంతో ఈ విషయంగా చర్చించింది. బెంగుళూరుకు చెందిన దర్శన్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో ఎస్వీగోశాలలో అగురుబత్తుల తయారీ చేపట్టారు.

తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయాలనుంచి సేకరించిన పుష్పాలను శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాలలోని అగరు బత్తుల తయారీ కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది. వీటిని రకాలవారీగా పుష్పాలను వేరుచేస్తారు.

అనంతరం డ్రైయింగ్‌యంత్రంలో పూర్తిగా ఎండేలా చేసి పిండిగా మార్చి నీరు కలిపి, దాన్ని కొన్ని పదార్థాలతో కలుపు తారు. మిశ్రమాన్ని మరో యంత్రంలో వేసి అగరుబత్తులు తయారు చేస్తారు. ఏడుకొండలకు సూచికగా అభయహస్త, తందనాన, దివ్యపాద, ఆకృష్టి, సృష్టి, దృష్టి, తుష్టి పేర్లతో తి.తి.దే. అగరుబత్తీ లను 13-09-2021న విడుదల చేసింది.

ప్రతిరోజూ స్వామివారికి అర్పించిన పువ్వులు ధూప రూపంలో పునః స్వామికి సేవజేసిన భాగ్యం, భక్తులకు ఆనందం కలిగించిన భాగ్యం ఆ పువ్వులకు భగవంతుడిచ్చిన వరం. ఈ దిశలో అడుగులు వేసిన తి.తి.దే. యాజమాన్యానికి ఇది అపూర్వఅవకాశం.

ఈ ధూపాలు, అగరుబత్తీలు ఆలయాలను, పూజా మందిరాలను దివ్యసుగంధభరితం చేస్తూ, వాతావరణ కాలుష్యాన్ని తొలగిస్తూ, మహాప్రయోజనాన్ని చేకూరుస్తున్నాయి. పూర్వం ధూప మంటే అగ్గినిప్పుల్లో సాంబ్రాణి వేసేవారు. అది ఒకటే కాకుండా పదిరకాలైన వస్తువులు అందులో ఉంటాయి. దానికే దశాంగం అని పేరు.

1)వట్టివేరు 2)మంచిగంధం 3)గుగ్గిలం 4)మశీసాక్షి 5)కర్పూరం 6)అగరు 7)ఖర్జూరం 8)తుంగముస్తులు 9)సాంబ్రాణి 10)ఆవునెయ్యి. ఇన్ని వస్తువులతో ధూపద్రవ్యాన్ని సిద్ధం చేసుకుని, దాన్ని నిప్పులపై వేసి, ఆ పొగను శ్రీవారికి సమర్పించేవారు. అది దివ్యధూపం.

ప్రస్తుతం దానికి ప్రత్యామ్నాయంగా భక్తులకు సులువుగా ఉండడంకోసం శ్రీవారికి అర్పించిన పుష్పాలనుండీ అగరుబత్తీలు చేసి, భక్తులకు అందించడం పరమపవిత్ర విన్నూత్నప్రయోగం.




ధూపసేవవల్ల అనేక విధాలైన వ్యాధులనుండి రక్షణ కలుగుతుంది. భగవంతుడిపై మనసు లగ్నంకావడానికి, వాతావరణశుద్ధికి, మంచిభావాలు రావడానికి, ఈ ధూపవాసన ఎంతో సహాయకారి. అందువల్లనే విశ్వమానవ జాతి సమస్తమూ ధూపవాసనమాత్రం ఆఘ్రాణిస్తూనే ఉంటుంది. అందుకనే మనపెద్దలు పంచోపచారాలలో ధూపానికే ప్రథమతాంబూలం ఇచ్చారు. కనుక ఈ సేవ మహాసేవ.

విశ్వమంతా ఈ సువాసనలు వాయురూపంలో చేరి దివ్యానుభూతిని కలిగించాలనే ఆశయంతో ఏడుకొండలవాడికి ఏడురకాలైన సువాసనలు గల అగరుబత్తీలు రూపొందించి, సప్తగిరీశ్వరుని నామాన్ని సార్థకం చేస్తోంది తి.తి.దే. యాజమాన్యం.

వాసనశబ్దానికి భావన అని పేరు. కనుక ఈ శ్రీవారికి అర్పించిన పుష్పాలతో రూపొందించిన అగరుబత్తీలవాసన ఆఘ్రాణించడంవల్ల అనేక శారీరక, మానసికబాధలు తొలగి సద్భావాలతో మనస్సు ప్రశాంతమై, జీవనం భక్తి భావభరితమై శ్రీవేంకటేశ్వర స్వామి సేవతో మరింతగా ధన్యత నొందవచ్చు.



కనుక, భక్తులందరూ కూడా ఈ ధూపద్రవ్యాలను భక్తిశ్రద్ధలతో స్వీకరించి, వాటిల్ని భగవత్సేవకే అంకితం చేసి, అటు ఆయా పుష్ప, పత్రాదుల జన్మలనే గాక, ఇటు తమ జన్మలను కూడా చరితార్థం చేసుకుంటారని ఆకాంక్షిద్దాం!



# అలవైకుంఠపురములో...

– శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి

ప్రతి తిథీ ప్రత్యేకమే అయినప్పటికీ ఏకాదశికి మరింత ఎక్కువ ప్రత్యేకత కనిపిస్తుంది. ఏకాదశి అనే పేరు తలచుకోగానే ఓ పుణ్యభావన మన మనస్సుల్ని ఆవహిస్తుంది. ఏకాదశిరోజున పని ప్రారంభిస్తే విజయం తథ్యమనే ఆత్మ విశ్వాసం కలుగుతుంది. ఆ రోజున చేసే అర్చనలకు శ్రీమహా విష్ణువు ఎంతో ప్రీతి చెందుతా డని పురాణాలు, ఆచారాలు విస్పష్టంగా ప్రకటిస్తున్నాయి. అందుకే ఎంత ఒత్తిడిలో ఉన్నా, ఎంతకష్టంలో ఉన్నా ఏకాదశిరోజున సాధ్యమైనంత మేరలో విష్ణుమూర్తిని అర్చించి, తరించాలని ప్రతి ఒక్కరూ తపిస్తుం టారు. ఇలా సంవత్సరానికి వచ్చే అన్ని ఏకాదశుల్లో మార్గశిర, పుష్యమాసాల్లో వచ్చే ముక్కోటిఏకాదశి మరింత పుణ్యప్రద మైందిగా ప్రసిద్ధి పొందింది.

ప్రతినెలలో రెండుఏకాదశులు చొప్పున ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. అధికమాసం ఉంటే మరో రెండు ఏకాదశులు అదనం. ప్రతిఏకాదశికీ నిర్దుష్టమైన నామధేయా లున్నాయి. ఆర్షసంప్రదాయంలో ఏకాదశితిథి పరమపవిత్ర మైంది. శ్రావణ, కార్తిక, మార్గశిర మాసాల్లోని ఏకాదశులకు మరిన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. వీటిలో ధనుర్మాసంలో వచ్చే శుక్లఏకాదశి విశేషమైంది. దీన్నే ముక్కోటిఏకాదశి పర్వదినంగా జరుపుకోవటం ఆనవాయితీగా ఏర్పడింది.

## ఏకాదశి... విశేషాల రాశి

విష్ణువు 'మురుడు' అనే రాక్షసుడితో యుద్ధం చేస్తూ అలసిపోయి, సింహవతి అనే గుహలో సేదతీరుతున్నాడు. ఆషాఢశుక్లఏకాదశినుంచి కార్తికశుక్లఏకాదశివరకు ఆ గుహ లోనే యోగనిద్రలో ఉన్నాడు. ఈ విషయాన్ని గ్రహించిన మురాసురుడు మాయోపాయంతో విష్ణువుపైకి దాడికి సిద్ధమయ్యాడు. అప్పుడు విష్ణువుశరీరంనుంచి యోగమాయశక్తి రూపంలో వెలువడింది. ఆ మహాశక్తి మురాసురుణ్ణి సంహ రించింది. విష్ణుమాయావిలాసంనుంచి ఉత్పన్నమైన ఆ శక్తి స్వరూపానికి శ్రీహరి వరాన్ని అనుగ్రహించాడు. విష్ణువుకు

ప్రియమైన తిథిగా ఏకాదశి పేరిట ఆ శక్తిరూపం పూజలందు కుంటుం దని పేర్కొన్నాడు. ఆనాటినుంచి ఏకాదశితిథి పరమ పవిత్రమైందిగా పరిగణిస్తున్నారు.

సుకేతుడనే రాజు దేవతల ఉపదేశానుసారం ఏకాదశి వ్రతాన్ని ఆచరించి, విష్ణువుఅనుగ్రహంవల్ల సంతానసిద్ధి పొందాడు. సూర్యవంశరాజైన రుక్మాంగదుడు ఏకాదశివ్రతాన్ని తాను ఆచరించడమే కాక, తనరాజ్యంలో అందరిచేత నిర్వహింపజేసి, శ్రీహరికి ప్రియభక్తు డయ్యాడు. వైఖానసుడు అనే రాజు పితృదేవతలకు ఉత్తమగతుల్ని అందించడానికి ముక్కోటిఏకాదశివ్రతం చేశాడు.

ఓ సందర్భంలో బ్రహ్మ, వరుణ, ఇంద్ర, రుద్రగణా లన్నీ కలిసి, అసురశక్తులపై విజయాన్ని సాధించటానికి శ్రీమహా విష్ణువుఅనుగ్రహాన్ని ఆకాంక్షించారు. వైకుంఠఉత్తరద్వారం నుంచి వైకుంఠంలోకి ముక్కోటి దేవతాసమూహం ప్రవేశించారు. శ్రీహరిదర్శనాన్ని పొంది, విష్ణుకరుణకు పాత్రులయ్యారు. సమస్తదేవతలు వైకుంఠనారాయణుడిదర్శనం పొందిన ఆ మహత్తరసందర్భమే **'ముక్కోటిఏకాదశి'.**

ఏకాదశితిథికి 'హరివాసరం' అని పేరు. వైకుంఠ ఏకాదశిని హరిఏకాదశి, మోక్షఏకాదశి, సౌఖ్యఏకాదశి అని కూడా వ్యవహరిస్తారు. శ్రీమన్నారాయణునికి సూర్యుడు కుడి కన్ను కాగా, చంద్రుడు ఎడమకన్నుగా ప్రకాశిస్తారు. నేత్రాలు వేరైనా దృష్టి ఒక్కటే! సూర్యచంద్రులు వేర్వేరుగా గోచర మౌతున్నా సమగ్రంలో కాంతిశక్తి ఒక్కటే. విరాట్ స్వరూపుడైన విష్ణువు ఎన్నో రూపాల్లో వ్యక్తమవుతున్నా భగవత్‌చైతన్యం, ఈశ్వర తత్త్వం ఒక్కటే! అసురశక్తులబారిన పడకుండా ప్రతికూల శక్తుల్ని ధైర్యంగా ఎదుర్కొని, సానుకూలశక్తుల్ని పెంపొందింప జేసుకోవడానికే ముక్కోటిదేవతలు విష్ణువును ఆశ్రయించారు. విష్ణుకృపను సాధించి, మనోభీష్టాల్ని నెరవేర్చుకున్నారు. అందుకే ఈ ఏకాదశిని భగవదవలోకదినోత్సవం అనీ, మోక్షోత్సవమనీ కూడా పేర్కొంటారు.

సూర్యుడు ధనూరాశిలోకి ప్రవేశించిన తర్వాత మకర సంక్రమణంవరకు జరిగే 'మార్గళి' మధ్య ముక్కోటిఏకాదశి వస్తుంది. ఉత్తరాయణపుణ్యకాలానికి ముందు ముక్కోటిదేవత లతో సమ్మిళితమై ఉన్న విష్ణువును ముక్కోటిఏకాదశినాడు ఉత్తరద్వారంగుండా ఆలయాల్లో దర్శిస్తే సమస్తమనోభీష్టాలు నెరవేరుతాయి.

## ఏకాదశి నియమావళి

ముక్కోటి ఏకాదశిరోజున తిరుమల, శ్రీరంగం, గురు వాయురు, భద్రాచలదివ్యక్షేత్రాల్లో ప్రత్యేకపూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు. భక్తులదర్శనంకోసం ఉత్సవమూర్తుల్ని సర్వా లంకారయుక్తంగా ఉత్తరద్వారంలో కొలువుదీరుస్తారు. ముక్కోటి పర్వదినసందర్భంగా ప్రతివైష్ణవసన్నిధానం వైకుంఠమై విలసిల్లు తుంది. వేద, వేదాంగాలను పఠిస్తారు. వేదాలను పద, క్రమాది పద్ధతుల్లోనూ వల్లిస్తారు. ఉపనిషత్తుల్ని గానం చేస్తారు. షోడశోప చారాలతో స్వామికి కైంకర్యాలు కొనసాగుతాయి. అలంకార ప్రియుడైన విష్ణుభగవానుడి అవతారస్వరూపాలైన శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీవేంకటేశ్వర, నృసింహఆలయాలన్నీ నేత్రానందకరంగా భాసిల్లు తాయి. దశమినాడు ఏకభుక్తం, ఏకాదశినాడు ఉపవాసం, ద్వాదశినాడు అన్నదానం అనేది సంప్రదాయరీత్యా పాటించా ల్సిన నియమాలు.

బ్రహ్మాదిదేవతలు స్తుతులు చేస్తుండగా, మంగళ ధ్వనులు మారుమ్రోగుతుండగా, వేదమంత్రాలు పఠిస్తుండగా పాలకడలిలో శేషతల్పంపై పవళించిన శ్రీమహావిష్ణువుకు శ్రీమహాలక్ష్మిసేవ చేస్తూ ఉంటుంది. విష్ణువునాభినుంచి ఉద్భ వించిన పద్మంలో బ్రహ్మ కొలువై ఉండగా స్వామి అనంతపద్మ నాభుడిగా తేజరిల్లుతాడు. ఈ వైకుంఠదివ్యదర్శనాన్ని ప్రతి భక్తుడు సదా తమ హృదయపీఠంపై నిలుపుకోవాలి, విష్ణు కృపకు పాత్రులు కావాలి. చీకటి నుంచి వెలుగువైపునకు నిత్య చైతన్యంతో పయనించాలి.

## వైష్ణవక్షేత్రాల్లో సందడి

ముక్కోటిరోజున వైష్ణవదేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఆ రోజున ఉత్తరద్వారమార్గంలో స్వామిని దర్శించుకోవాలని భక్తులు ఎంతో ఆరాటపడతారు.

ముక్కోటిఏకాదశినాడు తెల్లవారుజామునుంచే ఆలయాల్లో భక్తులు ఉత్తరద్వారదర్శనంకోసం వేచి ఉంటారు. ముక్కోటి ఏకాదశినాడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు గరుడవాహనా రూఢుడై మూడుకోట్లదేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శన మిస్తాడు. అందువల్లనే ముక్కోటిఏకాదశి అని దీనికి పేరు. మూడుకోట్ల ఏకాదశులతో సమానమైన ఈ ఏకాదశి పరమ పవిత్రత సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటిఏకాదశి అంటారు.



# శ్రీఆండాళ్ నీరాట్టోత్సవమ్

- డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు

శ్రీవైష్ణవసంప్రదాయదేవాలయాలలో ప్రతిసంవత్సరం ధనుర్మాసంలో జరిగే ఉత్సవం నీరాట్టోత్సవం. ఇది ఒక విలక్షణమైన సంప్రదాయాన్ని సూచించే ఉత్సవం. గోదాదేవి భక్తి వైభవాన్ని తెలియజేసే ఉత్సవం.

ద్వాపరయుగంలో రేపల్లెలోని గోపికలు శ్రీకృష్ణుణ్ణి పతిగా ఆరాధించి, ఆ స్వామిని పొందడంకోసం వారు ధనుర్మాసంలో కాత్యాయనివ్రతం అనే ఒకవ్రతాన్ని ఆచరించినట్లుగా గోదాదేవి పెద్దలవల్ల విన్నది. ఆ వ్రతఫలితంగా వారు శ్రీకృష్ణుణ్ణి పతిగా పొందగలిగారు అనికూడా తెలుసుకుంది. తానుకూడా వారివలె శ్రీకృష్ణుని ఉద్దేశించి ఒక వ్రతాన్ని చేయాలని సంకల్పించుకున్నది. తనను ఒక గోపికగా భావించింది. శ్రీవిల్లిపుత్తూరులోని తనతోటి బాలికలను తోటి గోపికలుగా భావన చేసింది. రేపల్లెలోని గోపికలవలె తాను కూడా తనతోటి చెలికత్తెలతో కలసి భగవంతుణ్ణి ఉద్దేశించివ్రతాన్ని ఆచరించింది. ఆ వ్రతానికి "తిరుప్పావై" అని పేరు.

గోదాదేవి ఉదయకాలంలో తనతోటి చెలికత్తెలతో కలసి చన్నీళ్లలో స్నానం చేసే క్రమానికి సంప్రదాయంలో 'నీరాట్టం' అని పేరు. ఈ పదాన్ని గోదాదేవి తిరుప్పావై ప్రబంధంలో చాలా చోట్ల ప్రయోగించింది. అయితే, ఈ పదం కేవలం నదిలో స్నానం చేయడాన్ని మాత్రమే తెలుపదు. ఇది ఒక విలక్షణమైన వేదాంతరహస్యాన్ని సూచిస్తుంది.

భగవంతుడు ఒక చల్లనిసరస్సువంటివాడు. పలువురు ఆళ్వార్లుకూడా శ్రీమన్నారాయణుణ్ణి ఒక చల్లనినీటిసరస్సుగానే భావన చేశారు. అందువల్ల ఇక్కడ గోదాదేవి తాను తన చెలికత్తెలతో కలసి నదిలో చన్నీళ్లలో స్నానం చేసినట్లుగా తెలుపడం ఆమె పొందిన భగవంతుని కల్యాణగుణాల అనుభవాన్ని సూచిస్తుంది.

అందువల్ల 'నీరాట్టం' అనే పదం భగవంతుని మధురమైన అనుభవానికి ఒక ప్రతీక. గోదాదేవి శ్రీకృష్ణునిసన్నిధికి వెళ్లి, తాను చేసే సేవను స్వీకరించమని ప్రార్థించినవిధానం వేదాంతంలో చెప్పబడిన జీవుని పారతంత్ర్యాన్ని తెలియజేస్తుంది.

తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామిఆలయంలో ప్రతి ఏడాది ధనుర్మాసంలో ఈ ఉత్సవం చాలా వైభవంగా జరుగుతుంది. భోగిపండుగకు ఏడుదినాల ముందు ఈ ఉత్సవం ప్రారంభమౌతుంది. ఈ ఉత్సవదినాలలో గోదాదేవికి విశేషమైన ఆరాధన జరుగుతుంది. ధనుర్మాసారాధన తరువాత ఉదయమే గోదాదేవి పల్లకీలో గోవిందరాజస్వామి ఉత్సవంగా బయలుదేరి, మాడవీథులలో ఊరేగింపుగా వెళ్లి, శ్రీకోదండరామస్వామి ఆలయం దగ్గర రామచంద్రతీర్థంలో ఉండే నీరాట్టమండపంలోకి వేంచేస్తారు. అక్కడ గోదాదేవికి తిరుమంజనం, ప్రసాదనివేదన, తిరుప్పావై శాత్తుమురై, ఆస్థానం జరుగుతుంది. తర్వాత అక్కడ గోదాదేవికి విశేషంగా పుష్పాలంకరణ జరుగుతుంది. సాయంకాలానికి గోదాదేవి తిరిగి శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి 'తిరుచ్చి' వాహనంలో చేరుతారు. ఈ విధంగా ఈ ఉత్సవం ఏడుదినాలు జరుగుతుంది. ఎనిమిదవరోజున భోగినాడు గోదాదేవి శ్రీకృష్ణస్వామితో కలసి పల్లకీలో సాయంకాలం మాడవీథులలో ఊరేగి, తమ స్వస్థానానికి వేంచేస్తారు. కనుమనాడు గోదాదేవికి, శ్రీకృష్ణస్వామికి ప్రణయకలహోత్సవం, కల్యాణోత్సవం వైభవంగా జరుగుతాయి.

# ప్రతి హృదయం త్యాగరాజ హృదయం కావాలి!

- డా॥ కప్పగంతు రామకృష్ణ,
90320 44115

నవనాదుల్లోను నాదోపాసనే ప్రాణవాయువుగా నింపుకున్న వాగ్గేయకారుడు-శ్రీసద్గురు త్యాగరాజస్వామి. అచంచలమైన రామభక్తితో దైవప్రసాదంగా వచ్చిన అద్భుతమైన గాత్రం, కర్ణాటకసంగీతవైదుష్యం సహా తనువును, మనసునూ... ఒకటేమిటి 'తన' అను కున్న సమస్తప్రపంచాన్ని శ్రీరామునిచరణారవిందాలకే అర్పణం చేసిన భక్తశిఖామణి ఆయన. సంగీతం కేవలం ప్రతిభాప్రదర్శనకో, ధనసంపాదనకో కాదు.. సంగీతం కైవల్యసోపాన మని త్రికరణశుద్ధిగా నమ్మి, ఆచరించి చూపిన వాగ్గేయకారు డాయన.


అపారమైన తన సంగీతసాహిత్యరచనా సర్వస్వాన్నీ మాతృభాష అయిన తెలుగు లోనే రచించి, ఆంధ్రసారస్వతరంగం నేటికీ వెలుగు తగ్గకుండా ఉండటానికి చిత్తశుద్ధితో కృషి చేసిన తొలి తెలుగుభాషోద్యమకార్యకర్తగా త్యాగరాజు కనిపిస్తారు.

తన కృతులన్నిటిలో సామాజికప్రయోజనాన్ని ఆకాంక్షించిన సమాజసేవకుడిగా త్యాగరాజు సాక్షాత్కరిస్తారు.

భగవత్ప్రసాదంగా వచ్చిన విద్యను, విజ్ఞానాన్ని తిరిగి భగవంతుణ్ణి చేరుకోవ టానికే వినియోగించిన కైవల్యపథగామిగా త్యాగరాజు దర్శనమిస్తారు.

నిద్రాణమై, నిస్తేజంగా, మొక్కుబడితీరులో సాగుతున్న కర్ణాటకసంగీతకచేరీ లకు తన వినూత్నప్రయోగాలు, ఆవిష్కరణలతో నూతనజవసత్త్వాలను కల్పించి, 'ఇదీ కర్ణాటకసంగీతవైభవం' అని ప్రపంచానికి తెలిసేలా చేసిన వాగ్గేయకారుడిగా త్యాగరాజస్వామి పురుషరూపం దాల్చిన సంగీతసరస్వతిగా సాక్షాత్కరిస్తారు.

ఇంతటి బహుముఖప్రజ్ఞాశీలతవల్లనే శతాబ్దాలు గడుస్తున్నా త్యాగరాజస్వామి నేటికీ మనకు ఆరాధ్యుడయ్యారు.



## సమున్నత వ్యక్తిత్వం

తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి చివరిశ్వాసవరకు అదే లక్ష్య సాధనకోసం జీవించారు- ఆయన. ఎన్నికష్టాలు వచ్చినా రాముడే చూసుకుంటాడని త్రికరణశుద్ధిగా నమ్మి, ఆ స్వామినే కీర్తించేవారు.

త్యాగరాజు కేవలం తెల్లటివస్త్రాలే ధరించేవారు. నుదుట విభూది తప్పకుండా ధరించేవారు. విభూదిరేఖల మధ్యలో కొద్దిగా గంధం, దానిమీద కొద్దిగా కుంకుమబొట్టు పెట్టేవారు. గొంతు ఖంగు మని మోగేది.

తోటివారిపట్ల దయ, ప్రేమ కలిగి ఉండేవారు. సంగీతవిద్య విషయంలో మాత్రం చండశాసనుడిగా వ్యవ హరించేవారు. ఎంతో క్రమశిక్షణ పాటించేవారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, తన గొంతును కాపాడుకునేవారు. వారానికోసారి

నువ్వులనూనెతో తలస్నానం చేసేవారు. పొట్లకాయకూర ఇష్టంగా తినేవారు.

వీటన్నిటినీ మించి సమాజసేవ, ఉద్ధరణ త్యాగరాజులో ఎక్కువగా కనిపిస్తాయి. బాహ్యప్రవర్తనలో నిరంతర రామచింతన తప్ప మరే చింతా లేనివాడుగా కనిపించిన త్యాగరాజు తన కృతుల్లో సమాజం ధర్మమార్గాన్ని వీడకుండా ఎలా స్వధర్మాచరణ చేయాలో స్పష్టంగా చెప్పారు.

త్యాగరాజ పంచరత్నకృతుల్లో ఒకచోట 'పరనారీ సోదరా!' అని రామచంద్రమూర్తిని సంబోధిస్తారు. ఈ ఒక్క ఉదాహరణ చాలు.. త్యాగయ్య నిర్ధాణమైన తన సమాజాన్ని ఎంత జాగృతం చేశారో తెలుస్తుంది. రాముడు పరనారీసోద రుడట! అంటే తనభార్యను తప్ప ఇతరస్త్రీలనందరినీ సోదరీ భావంతో చూచేవారు. రాముడిలోని ఈ ఒక్క లక్షణాన్నైనా సమాజ సభ్యులందరూ అలవర్చుకుంటే చాలని త్యాగయ్యకోరిక. అదే జరిగితే, సమాజపౌరులందరూ పరస్త్రీలను సోదరీభావంతో చూస్తే.. పేరు చెప్పుకోవటానికి ఇబ్బందిపడే వ్యాధులు రావు. లక్షలాదికుటుంబాలు రోడ్డున పడే దుస్థితీ ఉండదు. ఇదీ త్యాగయ్య వైభవం. ఇదీ బాధ్యతాయుతమైన రచయితకు ఉండాల్సిన లక్షణం.

ఈ రోజున ఎందుకు త్యాగరాజ కీర్తనలు పాడాలి? త్యాగరాజకీర్తనల అవసరం సమాజానికి ఏముంది? అని ప్రశ్నించేవారికి ఇదే సూటిసమాధానం. త్యాగరాజకీర్తనలు కర్తవ్యనిష్ఠవైపు సమాజాన్ని ఉద్దీపనం చేసే చైతన్యదీపాలు. మనిషిని మనీషిగా తీర్చిదిద్దే ఉపనిషద్వాక్యాలు.

## తరగని మాతృభాషాభిమానం

సంగీతానికి, సాహిత్యానికి అవినాభావసంబంధం ఉందని త్యాగరాజు ప్రగాఢంగా నమ్మేవారు. భావావేశంతో పాడితేనే ఏ కచేరీ అయినా రక్తి కడుతుంది. శ్రోతల మనసుల్ని తాకుతుంది. ఇది జరగాలంటే కళాకారుడికి తాను పాడుతున్న కృతి ఏ భాషలో ఉందో ఆ భాష తప్పనిసరిగా రావాలి. సాహిత్యం అర్థం కాకపోతే ఆత్మానందం కలుగదు. ఇది లేకపోతే కచేరీలో తాదాత్మ్యత రాదు. తాదాత్మ్యత లేని కచేరీ రాణించదు. అందుకే సాహిత్యం– అర్థంకాని సంగీతానికి విలువలేదని త్యాగ రాజు అభిప్రాయం. అందుకే తనవద్దకు సంగీతం నేర్చు కోవటానికి వచ్చిన ప్రతివారికీ ముందుగా భాష నేర్పించేవారు. త్యాగరాజస్వామివద్ద సంగీతశిష్యరికం చేసినవాళ్లు సుమారు 200 మందికి పైనే ఉన్నారు. వీరందరిలో తంజావూరు రామా రావు, మానాంబుచావడి వెంకటసుబ్బయ్యర్– వీరిద్దరే తెలుగు వాళ్లు. మిగిలినవాళ్ళందరూ తమిళులే. ఇన్ని వందల మందికి స్వయంగా తెలుగు నేర్పించిన భాషోపాధ్యాయుడుగానూ త్యాగయ్య తనలోని మాతృభాషా పరిరక్షణదీక్షను ప్రకటించారు.

సాధారణంగా సంగీతశిక్షణలో గీతమైనా, వర్ణమైనా.. మరేదైనా ముందుగా స్వరాలతో నేర్పిస్తారు. స్వరస్థానాలు చక్కగా వచ్చిన తర్వాత సాహిత్యంతో నేర్పిస్తారు. త్యాగరాజు ఇందుకు భిన్నంగా ఏ కృతినైనా ముందుగా సాహిత్యంతో నేర్పించేవారు. శిష్యుడు భావయుక్తంగా పాడుతున్నా డని అనిపిస్తే, అప్పుడు స్వరాలతో నేర్పించేవారు. ఇంతటి ప్రాధానత్య ఇచ్చారు కాబట్టే త్యాగరాజస్వామి పుణ్యమా అని నేటికీ కర్ణాటకసంగీతంలో భాషకు ప్రాధాన్యత దక్కుతోంది.

త్యాగరాజస్వామికాలంలో తంజావూరు ప్రాంతంలో ఎన్నో భాషలు వాడుకలో ఉండేవి. తమిళదేశం కావటంవల్ల ప్రధానంగా తమిళం వాడుకలో ఉండేది. పండితభాషగా, రాజభాషగా సంస్కృతం ఉండేది. అక్కడక్కడా తెలుగు ఉండేది. వ్యావహారికంగా చాలాచోట్ల తెలుగు వాడుకలో ఉండేది. మహ మ్మదీయపాలకుల దండయాత్రలు, దురాక్రమణల ఫలితంగా ఉర్దూ, పార్శీభాషలూ తమ ఉనికిని చాటుకునేవి.

ఇన్నిభాషలు, సంస్కృతీవైవిధ్యాల మధ్య తన మాతృ భాష అయిన తెలుగును, తెలుగు సంస్కృతిని, సాహిత్యాన్ని కాపాడుకోవటంకోసం త్యాగరాజు అజరామరమైన ప్రయత్నం చేశారు. వేలకొద్దీ కృతులను తెలుగులోనే రచించి, తన అపార మైన తపశ్శక్తిని వాటికి ధారాదత్తం చేసి, తెలుగుభాష నేటికీ వెలుగులీనటానికి మూలకారణంగా నిలిచారు.

తాను జీవించింది తమిళప్రాంతంలో అయినా, త్యాగ రాజస్వామి ఒక్క కృతినికూడా తమిళంలో రాయలేదు. ఈ ఒక్క నిరూపణ చాలు.. తెలుగు భాషా పరిరక్షణకు త్యాగరాజు చేసిన కృషి ఏమిటో చెప్పటానికి.

ఉపన్యాసాలు, నినాదాలతోకాకుండా వాస్తవ ఆచరణతో తన మాతృభాషను కాపాడుకోవటంకోసం కృషి

చేసిన భాషోద్యమ కార్యకర్తగా తన కర్తవ్యాన్ని నిర్వహించారు త్యాగరాజస్వామి.

భాషాప్రయోగాలపరంగా చూస్తే త్యాగరాజుకు ఛందస్సు మీద సాధికారత ఉన్నట్లు ఆయనరచనలు పరిశీలిస్తే స్పష్టమౌతుంది. యమకాలు, ప్రాసలు, శబ్దాలంకారాలు, వృత్తాలు... ఒకటేమిటి త్యాగయ్యప్రయోగాలు అపూర్వం.. అని తరసాధ్యం.

## విశేష సంగీత ప్రజ్ఞ


కర్ణాటకసంగీతంలో రాగలక్షణాలు, రాగస్వరూపాల విషయంలో త్యాగరాజుకు ఎంతో పట్టు ఉంది. సుమారు 215 రాగాల్లో ఆయనరచనలు ఉన్నాయి. తనకృతులద్వారా మరుగున పడిన ఎన్నో రాగాలను వెలికితీశారు. కొన్ని కొత్త రాగాలను సృష్టించారు. ఒకే రాగంలో అనేకకృతులు స్వరపరచినా, ఏ ఒక్కటీ మరో దానితో పోలి ఉండదు.

సంఖ్యాపరంగాను, సృజనపరంగాను త్యాగరాజస్వామి స్వరపరచినన్ని రాగాలు ఏ వాగ్గేయకారుడూ ముట్టుకోలేదు. రాగలక్షణాన్నీ, వైశాల్యాన్నీ త్యాగరాజుతో సమానంగా తన రచనల్లో ప్రకటించిన వాగ్గేయకారుడూ ఇంతవరకూ లేదు. త్యాగరాజకృతుల్లో రాగవిస్తృతి విశాలంగా ఉంటుంది. గొంతుకలో శ్రావ్యత తక్కువగా ఉన్నవారుకూడా చక్కగా పాడుకునేలా త్యాగయ్యకీర్తనలు సాగుతాయి.

ఎంతో సరళంగా, సుందరంగా పదిమందికీ అర్థమయ్యేలా తన రచనలద్వారా అందరికీ సంగీతాన్ని చేరువ చేశారు- త్యాగయ్య. కర్ణాటకసంగీతానికి, కళాకారులకు... కాదు.. కాదు... యావత్ తెలుగుజాతికి ఆయన చేసిన మహోపకారాన్ని వర్ణించటానికి మాటలు లేవు. ఆయనభిక్షవల్లే లక్షలాది కుటుంబాలు ఈనాటికీ లోటులేకుండా కాలం గడుపుతున్నాయి.

త్యాగయ్యకీర్తనలు పాడితే కళాకారులుగా మాత్రమే మిగులుతాం. కానీ, త్యాగయ్య తన కృతులద్వారా కోరుకున్న ఆశయాలు సిద్ధించాలంటే అందుకు ఆచరణాత్మకప్రయత్నం కావాలి. ప్రతిహృదయం త్యాగరాజహృదయం కావాలి. అప్పుడే త్యాగబ్రహ్మ కోరుకున్న 'రామభక్తిసామ్రాజ్యం' ఏర్పడుతుంది.

## తిరుమలలో అధ్యయనోత్సవం



శాసనాలద్వారా తెలియవచ్చిందేమిటంటే అధ్యయనోత్సవం తిరుమలలో ముక్కోటి ఏకాదశికి 10 రోజుల ముందు ఆరంభమై 20రోజులు జరుగుతుందని తెలుస్తోంది.

ఈ ఉత్సవం సమయంలో ఉత్సవమూర్తులను ఊరేగింపులో తీసుకొని పోతూ ఆళ్వార్లు చెప్పిన నాలాయిర దివ్యప్రబంధాన్ని పఠిస్తారు. (ఇది సంస్కృత వేదాలవలె తమిళంలో ధర్మవివరణ చేస్తూ, తమిళ వేదాలు అనిపించుకొంటాయి.) అధ్యయనోత్సవాన్ని రెండుభాగాలుగా విభజించి మొదటి పదిదినాలను పగల్‌పత్తు (పగటి పది) అనియ, తరువాతి 10 రోజులను వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశితో ప్రారంభించి 10 రాత్రులను రాపత్తు అని పిలుస్తారు బ్రహ్మోత్సవాలలోలాగానే అధ్యయనోత్సవంలో కూడ భక్తులు నైవేద్యం సమర్పిస్తారు అని తెలుస్తోంది.

అధ్యయనోత్సం తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయంలలో కూడ జరిగేవి. ఐదుగురు ఆళ్వారులకు 12 దినాల సాత్తుమొరైని ఏర్పరచి తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామికి నివేదన సమర్పించిన తరువాత తిరుపతికి తీసుకు వచ్చి ఆళ్వార్లకు అర్పించేవారు.

ఈ ఉత్సవాల తొలిప్రస్తావన 1400 లోను తుది ప్రస్తావన 1635లోను ఉటంకించబడిన దాఖలాలు లభిస్తున్నాయి.

ప్రాచీనకాలంలో చైత్ర మాసంలో శ్రీరామానుజుల వారి ముందుకూడ అధ్యయనోత్సవం జరిగేది. అపుడు ఉత్సవమూర్తులను కూర్చుండబెట్టడానికి లోపల కల్యాణ మండపాన్ని వాడుతూ ఉండేవారు. మలయప్పస్వామి ఉత్సవమూర్తులను ఈ నాడు కూడ బ్రహ్మోత్సవం మరియు అధ్యయనోత్సవానికి కూడ కల్యాణమండపంలో వేంచేపు చేయిస్తారు.

# భద్రాద్రిరామయ్య విశ్వరూపసేవ

- శ్రీ ఎస్.టి.జి అంతర్వేది
కృష్ణమాచార్యులు



భారతావనిలోని శ్రీరామక్షేత్రాల్లో అత్యంతసుప్రసిద్ధమైన క్షేత్రం భద్రాచలం. దక్షిణ అయోధ్యగ కీర్తించబడే ఈ క్షేత్రం భద్రమహర్షి తపఃఫలంగా ఆవిర్భవించింది. రామదాసాది మహనీయులవల్ల లోకంలో ఆవిష్కరించబడింది.

భక్తకల్పకుడైన భద్రాద్రిరాముడికి నిత్యోత్సవాది ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. వార్షికంగా జరిగే శ్రీరామనవమి, వైకుంఠఏకాదశి ఉత్సవాలు విశ్వవిఖ్యాతి పొందాయి. ఇందులోని శ్రీరామనవమి ప్రతిసంవత్సరం చైత్ర శుక్లపాడ్యమినుండి చైత్రపూర్ణిమవరకు వసంతపక్ష, ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్స వాలలో భాగంగా నవమినాడు భద్రాచల రామచంద్రులకల్యాణం జరుగుతుంది. అదేవిధంగా సూర్యుడు ధనూరాశిలోకి ప్రవేశించగా వచ్చే శుద్ధఏకాదశిని వైకుంఠ ఏకాదశి అని అంటారు. ఈ వైకుంఠఏకాదశిని మధ్యమణిపూసగ చేసుకుని ముందు పదిరోజులు పగల్‌పత్తు, తరువాత పదిరోజులు రాపత్తు ఉత్సవాలు జరుగుతాయి. బహుళద్వాదశినాడు "విశ్వరూపసేవ" వైభవంగా జరుగుతుంది. అంటే వైకుంఠ ఏకాదశిపర్వానంతరం పదహారవరోజు విశ్వరూపసేవ ఆచరించబడుతుంది.

విశ్వరూపసేవను, సర్వదేవతాలంకారసేవ అని కూడా అంటారు. భద్రాచలం లోని ప్రధానాలయంలో ఉన్న ఉత్సవమూర్తులతో పాటుగా లక్ష్మీతాయారుసన్నిధి, కనకసీత, వేంకటేశ్వర, సంతానవేణుగోపాల, హయగ్రీవ, వరాహ, చెన్నకేశవ, గోదా, సత్యనారాయణ, ఎంబెరుమానార్, నమ్మాళ్వారు, పన్నిద్దరు ఆళ్వారులు, ఆంజనేయ, భద్రమహర్షిసన్నిధి మొదలైన ఉపాలయాలలోని ఉత్సవమూర్తులను, గరుడ, గజ, అశ్వ, హంస, హనుమంత, రాజాధిరాజ, చంద్రప్రభ ఇత్యాది వాహనాలను నిత్య కల్యాణమంటపప్రాంగణంలో వేంచేపు చేస్తారు. ఇలా ఆలయాలలో ఉన్న ఉత్సవ మూర్తులందరిని ఒకేసారి, ఒకే దగ్గర దర్శించడ మనేది విశ్వరూపసేవ ప్రత్యేకత.

*"అంతా రామమయం జగమంతా రామమయం"* అంటూ భక్తరామదాసు బ్రహ్మాండం మొదలుకుని బ్రహ్మవరకు కల చరాచరమైన ఈ జగత్తు అంతా రామ మయ మని, అంతరంగంలో నిండిన ఆత్మారాముడు విశ్వరూపుడై వింతలు సలుపు తున్నా డని, అలా ఉన్న ఆ పరమాత్ముని దర్శించి తరించటమే ముక్తికి మార్గ మని భావ గంభీరంగా తమకీర్తనద్వారా ఉద్బోధించారు. అంతటా ఘనకీర్తనస్ఫూర్తితో "విశ్వరూపసేవ" భద్రాదిఆలయంలో ఆరంభించడం జరిగింది.

సర్వదేవతలు శ్రీరాముడికి అంగాలు, వారందరితో ఉన్న రామచంద్రుడే శుభప్రదు డని రామరహస్యోపనిషత్తు చెప్పినట్టుగా, భద్రాచలంలో సకలమూర్తులతో కొలువైన సీతారామచంద్రుణ్ణి సేవించటం సర్వాభీష్టఫలప్రదం. సర్వజయప్రదం.

విశ్వరూపసేవ ఇలా జరుగుతుంది- సాయంసమయంలో వివిధవిద్యుద్దీప కాంతులతో వెలుగొందే నిత్యకల్యాణమండపప్రాంగణంలో, మంగళవాద్యాల, వేదస్వస్తి పురస్సరంగా ఆరంభమౌతుంది-విశ్వరూపసేవ. ముందుగా మహాదర్బారులో హరి దాసులగానాలు, తదుపరి షడక్షరీమంత్ర సంపుటితశ్రీరామఅష్టోత్తరశతనామార్చన, ఋగ్వేదాదిచతుర్వేద, శ్రీరామాయణ పురాణాది విన్నపాలు జరిగి, దివిటి సరాములు, బహుపరాకులు, అష్టోత్తరశతమంగళహారతి సమర్పణ, కదంబ ప్రసాదనివేదన, మహామంత్రపుష్పంతో భద్రాచల శ్రీసీతారామచంద్రుల విశ్వరూపసేవ సుసంపన్న మౌతుంది. భక్తజనాన్ని రామభక్తిరసాబ్ధిలో ఓలలాడిస్తుంది.

భద్రాచలనివాసాయ భద్రాయ పరమాత్మనే ।
జానకీప్రాణనాథాయ రామచంద్రాయ మంగళమ్ ॥



# గురుభక్తి

- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

లౌకికజగత్తులో గురుశిష్యానుబంధం, శిష్యవాత్సల్యం, గురుభక్తికి సంబంధించిన వృత్తాంతాలు అనేకం. ఇలాంటి అనుబంధం ఆధ్యాత్మికజగత్తులో కూడ లేకపోలేదు. ఇలాంటి కోవలో శ్రీవైష్ణవపరంపరలో కనిపించే మహదాశయంగల వ్యక్తులలో 'కూరత్తాళ్వాన్' ఒకరు.

భగవద్రామానుజుల ఆంతరంగికులలో 'కూరత్తాళ్వాన్' ఒకడు. ఈ మహోన్నతవ్యక్తికి సంబంధించి ఐతిహ్యాలు అనేకం... మచ్చుకు కొన్ని-

జననం కాంచీపురానికి దగ్గరి 'కూరం' గ్రామం. అతడు ఆగర్భశ్రీమంతుడు. అన్నిటికన్నామించి అనునిత్యం సూర్యోదయం మొదలుకొని రాత్రి రెండుజాములవరకు ఇంటికి వచ్చే అనాథలకు, దివ్యాంగులకు అన్నదానం చేసేవాడు. అతిథి సంతర్పణ జరిగాక కూరత్తాళ్వాన్ అతిథిశాల తలుపు మూయబడేది.

ఒకసారి ఈ తలుపు మూయబడే ధ్వని సుదూరంలోని శ్రీరంగంలోని శ్రీరంగనాయకి చెవులబడింది. అర్ధరాత్రివేళ ఇంత గొప్ప ధ్వని ఎక్కడనుండి వచ్చిందో అని పిరాట్టి స్వామిని కుతూహలంతో అడిగింది. శ్రీరంగపతిద్వారా కూరత్తాళ్వాన్ నిరతాన్నదానప్రశస్తి విని, ఆ మహానుభావుణ్ణి చూడాలని తన కోరికను శ్రీవారితో మనవి చేసింది. అపుడు ఆ రంగపతి కాంచీపూర్ణులను పిలిచి, కూరేశుణ్ణి వెంటబెట్టుకొని రావలసిందిగా ఆనతిచ్చాడు. కాంచీపూర్ణులద్వారా కూరత్తాళ్వాన్ పిరాట్టి కోరిక విని చలించిపోయాడు. తత్ క్షణమే సంపదను, ఇండ్లను, వాకిండ్లను తృణప్రాయంగా వదలి, శ్రీరంగానికి పయన మయ్యాడు. భార్య ఆండాళమ్మ పతిని అనుసరించింది. పయనం కొనసాగింది.

పయనంమధ్య అరణ్యప్రాంతం. ఆ ప్రాంతం దొంగలకు, దారి దోపిడీదారులకు నిలయం. కూరేశులు ఒక్కసారి ఆగాడు. ఆండాళమ్మ కాకులు దూరని కారడవిని చూచి "ఇక్కడ భయమేమి లేదు కదా?" అని ప్రశ్నించింది. మనవద్ద విలువైన వస్తువు ఉంటే కదా భయమని అన్నారు. ఆండాళమ్మ నాదగ్గర కనకభూషణాదులు లేవు. ఉన్నదల్లా మీరు ప్రతిరోజూ పాలుత్రాగే బంగారుపాత్రమాత్రమే అన్నది. "అలాగా! ఆ పాత్రను నా కివ్వు" అని అందిపుచ్చుకొని దూరపు పొదలపై పారవేశాడు. సహధర్మచారిణి ఏమీ అనలేదు. చివరకు పయనం కొనసాగించి శ్రీరంగం చేరుకొన్నారు.

భగవద్రామానుజులకు కూరేశుల ఆగమనవార్త తెలిసింది. కూరేశులను సగౌరవంగా పిలుచుకుని రమ్మని తనశిష్యులకు ఆదేశించారు. కూరేశదంపతులకు అతిథిసత్కారాలు చేశాడు. ఆపై కూరేశులు శ్రీరంగంలో ఉంటూ ఉంఛవృత్తిలో కాలం గడుపుతూ ఉదరపోషణ చేసుకునేవాడు.

ఒకసారి శ్రీరంగంలో కుంభవృష్టి. కూరేశులు ఇల్లు కదలలేకపోయారు. పూజాదులు పూర్తి చేసి, సాలగ్రామతీర్థం మాత్రం పుచ్చుకొని సంతృప్తిపడ్డాడు.

సాయంత్రం శ్రీరంగనాథునికి మహానైవేద్యసమయం. ఆండాళమ్మ "నా పతిదేవుడు ఏమీ ఆరంగించక శయనిస్తుంటే శ్రీరంగనాథా! నీకు మహానైవేద్యమా?" అని తల్లడిల్లింది. స్వామి ఆండాళమ్మ ఆవేదనను అర్థం చేసుకొని ఉత్తమపూర్ణుడనే ఆలయాధికారికి కలలో కనిపించి "నా ప్రసాదాలు అందించి ఆ మహానుభావుణ్ణి తోడ్కొని రమ్మని" ఆదేశించాడు.

పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....



2022

## నూతన ఆంగ్ల సంవత్సర
మరియు
## సంక్రాంతి శుభాకాంక్షలు!


దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు

ఉత్తమపూర్ణుడు కూరేశులు ఉన్నచోటికి కదిలాడు. శ్రీరంగని ఆన తెలియజేశాడు. కూరేశులవారికి అనుమానం. నేను యాచించలేదే. తనపత్ని ఆండాళమ్మ కోరుకొందేమో అని ప్రశ్నించాడు. ఆండాళమ్మ సర్వం స్పష్టం చేసింది. చివరకు వారిరువురు ప్రసాదం ఆరంగించారు. ప్రసాదవిశేషంతో ఆండాళమ్మ గర్భవతియై పండంటి కుమారుణ్ణి కన్నది. అతడే రామదేశిక నామాంతరుడైన పరాశరభట్టర్. కాలం సాఫీగా సాగుతోంది.

ఆ రోజుల్లో చోళదేశాన్ని క్రిమికంఠుడనే రాజు పరిపాలించేవాడు. అతడు విష్ణుద్వేషి. అతనికి తగ్గవాడే మంత్రి. అతడు శైవప్రాచుర్యార్థం ఒక సలహా రాజుకు సూచించాడు. 'శివాత్పరతరం నాస్తి' అనే వాక్యం క్రింద రాజరికంలోనివారు సంతకం చేయమనడం. భక్తితో, భయంతో ఎందరో సంతకం-కొందరు సంతకాలు చేశారు. రామానుజులవారంతటివారు సంతకం చేస్తే తమ ధ్యేయం సార్థకమౌతుందని మంత్రి చెప్పగా రాజు రామానుజులను తీసుకు రమ్మని సైనికులను పంపించాడు. వారు శ్రీరంగం చేరారు. ఆసమయంలోనే రామానుజులు కావిబట్టలు, దండకమండువులను ఒకచోట ఉంచి స్నానమాడ వెళ్లారు.

కూరేశులు ఆలోచించారు. రాజాజ్ఞ కదా! తానే వెళతానని రామానుజులు పట్టుబడితే ఎలా ఉంటుందో ఊహించుకోలేకపోయారు. కూరేశులు గురువుల కాషాయవస్త్రాలను, దండకమండువులను ధరించి తానే సైనికులతో వెళ్లారు. రామానుజులను- సైనికులుగాని, రాజుగాని, మంత్రిగాని అంతకు ముందు చూడనివారు కనుక కూరేశులనే రామానుజులుగా భావించారు. రాజు 'శివాత్పరతరం నాస్తి' అని వ్రాయమంటే చివరకు కూరేశులవారు 'శివాత్పరతరం నాస్తి ద్రోణ మస్తి తతః పరమ్' అని వ్రాశారు. ఈ వాక్యానికి అర్థమేమిటని చోళరాజు అడిగితే. ఆస్థానపండితులు శివ, ద్రోణం రెండు కొలపాత్రలు. శివ అనే పాత్రకంటే ద్రోణపాత్ర పెద్దదని వారు వివరించారు. చోళుడు ఆగ్రహావేశ పరుడై తత్క్షణమే కూరేశుల కళ్లుపీకం డని భటులకు ఆనతిచ్చాడు. కూరేశులు ప్రాకృతనేత్రాలు కోల్పోయారు. రామానుజులవారు కూరేశులకు పట్టిన దుర్గతిని తలపోసి తల్లడిల్లిపోయారు. చివరకు కూరేశులను కలుసుకొని కరివరదుడైన వరదరాజస్వామిని ప్రార్థించమని అదేశించారు. వరదరాజస్తవం పఠించగానే వరదుడు సంతోషించి దయతో ఆయనకు దృష్టి అనుగ్రహించా డని ఐతిహ్యం.



కూరేశులవారు శ్రీస్తవం, సుందర బాహుస్తవం, అతి మానుషస్తవం, శ్రీ వైకుంఠస్తవం, శ్రీవరదరాజస్తవములనే రచనలు చేశారు.

కూరేశుల అన్నదానవితరణ, కనకాది సంపదలపట్ల వైముఖ్యం, భగవద్రామానుజులపట్ల గల ఆచార్యనిష్ఠకు సాటి రాగలవారు శ్రీవైష్ణవులలో లేడనడం అతిశయోక్తికాదు.

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## జనవరి 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | 31 | | | | | |

## ఫిబ్రవరి 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | | | | | |

## మార్చి 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |



### జనవరి

01 ఆంగ్లసంవత్సరాది
07 - 13 శ్రీఆండాళ్ నీరాట్టోత్సవం
13 వైకుంఠఏకాదశి
14 భోగిపండుగ
15 సంక్రాంతి
16 కనుమ, గోదాపరిణయం
17 రామకృష్ణతీర్థముక్కోటి
18 తిరుమల శ్రీవారిసన్నిధిన ప్రణయకలహమహోత్సవం
22 శ్రీత్యాగరాజస్వామి ఆరాధన
26 భారతగణతంత్రదినోత్సవం

### ఫిబ్రవరి

01 శ్రీపురందరదాసు ఆరాధన, చొల్లంగి అమావాస్య
02-10 దేవునికడప, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవం
05 వసంతపంచమి
08 రథసప్తమి, భీష్మాష్టమి
12 భీష్మఏకాదశి
16 శ్రీకుమారధారతీర్థ ముక్కోటి
20-28 శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవం
22 తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవప్రారంభం

### మార్చి

01 మహాశివరాత్రి
10-18 తరిగొండ, శ్రీలక్ష్మీనరసింహస్వామిబ్రహ్మోత్సవం
13-17 తిరుమల శ్రీవారి తెప్పోత్సవం
18 శ్రీలక్ష్మీజయంతి, తుంబురుతీర్థ ముక్కోటి
29 శ్రీ అన్నమాచార్యవర్ధంతి
30 తిరుపతి శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవప్రారంభం

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## ఏప్రిల్ 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

## మే 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

## జూన్ 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | | |

### ఏప్రిల్

02 శ్రీ శుభకృత్‌నామ సంవత్సర 'ఉగాది'
03 మత్స్యజయంతి
06-14 వాయల్పాడు, శ్రీపట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవం
10-18 ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవం
10 శ్రీరామనవమి
14 తమిళసంవత్సరాది, అంబేద్కర్ జయంతి
14-16 తిరుమల శ్రీవారి వసంతోత్సవం
16-24 నాగులాపురం శ్రీవేదనారాయణస్వామి బ్రహ్మోత్సవం

### మే

01 మే డే
03 అక్షయతృతీయ, పరశురామజయంతి
05 శ్రీరామానుజ జయంతి
06 శంకర జయంతి
10 - 12 తిరుమల శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయం
13 - 21 హృషీకేశ్, నారాయణవనం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవం
14 - 17 తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవం
14 శ్రీనృసింహజయంతి
15 శ్రీకూర్మజయంతి, తరిగొండవెంగమాంబ జయంతి
16 శ్రీఅన్నమాచార్య జయంతి
17 తిరుపతి గంగజాతర
23 - 31 కార్వేటినగరం, శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవం
25 శ్రీహనుమజ్జయంతి

### జూన్

05 - 13 తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం
10 - 18 అప్పలాయగుంట, శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం
10 - 14 తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి తెప్పోత్సవం
12 - 14 తిరుమల శ్రీవారిజ్యేష్ఠాభిషేకం
14 ఏరువాకపూర్ణిమ

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## జూలై 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| 31 | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

## ఆగష్టు 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

## సెప్టెంబర్ 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | |

### జూలై

01 పూరీజగన్నాథ రథయాత్ర

03 - 05 శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామి సాక్షాత్కారవైభవం

09 - 11 తిరుపతి శ్రీగోవిందరాజస్వామిజ్యేష్ఠాభిషేకం

09 - 12 తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవం

10 తొలిఏకాదశి

13 గురుపూర్ణిమ

17 తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానం

23 ఆడికృత్తిక

### ఆగష్టు

01 నాగచతుర్థి

02 గరుడపంచమి

05 శ్రీవరలక్ష్మీవ్రతం

06 తరిగొండవెంగమాంబ వర్ధంతి

07-10 తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం

11 శ్రీవిఖనస మహాముని జయంతి, శ్రావణపూర్ణిమ

12 శ్రీహయగ్రీవజయంతి

13 గాయత్రీజపం

15 భారతస్వాతంత్ర్యదినోత్సవం

19 శ్రీకృష్ణాష్టమి, గోకులాష్టమి

27 పోలాల అమావాస్య

29 శ్రీబలరామ జయంతి

30 శ్రీవరాహజయంతి

31 వినాయకచవితి

### సెప్టెంబరు

05 ఉపాధ్యాయ దినోత్సవం

07 శ్రీవామనజయంతి

07 - 10 తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవం

09 అనంతపద్మనాభవ్రతం

25 మహాలయ అమావాస్య

26 శరన్నవరాత్రారంభం

27 నుండి అక్టోబరు 05 వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## అక్టోబర్ 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | 31 | | | | | |

## నవంబర్ 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | | | |

## డిసెంబర్ 2022

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

### అక్టోబరు

01 తిరుమల శ్రీవారి గరుడసేవ
02 సరస్వతీపూజ, గాంధీజయంతి
03 దుర్గాష్టమి
04 మహర్నవమి, తిరుమల శ్రీవారి రథోత్సవం
05 విజయదశమి
12 అట్లతద్దె
24 నరకచతుర్దశి, దీపావళి అమావాస్య
25 కేదారగౌరీవ్రతం
29 నాగులచవితి

### నవంబరు

01 తిరుమల శ్రీవారి పుష్పయాగం
05 కైశికద్వాదశి
07 కార్తికపౌర్ణమి
14 బాలలదినోత్సవం
20-28 తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవం
21 శ్రీధన్వంతరి జయంతి
24 తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి గజవాహనోత్సవం
28 పంచమీతీర్థం
29 తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి పుష్పయాగం,
స్కందషష్ఠి

### డిసెంబరు

04 గీతాజయంతి
05 శ్రీచక్రతీర్థముక్కోటి
06 తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామి సన్నిధిన కృత్తికాదీపోత్సవం
07 శ్రీదత్తజయంతి
17 ధనుర్మాసం ప్రారంభం
22 తిరుమల శ్రీవారి సన్నిధిన అధ్యయనోత్సవారంభం

బడి గుడి లాంటిదే!

విద్యకు నిలయమైన బడి-దైవసన్నిధి గుడితో సమానం. అయితే గుడి, బడి రెండూ ప్రత్యక్షంగా ఒక్కచోటే కొలువైన విద్యానిలయం శ్రీపద్మావతీ మహిళాకళాశాల(ఎస్.పి.డబ్ల్యు.సి). తిరుమల తిరుపతి దేవస్థానములవారి ఆధ్వర్యంలో సుమారు ఏడుదశాబ్దాల క్రితం స్థాపితమైన ఈ వనితా కళాశాల ఎందరో విద్యార్థినులకు మణిదీపం.

ఈ ప్రసిద్ధకళాశాల తిరుపతిక్షేత్రం-చారిత్రక చంద్రగిరి దుర్గం రహదారిలో శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయానికి దక్షిణంగా కొంచెం లోపలికి ఉంటుంది.

ఎన్.సి.సి.ఆఫీసు, పోలీస్‌స్టేషన్, పద్మావతీఅతిథి, గృహం, తి.తి.దే. ఈ.ఓ., జె.ఈ.ఓ.ల బంగళాలు దారికి అటు నిటు కానవస్తాయి. కళాశాల ముంగిట 1891 సం॥ నాటి తిరుపతి- పాకాల- కాట్పాడి రైల్వేలైను వనితా విద్యా సరస్వతిపవిత్రతకు లక్ష్మణరేఖలా పోతూంటుంది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే పద్మావతీ మహిళా కళాశాల ఆవరణలో అద్భుతమైన ప్రాచీన ఆలయసముదాయం నేటికీ శ్వాసిస్తూనే ఉంది.

మన దేవాలయాలు

నాలుగు గుళ్లు, రెండు కోనేర్లు, ఒక బావి ఉన్నాయి. 19వ శతాబ్దపు హథీ రాంజీ మహంతుల కాలంనాటి ఓ శిథిల గుడి మినహా మిగతా మూడుదేవళాలు, కోనేర్లు విజయనగరరాజుల పాలనసౌరభానికి ప్రతీకలు. 16వ శతాబ్దం నడిమికాలంనాటి ఈ వాస్తుశిల్ప, మూర్తిలక్షణాల స్మృతిచిహ్నాలు ఈ ప్రాంత పురాతత్త్వచరిత్రకు సాక్ష్యాధారాలు.

1952 సం॥ లో శ్రీవేంకటేశ్వరస్త్రీల కళాశాల పేరుతో మొదటి మహిళాకళాశాలస్థాపన జరిగినా 1956 సం॥లో పేరు మారి శ్రీపద్మావతీ మహిళాకళాశాల(ఎస్.పి.డబ్ల్యు.సి)గా ఆవిర్భవించింది. 1963 సం॥లో సొంత భవనాలు వచ్చాయి.

ఆ రోజుల్లో ఈ ప్రాంతాన్ని **మహంతు తోట** అని పిలిచేవారు. తిరుపతినుండి ఈ తోటకు దారితీసి, తిరిగి చంద్రగిరి రహదారిని కలుసుకునే దోవను **రింగ్‌రోడ్డు**గా వ్యవహరించేవారు. కొండమీది శ్రీవేంకటేశ్వరస్వామి తిరుపతికి పెద్ద వరం. తి.తి.దే. యాజమాన్యం తిరుమల, తిరుపతి అవసరాలకు అక్షయపాత్ర.

# కళాశాల ఒడిలో కమనీయ గుడిగోపురాలు!

ఫోటోల సౌజన్యం-ట్రెక్కింగ్ బాలు

- శ్రీ బి.వి.రమణ



శ్రీస్వామిభక్తవరేణ్యులైన ఎందరెందరో ఆచార్యులు, సామంతులు, దండనాథులు, దేవదాసీలు యథాశక్తి భక్తయాత్రికుల సంక్షేమార్థం వివిధ జనోపయోగ పుణ్యకార్యక్రమాలు చేపట్టారు. తద్వారా తిరుపతిక్షేత్రాన్ని నందనోద్యానవనంగా మలచారు. ఈ నేపథ్యంలో విజయనగరసామంతులైన చంద్రగిరి దుర్గాధిపతులు, దైవంతో అనుసంధానమైన ఇతరరాజప్రతినిధులు ఎన్నో ప్రజోపయోగకార్యాల్లో పాలుపంచుకున్నారు. గుడిగోపురాలు, మండపాలు, వాపీకూపతటాకాలు నిర్మించారు. వీరి హయాంలో రమారమి క్రీ.శ.1530-1560 సం॥ల నడుమ తిరుమల, తిరుపతి పరిసరాల్లో ఎన్నో దీప్తిమంతమైన కట్టడాలు చోటు చేసుకున్నాయి. వాటిల్లో మేటి నేటి శ్రీపద్మావతీ మహిళా కళాశాల ప్రాంగణంలోని చతుర్భుజకోనేరు, ఇతరవైష్ణవ ఆలయాలు.

**చతురస్రాకారమైన కోనేరు** ఒకదైవిక జ్యామితీయ (Sacred geometry) శిల్పకళాఖండం, సమున్నతవిజయనగర వాస్తుపరిణామశీలతకు కొలమానం. రాజధానిహంపీలో ఇలాంటి జలసాంకేతికతను చూడవచ్చు. తమ మహాసామ్రాజ్యంలో చిన్నపాటి ప్రదేశమైన తిరుపతిలాంటి చోట్లసైతం ఈ మాదిరి సార్వకాలీనవైభవోపేతనిర్మాణాలు చేపట్టడం అంటే వారు తిరుపతి క్షేత్రానికి ఇచ్చిన ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటి శ్వేతభవనం పద్మావతీ అతిథిగృహాల దగ్గర పలుకోనేర్లు, కుంటలుండేవి. శ్వేతకు పశ్చిమంగా హథీరాంజీ మఠం అధికారులు, గురువుల సమాధులు కొన్నింటిని నేటికీ చూడవచ్చు. దేవస్థానాల చివరి విచారణకర్త మహంతు శ్రీప్రయాగ దాసజీహయాంలోని కీలక అధికారి రామ్ లఖన్ దాస్. వీరి సమాధిసైతం వీటిల్లో ఒకటి. 1909 సం॥లో తిరుమల గర్భగుడి మీది ఆనందనిలయవిమానానికి బంగారు మలామా చేయించినపుడు అధికారి రామ్ లఖన్‌దాస్, కీలకపాత్ర వహించారు.



దక్షిణంగా స్వర్ణముఖిఏటిలో సంగమించడానికి తహతహలాడే నీటిపాయలనడుమ దిబ్బపైన మహంతుల తోట నెలకొని ఉండేది. జలలభ్యతను దృష్టిలో పెట్టుకుని అప్పటికే ఉన్న చిన్నపేటలాంటి వనప్రదేశంలో గుడి గోపురాలు నిర్మించారు విజయనగరప్రభువులు. పుష్కలమైన ఊటజలాలకు ఆలవాలం కనుకనే ఆ నిర్దిష్టస్థలంలో సువిశాల "చతుష్కోణ కోనేరు" ప్రాణం పోసుకుంది.

**తిరువేంకటనాథయాదవరాయలు క్రీ.శ.1332 సం॥ తిరుపతిని శ్రీస్వామి వారి సర్వమాన్యంగా ప్రకటించాడు.** 16వ శతాబ్ది ప్రథమార్ధానికే నలుమూలలా విస్తరించిన పెద్దపట్టణం తిరుపతి, తిరుపతి ప్రధానంగా ముచ్చటైన మూడు వాటర్ షెడ్‌ల ఆలంబనతో వెలిగే జనావాసం. ఒకటి కపిలతీర్థం వాటర్‌షెడ్ (4.8 చ.కి.మీ.) రెండవది మాల్వానిగుండం (4.5 చ.కి.మీ), మూడోది ఎస్వీ యూనివర్సిటీ వాటర్ షెడ్ (3.6 చ.కి.మీ) ఎస్వీ విశ్వవిద్యాలయం జలమండలే నేటి ఎస్వీడబ్ల్యు కళాశాల పరిసర సాంస్కృతిక వైవిధ్యానికి జీవాధారం.

తిరుపతికి పశ్చిమాన ఉన్న **తిరువేంకటాపురం** స్థలమే నేటి పద్మావతీ మహిళా కళాశాలలోని శిథిలాలయ సముదాయం.

విజయనగరచక్రవర్తి అచ్యుతదేవరాయలు పృథవీ సామ్రాజ్యాన్ని ఏలుతున్న కాలంలో చంద్రగిరిదుర్గానికి చెందిన భూతనాథ భట్టరయ్య హయాంలో క్రీ.శ. 1530-1535 సం॥ల మధ్య చంద్రగిరిలో శ్రీరఘునాథఆలయం నిర్మితమైంది.

ఇంచుమించు ఇదేకాలంలో మరో రఘునాథస్వామిదేవళం తిరుపతి తిరువేంకటాపురంలో కొలువైంది. శ్రీస్వామివారి స్నపన తిరుమంజనం, తెప్పోత్సవాల నిమిత్తం పెద్దకోనేరును త్రవ్వించారు. ఆ తర్వాత ఆరవీటివంశజుల హయాం లోనూ ఈ ప్రాంతం ఎంతో వైభవాన్ని చవిచూచింది. ప్రస్తుత ప్రధానఆలయం, ఉపాలయాల్లోని విగ్రహాలు, ఉత్సవమూర్తులను, దొంగ లెత్తుకెళ్ళారు. నగలను, ఆలయసామగ్రిని దోచుకున్నారు.

క్రీ.శ.1613 సం॥లో విజయనగరచక్రవర్తి రెండవ వేంకటపతిరాయలు శ్రీవేంకటేశ్వరస్వామికి, తిరుపతిలోని నాచ్చియార్‌కు చంద్రగిరి, గొల్లపల్లెలలో కొన్ని వ్యవసాయభూములు, తోటలు దానం చేశారు. ప్రస్తుత పద్మావతి కళాశాల ప్రాంగణం గొల్లపల్లి ఇతర పరిసర భూములపరిధిలోనిదే!!

నాటి భారతప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రారంభించిన శ్రీదేవి హాస్టల్‌కు ఎదురుగా గల ప్రదేశంలో ఉపాలయాలతో కలిపి మొత్తం మూడుదేవళాలు. కుడిపక్కగల గుడి మాత్రం అర్ధమండపం, అంతరాళం, గర్భగృహాలతో నిలిచి ఉంది. గర్భగుడి మీది విమానం ఇంకా తన ప్రాచీనతను చాటుతూ ఉండడం గమనార్హం. అన్ని దేవళాలు తూర్పుముఖాభి ముఖంగా ఉండటం విశేషం. ఎడమపక్క కనిపించే తొలి ఆలయాన్ని తి.తి.దే. వారు 2005 సం॥ ఫిబ్రవరిలో పునరుద్ధరించి శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంగా తీర్చిదిద్దారు. ద్రావిడాగమరీతితో విమానాన్ని ఏర్పరిచి అమ్మవారివిగ్రహమూర్తిని గర్భగుడిలో నిలిపారు. వైఖానస ఆగమరీతిలో మూల విగ్రహానికి పూజాదికాలు సాగుతున్నాయి. ద్వారం గడపపైన సర్వశుభసంపదలను ఇచ్చే గజలక్ష్మీ అమ్మవారిశిల్పం కదురమణీయం. గర్భాలయద్వారబంధాలకు మధ్య యుగరాజరికపు చక్కని పనితనంతో కూడిన శిల్పచమత్కృతి అదనపు అందం. పైకప్పు లేని విశాలమైన నమిడి గుడిని ప్రస్తుతం కళాశాల అవసరాలకు వినియోగిస్తున్నారు.

ఈ ఆలయసముదాయానికి నైరుతిన ఉన్న చక్కటి రాతిమెట్ల పుష్కరిణి పూడిపోయింది. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమయ్య కుమారుడు పెద తిరుమలయ్య సైతం ఈ ప్రాంతంలో ఒక మండపాన్ని కట్టించినట్లు చెబుతారు.

పాతఆలయాలకి ఆగ్నేయ దిక్కున శ్రీనివాస హాస్టల్‌కు ఎదురుగా మూడు ప్రధానద్వారాలతో కూడిన **దిగుడు మెట్ల చతురస్రాకారకోనేరు నేత్రమోహనం.** తూర్పు, ఉత్తర, దక్షిణ ద్వారమార్గాలు, పొడవాటి నడవాలతో ఒప్పారే సాంకేతిక విభ్రమం. నెత్తిన స్లాబులాగా పరచిన బండల పైకప్పుతో అష్టభుజి జ్యామితీయ కోణాలతో కూడి అంచలంచెల పడికట్ల వరుసలతో, నిలువుపాటి శిలాశిల్పస్తంభాలతో, నడిబొడ్డున గుండ్రటి పిల్లబావితో వెలుగునీడల దోబూచులాటతో ఆధ్యాత్మికవాతావరణాన్ని, ప్రతిబింబిస్తాంటుంది. ఇదో భూగర్భ కళాఖజానా! దేవుళ్ల దర్బారు! హృదయస్వాంతనం అందించే స్వస్థతాస్థలి! పుడమిపొత్తిళ్లఉయ్యాల! ఉయ్యాలతొట్టెలాంటి నడిమిభాగాన నిలుచుంటే, వీచే గాలులతో కూడిన నాటి నీటి అలల లయాత్మకతను ఇప్పటికీ అనుభూతి చెందవచ్చు.

దేవుళ్లు, పురాణాలు, ఇతిహాసాలు, సామాజికాంశాలు, సాంస్కృతిక సన్నివేశాలు... నలుచదరపు ఆధారస్తంభాలపై స్నిగ్ధంగా కుదురుకున్నాయి. నాటి మహోన్నతవిజయనగరవాస్తుశిల్పలక్షణ శైలికి మకుటాయమానంగా నిలిచి చూపరుల మనస్సులు దోచుకుంటుంటాయి.





బ్రహ్మస్థానంలాంటి చోటమాత్రం పాతాళగంగ పెల్లుబికేలా చూసే దిగుడుమెట్లపిల్లబావిని తవ్వారు. అష్టదిక్పాలకులకు ప్రతీకగా అష్టభుజాల జ్యామితీయతను ఎంతో చక్కగా పల్లవింపచేశారు. అంతిమంగా చతుష్కోణసరస్సులో అష్టకోణ దృక్కోణాన్ని సాధించారు. నడిబొడ్డు పిల్లబావి అనుకుని సాచిన రాతితిన్నె- స్నపన తిరుమంజనం సందర్భంగా ఉత్సవమూర్తులను ఉంచే ఆస్థానపీఠం. ఒక విధంగా తిరుపతి పరిసరప్రాంతాలలో ఇంకెక్కడాలేని విధంగా తాము మాత్రమే కలిగిఉన్న ఈ దివ్యభవ్య కోనేరు ఎంతో పేరుప్రతిష్ఠలున్న ఎస్.పి.డబ్ల్యు. కళాశాలకు పెద్ద వారసత్వ సంపద. నీళ్ళు ఇంకిపోయినా సౌందర్యరసం ఇసుమంతైనా తగ్గకపోవడం ఈ జగన్మోహనాకార కోనేరు విశిష్టత. నవరసాలు అభినయించే అనల్ప స్తంభశిల్పాల ఈ కళాత్మక ఆంఫీ థియేటర్-తిరుపతి క్షేత్రచరిత్ర లోకానికే గొప్ప స్మృతిచిహ్నం.

మధ్యయుగాల్లో విజయనగర రాజధాని హంపీలోని చతురస్ర, దీర్ఘచతురస్ర, అష్టభుజి కోనేర్లు పేరెన్నికగన్నవి. అయితే, అవి ఎక్కువభాగం స్నానశాలలు. తిరుపతి పరిసరాల్లోని శ్రీకాళహస్తి, కార్వేటినగరం రాజాంతఃపురాలకు చెందిన జలకోనేర్లుసైతం చక్కటి శిల్పవాస్తుతో అలరారే రాజులు, రాణుల స్నానశాలలే! జలక్రీడావినోదవిహారప్రాంగణాలే! వీటికి భిన్నంగా ఎస్.పి.డబ్ల్యు.కళాశాలలోని విలక్షణ జలకుండం దైవావసరాల నిమిత్తం రూపొందిన దిగుడుమెట్ల నుయ్యి కావడం విశేషం.

మొత్తం 28 స్తంభాలు. వాటిపై వ్రేలాడే చిత్రపటాల్లాగా దాదాపు 400కు పైగా శిల్పాలు. ఈ ప్రాంతంలో కాసెరాయిగా పిలిచే గ్రానైట్ కాన్వాసుపై గండరించిన మత్స్యాలు. పురాణజంతువులు, దేవుళ్లు, అవతారమూర్తులు, దేవదాసీలు, నాట్యగత్తెలు, వాద్యకారులు, ఆచార్యుల శిల్పాలు మనల్ని కట్టిపడేస్తాయి. గొంతు క్కూర్చుని గంభీరంగా అగుపించే సింహశ్రేష్ఠం (squatting Lion) చిహ్నం దాదాపు ప్రతి స్తంభానికీ ఉంది. అట్లే వివిధభంగిమల నృసింహుడు, హనుమంతుని రూపాలూ ఆకట్టుకుంటాయి. సాధారణంగా విజయనగర నిర్మాణాల్లో ఆలయవాస్తు (sacred Architecture) ప్రముఖంగా ప్రతిబింబిస్తుంది. అంతా వైష్ణవశిల్పవ్యాకరణమే. అన్నీ వైష్ణవలీలావిభూతిని విడమరిచే శిల్పాలే. దీన్నిబట్టి నిర్మాణసారథులైన నాటిరాజులపై అప్పటి కుమారతాతయ్యంగార్‌లాంటి వైష్ణవమతాచార్యుల గణనీయప్రభావం ద్యోతకమౌతోంది.

స్థాపత్యవేదంగా పిలిచే శిల్పశాస్త్రంలో వాపీకూపతటాకనిర్మాణాలు ఒక ముఖ్యవిభాగం.

నిర్దిష్టనిర్మాణం చేపట్టడానికి ముందు భూపరీక్ష, దిక్సాధన జరగాలి. భూమాపనం నిర్వహించాలి. వాస్తుపురుషుడి ఆధారభూతంగా వాస్తుమండలాన్ని లిఖించాలి. ఆలయకట్టడం ప్రకారం అయితే గర్భగుడిలోని నట్టనడిస్థానం బ్రహ్మస్థానం. (అక్కడే మూలమూర్తిని ప్రతిష్ఠిస్తారు.) ఈ కోనేరు



ఇవన్నీ, ఒక ఎత్తు. హథీరాంజీ మహంతుల హయాంలో నిర్మించిన **శ్రీదేవీ, భూదేవీ సమేతశ్రీకల్యాణ శ్రీవేంకటేశ్వరస్వామిఆలయం** మరో ఎత్తు.

1933 సం॥వరకు తొమ్మిది దశాబ్దాలు మహంతుల ఏలుబడి సాగింది. తమ హయాంలో మహంతుమఠానికి ఇదో ముఖ్యకూడలి స్థానం.

కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించి గుడిపక్కకు ప్రయాణించి కొంచెం ముందుకు చూస్తే తొలుత మహంతుల శిథిలాలయమే కనపడుతుంది. చెట్లపొదల మధ్య పోటీ పడుతూ ఆలయగోడలు ఎత్తుగా అగుపడుతాయి.

విజయనగర ఆలయశిల్పశైలికి కాసింత భిన్నమే అయినా దేవాలయ వైష్ణవ ఆగమాన్ని అనుసరించే మహా, ముఖ, అర్ధమండపాదులను వెలయింపచేశారు. అంతరాళంతో కూడిన గర్భగుడిపై ఉత్తరదేశీయులు ఎక్కువగా వాడే నాగరశైలిలో విమానగోపురాన్ని నిర్మించారు.

భజనలు, పారాయణాలు, గోష్ఠుల నిమిత్తం తీరైన తిన్నెలు, విశాలమైన నడవాలను అందమైన ఆర్చీల గోడల మాటున తీర్చిదిద్దారు. శిథిలస్వరూపమైనా సొగసు చెడని ఈ వైష్ణవాలయం ఎదురుగా మూలమూర్తికి అభిముఖంగా సౌందర్యోపేతమైన చిన్నగరుత్మంతుని మందిరం వెలసి ఉంది. గరుడమందిరానికి వెనుక చూడచక్కని తగుమాత్రమైన మంచి నీటిబావి ఆనాటి ఆలయ అవసరాలను తీరుస్తుండేది. కపిల తోలి నీరు పారించడానికి వీలుగా గారతో తీర్చిన పొడవాటి కాలువ నేటికీ చెక్కుచెదరలేదు.

మహంతుల కాలంనాటి ఓ ధృఢమైన ఉక్కుగొలుసు నుయ్యిలోకి నాగుపాములా వేలాడుతూ ఉంది. శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారలకు గుర్తుగా ముగ్గురు మూర్తులు ఉన్న చిహ్నాలు విగ్రహపీఠంపై గమనించవచ్చు. దేవస్థానంలో విచారణకర్తలుగా ఒక వెలుగు వెలుగుతున్నపుడు మహంతులు ఈ దేవాలయం చుట్టూ దశావతారవిగ్రహాలు నిలిపి, ఉపాలయాలు నిర్మించాలనుకున్నారు. అందులో భాగంగా పది అవతారమూర్తుల విగ్రహాలనుసైతం సిద్ధం చేయించారు. అయితే అధికారం పోవడంతో ఆ ఆలోచన అటకెక్కినట్లు విగ్రహమూర్తులన్నింటినీ తిరుమల హథీరాంజీ



మఠంకు తరలించారు. మఠంలోని రామాలయం ప్రదక్షిణ మార్గంలోని గదుల్లో వరుసగా ఉన్న ఈ విగ్రహాలను ఇప్పటికీ చూడవచ్చు.

ఎంతో ఘనమైన గతచరిత్రకు తార్కాణంగా జ్ఞాపకాలు నెమరేసుకుంటున్న ఈ అపురూప ఆలయకొలువుకూటం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పాదపీఠాన వెలసిన పద్మావతీ మహిళా కళాశాల సౌభాగ్యం. గొప్పదైవాగారాన్ని కలిగి ఉండడం ఈ విద్యాలయం అదృష్టం.

## గమనిక!

***జనవరి, 2022** సంచికను సంక్రాంతి, ఇతర పర్వదినాల విశేషసంచికగా పాఠకులకు అందిస్తున్నందుకు సంతోషపడుతున్నాం!!*

***అయితే, విశేషసంచికగా సప్తగిరిని తీర్చి దిద్దే క్రమంలో ప్రతినెలా వెలువరిస్తున్న ధారావాహికలను ఈ సంచికలో స్థలాభావంవల్ల ప్రచురించలేకపోతున్నాం. వచ్చే నెలనుండి ధారావాహికలు యథావిధిగా వస్తాయి.***

***పాఠకులు ఈ అసౌకర్యాన్ని అర్థం చేసుకుంటా రని ఆశిస్తున్నాం!!***

– ప్రధానసంపాదకుడు

గృహలక్ష్మి



# ధనుర్మాసంలో దివ్యాన్నాలు

– డా॥ జి.వి.పూర్ణచందు, 94401 72642

నవంబరునుండి జనవరి దాకా సాగే హేమంత ఋతువులో డిసెంబరు నడిమినుండి జనవరి నడిమిదాకా వచ్చే ధనుర్మాసానికి పవిత్రత, విశిష్టతలతో పాటు సామాజిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఈ కాలంలో వాతదోషం ప్రకోపాన్ని, కఫదోష, పిత్తదోషాలు ప్రశమనాన్ని చెందుతాయి. వాతావరణంలో చల్లదనంవల్ల శరీరంలో ఊష్మం బైటకు రాక, జఠరాగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఆకలి పెరుగుతుంది. అలాగని, ఈ సమయంలో కఠినంగా అరిగే పదార్థాలను తింటే వాతం మరింతగా ప్రకోపం చెందే ప్రమాదం ఉంది.

అందుకని, ఘనంగా ఉండి వాతాన్ని ఉపశమింపచేస్తూ, జఠరాగ్నిని సంతృప్తిపరిచే ఆహారపదార్థాలను తీసుకునేలా ధనుర్మాసంలో దివ్యాన్నాలను సూచించారు– మన పెద్దలు. ఈ దివ్యాన్నాలలో పొంగలి, దధ్యోదనం ముఖ్యమైనవి. వాతాన్నీ, వేడినీ తగ్గిస్తాయి. వాతం ప్రకోపించి కీళ్లవాతం, నడుంనొప్పి, మోకాళ్లనొప్పులతో బాధపడేవారిని ఇబ్బందిపెట్టే కాలం ఇది. పొంగలి, దధ్యోదనాలు వారికి మేలు చేస్తాయి.

తీపి, పులుపు, ఉప్పు ఈ మూడురుచులు కలిగిన పదార్థాలను ధనుర్మాసంలో తీసుకోవాలి. పాలు, పెరుగు, వెన్న, నెయ్యితో కూడినపదార్థాలు తీపిపదార్థాలు ధనుర్మాసంలో ఆరోగ్యదాయకంగా ఉంటాయి. ప్రతీరోజూ నూనెతో శరీరాన్ని మర్దించుకుని తలంటిస్నానం చేయాల్సిన మాసం ఇది. సూర్య నమస్కారాలు ఈకాలంలో మేలు చేస్తాయి. పొంగలి, పులిహోర, దధ్యోదనం ఇలాంటివి ధనుర్మాసానికి అనువైన ఆహార ఔషధాలు! ధనుర్మాసంలో ఈ దివ్యాన్నాల గురించి కొంత పరిశీలన చేద్దాం.

## పొంగలి

పొంగలిని తీపివంటకంగానూ, కారపువంటకంగానూ రెండురకాలుగా వండుకుంటారు. తీపి పొంగలిని చక్కెరపొంగలి అని, కారపు పొంగలిని కటు పొంగలి అనీ పిలుస్తారు. ఇవి చక్రపొంగలి అనీ. కట్టె పొంగలి అనీ జనవ్యవహారంలో మార్పులు పొందాయి.

పెసరపప్పు, చక్కెర, బియ్యం కలయికగా 'చక్కెర పొంగలి' తయారు చేస్తారు.

తెలుగునేలమీద తొలిగా పండించిన పంటలలో పెసర ఒకటి. పైరు అంటే పెసర చేను అని! వరి బియ్యం, పెసరపప్పు, పంచదార (చక్కెర), నెయ్యి కలిపి తయారుచేసిన ఈ చక్కెర పొంగలిలో తెలుగుదనంతో పాటు తెలుగుజాతి ప్రాచీనత కూడా ధ్వనిస్తుంది. ఈ చక్రపొంగలిలో యాలకులు, జీడిపప్పు, పచ్చ కర్పూరం లాంటివి చేర్చటంవల్ల సుగంధభరితంగా ఉంటుంది. పచ్చకర్పూరం కలిస్తే మనసులో ఒక విధమైన ఆధ్యాత్మికభావన



కలుగుతుంది. పచ్చకర్పూరం కలిపితే ఏ వంటకం అయినా దేవాలయానికి వెళ్లిన అనుభూతినిస్తుంది. ఎవరైనా గుడికి వెళ్లి ప్రసాదం తెచ్చి ఇస్తే, దైవదర్శనం చేసుకున్న భావనతో కళ్లకద్దుకుని తీసుకుంటాం. ప్రసాదం ఇలా భక్తిభావన కలుగచేసేదిగా ఉండాలి. మసాలాలు దట్టించిన పలావులు, బిరియానీల్ని నైవేద్యంగా ఎందుకు పెట్టరంటే అవి ఆధ్యాత్మికభావన కలిగించలేవు కాబట్టి!

తీపి కలపకుండా బియ్యం, పెసరపప్పు, నెయ్యి, ఉప్పు మిరియాలు జీలకర్ర వీటిని తగుపాళ్లలో కలిపి 'కటుపొంగలి' తయారుచేస్తారు. ఈ రెండు పొంగళ్లూ ముఖ్యంగా శీతా కాలంలో మేలుచేసేవిగా ఉంటాయి.

## పులిహోర

తెలుగింటి పచ్చదనం పులిహోర! ఇంటికి మామిడి తోరణంకట్టి, పులిహోర వండుకున్నారంటే ఆ ఇల్లు పండుగ వాతావరణంతో కళకళలాడుతుంది.

ఇప్పటిరోజుల్లో పులిహోరని కేవలం చింతపండురసం పోసి టామరిండ్ రైస్ పేరుతో తయారుచేస్తున్నారు. అది హానికరమైంది. ఆరోగ్యదాయకమైన పులిహోర ఆరురుచులు కలిగి ఉండాలి.



తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదురుచులు కలిగిన ద్రవ్యాలను తగుపాళ్లలో కలిపి తయారు చేస్తేనే ఆ పులిహోర వాతపిత్త, కఫదోషాలు మూడింటినీ సమస్థితిలో ఉంచుతుంది.

ఆరురుచుల్లో తీపికోసం కొద్దిగా బెల్లం, పులుపు కోసం కొద్దిగా చింతపండు రసం, తగినంత ఉప్పు, కారాలనూ, వగరూ చేదురుచులకోసం ఆవపిండి, మెంతిపిండినికూడా చేర్చి, పులిహోరని తయారుచేస్తే అది దివ్యాన్నం అవుతుంది. శీతకాలానికి అనుకూలంగా ఉంటుంది. వేడి చెయ్యకుండా ఉంటుంది.

అతిగా పులుపు, అతిగా కారం చేరిస్తే ఆ పులిహోర పైత్యకారి అవుతుంది. పులిహోరలో కొద్దిగా మెంతిపిండి, కొద్దిగా ఆవపిండి కలిపి కొంచెంసేపు మూతపెట్టి ఉంచితే ఘాటుగా, పరిమళభరితంగా జీర్ణశక్తిని పెంపు చేసేదిగా ఉంటుంది.

'పసిడి'కి ప్రతిరూపం పసుపు! వర్ణంలోనే కాదు గుణంలో కూడా పసుపు బంగారమే! దగ్గరుండి మర పట్టించిన పసుపు కేన్సరుకి ఔషధంగా పనిచేస్తుంది. పులిహోరలో పులుపు ఒక అనుబంధరుచిమాత్రమే గానీ ప్రధానరుచిగా ఉండకూడదు. పటికబెల్లం, ఆవపిండి, మెంతిపిండి ఇవి చింతపండు దోషాలకు విరుగుడుగా పనిచేస్తాయి. ఆరోగ్య దాయకమైన పులిహోరకి ఇదీ ముఖ్యమైన అంశమే కదా! జీడిపప్పులాంటివి చేర్చటంవల్ల అదనపు ఆరోగ్యప్రయోజనాలు చేకూరుతాయి.

## దధ్యోదనం

ఓదనం అంటే అన్నం. దధి అంటే పెరుగు. వేడివేడి అన్నంలో పెరుగు కలిపి, కమ్మగా తాలింపు పెట్టిన అన్నాన్ని దధ్యోదనం అన్నారు. ధనుర్మాసం చలి సమయంలో ఉదయాన్నే తినటానికి అనువైన దివ్యాన్నం దధ్యోదనం! వేడి అన్నంలో పెరుగు వేసుకుని తింటే కరోనాలాంటి వ్యాధుల్ని ఎదుర్కొనేలా శరీరానికి ఇమ్యూనిటీ పెరుగుతుంది.



పెరుగు అనేది విశిష్టత కలిగిన ద్రవ్యం. పాలను మజ్జిగతో తోడుపెట్టినప్పుడు. ఆ మజ్జిగచుక్కల్లోంచి ఉపయోగపడే బాక్టీరియా పాలలో పెరిగి తోడుకునేలా చేస్తున్నాయి. ప్రతిరోజూ, కనీసం ధనుర్మాసంలోనైనా ఉదయాన్నే అనారోగ్యకరమైన టిఫిన్లు మానేసి భగవన్నివేదన చేసిన దధ్యోదనాన్ని తీసుకుంటే అది 'ప్రీ-బయటిక్ ఔషధం'గా పనిచేసి పేగుల్ని సంరక్షిస్తుంది. మధుమేహ రోగులుకూడా ఉదయాన్నే టిఫిన్లు మానేసి కొద్దిగా పెరుగన్నం తినటమే మేలు. పెరుగన్నం తింటే ఆరోగ్యం పెరుగుతుంది. ఎముకలు పెరుగుతాయి. జీర్ణశక్తి పెరుగుతుంది. చర్మానికి వన్నెపెరుగుతుంది. శరీరానికి రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

## అరిసెలు



తెలుగువారి వైభోగానికి తీపిగుర్తు అరిసె! తీపి భక్ష్యాలకు రారాజు. తెలుగువారికి సంక్రాంతి అరిసెలపండుగ!

అరిసెలు వండకుండా, తినకుండా మనకు సంక్రాతి వెళ్లదు. పెళ్లిళ్లకు, పేరంటాలకూ అరిసె ఈనాటికీ తప్పనిసరే! పాపాయి నిలబడి అడుగులేస్తోంటే సంబరంగా అరిసెలు పంచుతారు. అరిసెల మీద నడిపిస్తారు.

'అరిసి' అంటే తెలుగులో 'వరిబియ్యం' అని అర్థం. అరిసితో చేసింది అరిసె.

'అరిసి'తో వండిన తీపివంటకం అరిసె. ఇది కఠినంగా అరిగే స్వభావం కలిగి ఉంటుంది. అందుకని అరిసెలు తిన్నాక ఏ ఇబ్బందీ కలగకుండా ఉండేందుకు ధనియాలు, జీలకర్ర, శొంఠి ఈ మూడింటినీ సమభాగాలుగా తీసుకొని దంచి 'తగినంత ఉప్పు కలిపి' ఒక సీసాలో భద్రపరచుకోండి. అరిసెలు తిన్నాక ఓ గ్లాసుమజ్జిగలో ఈ పొడిని చెంచా మోతాదులో కలిపి త్రాగితే తేలికగా అరుగుతాయి. సంక్రాంతిపండుగకు అరిసె ఒక ప్రతీక.

### 2022వ సంవత్సరపు అమావాస్య, పూర్ణిమ, కృత్తిక, ఏకాదశి, మాసశివరాత్రి, ఋతువులు- వాటి తేదీలు

| నెల | అమావాస్య | పూర్ణిమ | కృత్తిక | శుక్ల షష్ఠి | శుక్ల ఏకాదశి | సంకష్ట చతుర్థి | కృష్ణ షష్ఠి | కృష్ణ ఏకాదశి | మాస శివరాత్రి | తెలుగునెల ప్రారంభం | ఋతువులు అయన ప్రారంభములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| జనవరి | 2 | 17 | 13 | 8 | 13 | 21 | 23 | 28 | 1,30 | మార్గశిరమాసంతో ప్రారంభం 3 పుష్యమాసం ప్రారంభం | హేమంత ఋతువు 15ఉత్తరాయణం ప్రా॥ |
| ఫిబ్రవరి | 1 | 16 | 9 | 7 | 12 | 20 | 22 | 27 | -- | పుష్యమాసం 2 మాఘమాసం ప్రా॥ | హేమంత ఋతువు 2శిశిరఋతువు ప్రా॥ |
| మార్చి | 2 | 18 | 9 | 8 | 14 | 21 | 23 | 28 | 1,30 | మాఘమాసం 3 ఫాల్గుణమాసం ప్రా॥ | శిశిరఋతువు |
| ఏప్రిల్ | 1,30 | 16 | 5 | 7 | 12 | 19 | 22 | 26 | 29 | ఫాల్గుణమాసం 2 చైత్రమాసం ప్రా॥ | శిశిరఋతువు 2 వసంత ఋతువు ప్రా॥ |
| మే | 30 | 16 | 2,29,30 | 7 | 12 | 19 | 21 | 26 | 28 | వైశాఖమాసం 31 జ్యేష్ఠమాసం ప్రా॥ | వసంతఋతువు 31 గ్రీష్మఋతువు ప్రా॥ |
| జూన్ | 28,29 | 14 | 26 | 5 | 10 | 17 | 19 | 24 | 27 | జ్యేష్ఠమాసం 30 ఆషాఢమాసం ప్రా॥ | గ్రీష్మఋతువు |
| జూలై | 28 | 13 | 23 | 5 | 10 | 16 | 19 | 24 | 26 | ఆషాఢమాసం 29 శ్రావణమాసం ప్రా॥ | గ్రీష్మఋతువు 29 వర్ష ఋతువు ప్రా॥ 17 దక్షిణాయణ ప్రా॥ |
| ఆగష్టు | 27 | 12 | 19 | 3 | 8 | 15 | 17 | 22 | 25 | శ్రావణమాసం 28 భాద్రపదమాసం ప్రా॥ | వర్ష ఋతువు |
| సెప్టెంబరు | 25 | 10 | 16 | 2 | 6 | 13 | 16 | 21 | 24 | భాద్రపదమాసం 26 ఆశ్వయుజమాసం ప్రా॥ | వర్షఋతువు 26 శరదృతువు ప్రా॥ |
| అక్టోబరు | 25 | 9 | 13 | 1,30 | 6 | 13 | 15 | 21 | 23 | ఆశ్వయుజమాసం 26 కార్తికమాసం ప్రా॥ | శరదృతువు |
| నవంబరు | 23 | 8 | 9 | 29 | 4 | 11 | 14 | 20 | 22 | కార్తికమాసం 24 మార్గశిరమాసం ప్రా॥ | శరదృతువు 24 హేమంత ఋతువు ప్రా॥ |
| డిసెంబరు | 23 | 8 | 7 | 28 | 4 | 11 | 14 | 19 | 22 | మార్గశిరమాసం 24 పుష్యమాసం ప్రా॥ | హేమంతఋతువు |

శ్రీవేంకటేశ్వరలీలలు




# స్వామివారికి మాత్రమే సాధ్యం!

శ్రీ దేవరకొండ విజయప్రసాద్, 90326 44114

తిరుపతి వేంకటేశ్వరస్వామి మా ఇంటి దైవం. తరతరాలుగా ఆ స్వామినే నమ్ము కుని కొలుచుకుంటున్నాం. ఇంట్లో ఏ శుభకార్యక్రమం అనుకున్నాముందుగా స్వామికి నమస్కారం చేసుకున్న తర్వాతనే పనులు ప్రారంభిస్తాం. ఇంట్లో ప్రతి ఒక్కరికీ శ్రీవేంక టేశ్వరస్వామివారంటే అంత నమ్మకం.

సాధారణకష్టాలు తప్ప శ్రీనివాసుడిదయతో మాకు భయంకరమైన కష్టాలు రాలేదు. కొద్దిపాటి కష్టాలు వచ్చినా, వాటిని స్వామిదయతో నెట్టుకువచ్చాం. కానీ, ఇంతకాలంలేని కష్టమిప్పుడొచ్చింది. నా బిడ్డకు మూడేళ్లునిండినా మాటలు రాలేదు. మనం చెప్పినవన్నీ అర్థం చేసుకుంటాడు. దానికి అనుగుణంగా అన్ని పనులూ చేస్తాడు. కానీ తిరిగి మాట చెప్పలేడు. అన్నీ సైగలతో చెబుతాడు. లేదంటే మూగశబ్దాలు చేస్తాడు. ఎప్పుడో ఓసారి మాత్రం అత్త, తాత అంటాడు. అంతకు మించి మరే మాట బిడ్డనోటి నుంచి వచ్చేది కాదు.

ఇది మాకు అంతులేని ఆవేదన కలిగించింది. ఎందరో వైద్యులకు చూపించాం. స్పీచ్‌థెరపీ చేయించినా మాటరాలేదు. ఎంత ప్రయత్నించినా ఒక్క అక్షరం కూడా పలికేవాడు కాదు. రోజులు గడుస్తున్నకొద్దీ మాకు ఆవేదన ఇంకా పెరిగిపోతోంది. ఏం చెయ్యాలో




దిక్కుతోచటం లేదు. ఉన్న ఒక్కగానొక్క బిడ్డ. వంశానికి వారసుడు. ఏం చెయ్యాలో తెలియడం లేదు.

రోజూలాగే ఆ రోజుకూడా ఉదయం పూజ చేసుకుంటున్నాను. జపం చేసుకుంటున్న నా చూపు ఎదురుగా ఉన్న శ్రీవారివిగ్రహాల మీద పడింది. మా ఇంట్లో వారసత్వంగా వచ్చిన శ్రీభూసమేతశ్రీవేంక టేశ్వరస్వామివార్లవిగ్రహాలు ఉన్నాయి. నిత్యంవాటికి పూజ చేసు కుంటాను. ఆ రోజు అలా జపం చేసుకుంటూ స్వామి మీద నా చూపు అప్రయత్నంగా పడింది. ఒక్క క్షణకాలం స్వామినే చూచాను. ఎందుకు చూచానో కూడా తెలీదు. సరిగ్గా అప్పుడే ఓ మెరుపు. స్వామిపెదవుల మీద చిరునవ్వు. సరిగ్గా ఎదురుగా మనిషి నిల్చొని నవ్వుతూ మాట్లాడు తున్నట్లే ఉంది. "నేనున్నానుగా. ఎందుకు దిగులు. నా మీద నమ్మకం లేదా? అన్నీ నేను చూసుకుంటానుగా" అని స్వామి అభయం ఇస్తున్నట్లు అనిపించింది. కాదు.. కాదు.. నాతో నేరుగా మాట్లాడినట్లే అనిపించింది.

అది కల కాదు. కచ్చితంగా మెలవకువగానే ఉన్నా. కానీ, నాకు మాటలు వినిపించాయి. అదొక వింత అనుభూతి. స్వామి ముఖం మీద చిరునవ్వు అలా కనిపిస్తూనే ఉంది. ఒక్కసారిగా వెయ్యిఏనుగుల బలం వచ్చినట్లయింది. అంతే... స్వామికి మొక్కుకున్నా. "అంతా నీ దయే స్వామీ! బిడ్డకు నీ దయవల్లే మాట రావా"లని దండం పెట్టు కున్నా. ఈ సారి కొండకు నడిచివస్తా నని దండం పెట్టుకున్నా.

అంతా స్వామి లీల. ఏ మందులూ వాడింది లేదు. ఇతరవైద్యం చేయించిందీ లేదు. బిడ్డనోట ఒక్కొక్క మాట వస్తోంది. మా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఇప్పుడు నా బిడ్డ అందరిలాగా మాట్లాడుతున్నాడు. ఇక నాకే విచారం లేదు!

"స్వామీ! అంతా నీ దయ. నీవల్లమాత్రమే జరిగిన అద్భుతం ఇది. నా కష్టాన్ని చెప్పుకోకపోయినా నువ్వే అండగా వచ్చావు. ఈ జన్మ కిది చాలు స్వామీ! నీ చరణాల మీద భక్తి శాశ్వతంగా నిలిచిఉండేలా దీవించు స్వామీ!!" అంటూ దండం పెట్టుకున్నా. అనుకున్న ప్రకారం కొండకు నడిచి వచ్చాను. మా ఇంటి దైవం శ్రీనివాసుడి అండ మాకు శాశ్వతంగా ఉంటుందన్న భరోసా మమల్ని జీవితకాలం నడిపిస్తుంది.

# ఈ అమావాస్య ఎంతో పుణ్యప్రదం

- శ్రీమతి ఆకెళ్ళ సూర్యకనకదుర్గ

సాధారణవ్యవహారంలో అమావాస్య అనగానే అపశకునంగా భావిస్తారు. ఆ రోజున కొత్తపని ఏదీ ప్రారంభించరు. కొత్తనిర్ణయాలుకూడా తీసుకోరు. శుభకార్యక్రమాలు పూర్తిగా పక్కన పెట్టేస్తారు. వ్యవహారంలో ఈవిధమైన అలవాట్లు ఉన్నప్పటికీ ఆధ్యాత్మికపరంగా చూస్తే అమావాస్యకు ఎంతో ప్రాధాన్యత కనిపిస్తుంది. లక్ష్మీదేవి సంపూర్ణ అనుగ్రహాన్ని పొందటానికి దీపావళిఅమావాస్యరోజున చేసే పూజ ఎంతో శ్రేష్ఠం. అదేవిధంగా పుష్యమాసంలో వచ్చే **చొల్లంగి అమావాస్య** కూడా మోక్షసాధనకు మార్గంగా నిలుస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

పుష్యఅమావాస్యను చొల్లంగి అమావాస్య అంటారు. తూర్పుగోదావరిజిల్లా కాకినాడకు దక్షిణంగా యానాం మార్గం మీద మూడుమైళ్ల దూరాన 'చొల్లంగి' అనే గ్రామం ఉంది. గోదావరి ఏడుపాయల్లో ఒకటైన 'తుల్యభాగ' ఇక్కడ సముద్రంలో కలుస్తుంది. జీవనది అయిన గోదావరిపాయల్లో ఒకటి సాగరాన్ని సంగమించే చోటు కావడంవల్ల ఇక్కడ స్నానం చేసినవారు నదిలో, సముద్రంలోనూ ఏకకాలంలో స్నానం చేసిన విశేషఫలం పొందుతారు. ఈ రోజున గోదావరి సముద్రంలో కలిసే సంగమం వద్ద శాస్త్రవిధానంగా స్నానం చేసి, పితృతర్పణం చేస్తే వారికి ముందున్న 21 తరాల పితరులు నరకలోకయాతనలనుండి విముక్తులౌతారని, వాటిఫలితంగా స్వర్గలోకం ప్రాప్తిస్తుం దని పురాణకథనం.

ఏటా ఇక్కడ పుష్య అమావాస్య నాటికి ఎంతోమంది భక్తులు చేరుకుని, పుణ్యస్నానాలు చేస్తారు. పెద్దలకు పిండప్రదానం చేస్తారు. ఇంటి ఆచారాలను అనుసరించి దానధర్మాలు, పెద్దలకు తర్పణాలు వదలటం కూడా చేస్తారు.

## పురాణగాథలు

గౌతముడు తీసుకువచ్చిన గోదావరిజలాలను ఏడు గురుఋషులు ఏడుపాయలుగా తీసుకొని పోయి ఏడుస్థలాల్లో సంగమించే విధంగా చేశారు. గౌతముడు స్వయంగా తీసుకు వచ్చిన శాఖ గౌతమి అనే పేరుతో 'మాసానితిప్ప' అనే చోట సముద్రంలో కలుస్తుంది. తుల్యుడు, ఆత్రేయుడు, భరద్వాజుడు, కౌశికుడు, జమదగ్ని, వసిష్ఠుడు అనే ఆరుగురు ఋషులు కొనిపోయిన శాఖలు వివిధపేర్లతో వ్యవహారంలోకి వచ్చాయి. తుల్యుడు తీసుకువెళ్లిన శాఖ చొల్లంగి దగ్గర, ఆత్రేయుడు తీసుకువెళ్లిన శాఖ కోరంగి సమీపంలో, భరద్వాజుడు తెచ్చిన శాఖ భైరవపాలెం/ తీర్థాల మొండివద్ద, కౌశికశాఖ నత్తల నడక సమీపంలో, జమదగ్ని తెచ్చినశాఖ కుండలేశ్వరం వద్ద, వశిష్ఠశాఖ అంతర్వేదివద్ద సముద్రంలో కలుస్తున్నాయి. నర్మదా నదీతీరంలో చేసిన తపస్సు, గంగానదీతీరంలో పొందిన మరణం, కురుక్షేత్రంలో చేసిన దానం ఎంతటి పుణ్యాన్ని అనుగ్రహిస్తాయో గోదావరినదీతీరంలో చేసే పుణ్యకార్యాల వల్ల ఆ మూడువరాలు ఒకేసారి సిద్ధిస్తాయని పెద్దలు చెబుతారు.

ఈ ఏడుస్థలాలకు వెళ్లి స్నానాలు ఆచరించి రావడాన్ని 'సప్తగోదావరుల సాగరసంగమ యాత్ర' లేదా 'సప్తసాగరయాత్ర' అంటారు. సంతానం తదితరకోరికలు నెరవేరటానికి సప్త



సాగరయాత్ర చేయడం సంప్రదాయంగా వస్తోంది. సప్తసాగర యాత్ర పుష్యబహుళ అమావాస్యనాడు చొల్లంగిస్నానంతో ప్రారంభమౌతుంది. యాత్రికులు ఏడు తావులు చూసుకుని, ప్రాయకంగా మాఘశుక్లఏకాదశినాటికి వశిష్టసాగరసంగమ స్థానమైన అంతర్వేది చేరతారు. ఇలా సప్తసాగరయాత్రకు ఆది, తుది దినాలు పర్వదినాలుగా ప్రసిద్ధిపొందాయి.

## తెప్పతిరునాళ్లు

చొల్లంగిఅమావాస్యరోజున సింహాచలంలో పెద్దఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. సింహాచలం కొండ దిగువభాగంలో ఉన్న ఉద్యానవనం, పుష్కరిణిప్రాంతాల్లో ఉన్న అప్పన్నమూర్తులకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. వీటితో పాటు అప్పన్నకు ప్రత్యేకంగా తెప్పతిరునాళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## నాగోబా జాతర

పుష్యమాసంలో వచ్చే అమావాస్యరోజున గిరిజనులు నాగోబా జాతరను ఎంతో సంబరంగా జరుపుకుంటారు. ఈరోజు వారి ఆరాధ్యదైవమైన 'నాగోబా' పురివిప్పి నాట్యంచేస్తాడని నమ్ముతారు. 'నాగోబా' దేవాలయం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో ఉంది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలే కాకుండా ఇతరరాష్ట్రాలనుంచీ లక్షలాదిమంది గిరిజనులు ఇక్కడకు చేరుకుని నాగోబా జాతరలో పాల్గొంటారు.

ఈ జాతరకు పదహారు రోజుల ముందు అంటే పుష్య పౌర్ణమికి ఒకరోజు ముందు కొంతమంది గిరిజనులు పవిత్ర నాగోబా ఆలయం నుంచి కలశం తీసుకుని గోదావరి జలం తేవటానికి కాలినడకన బయలుదేరి వెళతారు. కేస్లాపూర్‌కు సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న జన్నారం మండలం కలమడుకు వరకు నడిచి వెళ్లి అక్కడ నుంచి గోదావరి జలం తీసుకువస్తారు. ఇక్కడ గిరిజనుల పూర్వులు స్నానం చేస్తుండగా నాగదేవత దర్శనమిచ్చాడనే నమ్మకంతో అక్కడి జలాన్ని పవిత్రంగా గిరిజనులు భావిస్తుంటారు.

ఇక్కడ సేకరించిన జలంతో నిండిన కలశాన్ని నలభై కిలోమీటర్ల దూరంలోని 'పూసినగూడ' గ్రామానికి లేదా ప్రధాన పూజారి ఉండే నార్నూరు మండలం గుంజాల గ్రామానికి తెచ్చి అక్కడ ఒకరోజు ఉన్న తరువాత కేస్లాపూర్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఇంద్రవెల్లిలో ఆగి అక్కడ వెలసిన ఇంద్రాదేవికి సామూహికంగా పూజలు జరుపుతారు. అక్కడి నుంచి బయలుదేరి కేస్లాపూర్ చేరి ఆలయానికి కొద్దిదూరంలో ఉన్న మర్రిచెట్టు కింద 4 రాత్రులు, ఒక పాకలో 3 రాత్రులు సామూహికపూజలు జరిపి కేస్లాపూర్ మందిరానికి వాద్యాలతో ఊరేగిస్తూ తెచ్చి, ఆలయంవద్ద ఉన్న మర్రిచెట్టుపై పవిత్ర జలకలశం భద్రపరిచి 10 కి.మీ. దూరంలోని సిరికొండ చేరుకుంటారు.



పుష్య అమావాస్య రోజున కలశం ఉంచిన మర్రిచెట్టు దగ్గర పుట్టను తయారుచేసి ఆలయం ప్రక్కన ఉన్న పూజా మందిరం మట్టితో అలికి అమావాస్య అర్ధరాత్రి కలశంలో ఉన్న జలంతో ఆలయంలో ఉన్న నాగదేవతను అభిషేకిస్తారు. గిరిజన తెగకు చెందిన మెస్రం వంశస్థులు దేశంలోని ఏ మూరుమూల ప్రాంతంలో ఉన్నా తప్పనిసరిగా ఈ జాతరకు హాజరై నాగదేవతను పూజిస్తుంటారు.

మొత్తంగా చూస్తే చొల్లంగి అమావాస్య పితృదేవతల అనుగ్రహాన్ని పొందటానికి ఉత్తమమార్గంగా నిలుస్తోంది. మానవులు ఆధ్యాత్మికపరంగా ఎదగటానికి, తమ పూర్వీకులు అందించిన వారసత్వాన్ని స్మరించుకోవటానికి అవకాశం కల్పిస్తుంది.



– డా॥ సుబ్బలక్ష్మి, మర్ల

# డూడూ.. డూడూ...


# బసవన్న..!!

గంగిరెద్దులనాడించే సంప్రదాయం ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాల్లోను ప్రచురంగా ఉంది. ఈ గంగిరెద్దుల ప్రస్తావన ‘గజాసుర సంహార’ కథలో కూడ చెప్పబడింది. పూర్వం గజాసురుడు అనే రాక్షసుడు శివుణ్ణిగురించి ఘోరమైన తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా నీవు ఎల్లవేళలందు నాతోనే ఉండాలని కోరాడు. భోళా శంకరుడు సరేనని అతనిగర్భంలో ప్రవేశించి, యోగనిద్రాముద్రితుడై హాయిగా ఉన్నాడు. పార్వతీదేవి భర్త కన్పించకుంటే ప్రమథగణాలచేత పధ్నాలుగు లోకాలలోను గాలింపజేసింది. అయినా భర్త కానరాక విష్ణు మూర్తిని శరణుకోరింది.

మహేశ్వరుడు ఆత్మలింగమై గజాసురునిగర్భంలో స్థిరనివాస మేర్పరుచుకొని ఉన్న సంగతి విష్ణువు తెలుసుకొని శివుణ్ణి గజాసురగర్భం నుంచి బయటకు తేవడానికి గంగిరెద్దుమేళమే సరైన ఉపాయమని నిశ్చయించాడు. తలచిందే తడవుగా శ్రీహరి నందీశ్వరుణ్ణి రప్పించి గంగిరెద్దుగా అలంకరింపజేశాడు. బ్రహ్మాదిదేవతలందరు తలొక వాద్యం చేతబూనగా తాను సన్నాయి, చిరుగంటలు ధరించి, గంగిరెద్దు మేళంతో గజాసురుని సభలోనికి పోయి గంగిరెద్దును ఆడించాడు. జగన్నాటక సూత్రధారియైన శ్రీహరి గంగిరెద్దును చిత్రవిచిత్రగతులతో మనోమోహనంగా ఆడించగా గజాసురుడు ముగ్ధుడై వరం కోరుకోమన్నాడు. శ్రీమహావిష్ణువు అతనిగర్భంలో ఉన్న ఆత్మలింగం కావాలన్నాడు. ఆమాటలు వినగానే గజాసురునికి గంగిరెద్దువానిగా వచ్చిన మహనీయుడెవరో అర్థమైపోయింది.

అతడు శ్రీహరికి నమస్కరించి “మహానుభావా! సాక్షాత్తు శ్రీమన్నారాయణునిచే గంగిరెద్దు మేళం చేయించుకొనే అదృష్టం నాకు దక్కింది. దానివల్ల నా జన్మచరితార్థమైపోయింది. ఆత్మలింగాన్ని నీవే నా గర్భంనుంచి తీసుకో” అని అనేకవిధాల స్తుతించాడు. శ్రీహరి ప్రబోధించగా నందీశ్వరుడు గజాసురుని గర్భాన్ని చీల్చి శివుణ్ణి బయటకు రప్పించాడు. ఈ విధంగా గంగిరెద్దుమేళం ఆనాడే నిర్వహించారు.

పూర్వకాలంలో గంగిరెద్దుల నాడించేవారు దాన్నే వృత్తిగా చేపట్టేవారు. గ్రామాలలో ఏ శుభకార్యం జరిగినా అది చిన్నదైనా పెద్దదైనా గంగిరెద్దుమేళానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. తాము ఏపనిని ప్రారంభించినా ముందుగా గంగిరెద్దుమేళం చేయిస్తే శుభప్రదమని ప్రజల నమ్మకం. ఏ పూజచేసినా ముందుగా గణపతిని పూజించినట్లే ఏ కార్యక్రమానికైనా ముందుగా గంగిరెద్దును మేళతాళాలతో లోనికి ప్రవేశింపజేసి కార్యక్రమం ప్రారంభిస్తే మంచి జరుగుతుందని ఆవిధంగా



చేస్తారు. గంగిరెద్దు ప్రవేశించిన తరువాతే విఘ్నేశ్వరపూజ తక్కిన కార్యక్రమాలు. ఒక విధంగా చూస్తే వినాయకుని ఆవిర్భావానికి హేతుభూతమైంది ఈ గంగిరెద్దు మేళం. అందుచేతనే దీనికి ప్రప్రథమస్థానం ఈయడం జరిగి ఉండవచ్చు.

గంగిరెద్దులవారు పురాణగాథలను గురించి మంచి అవగాహన కలిగి ఉంటారు. సాక్షాత్తు ఆ శేషశయనుడే తమ రూపుదాల్చడంవల్ల తమవృత్తికి గౌరవం, ప్రాధాన్యం ద్విగుణీకృతమైనా యని వీరు భావిస్తారు. సంభాషించేటప్పుడు నిర్దుష్టంగా మాట్లాడాలనే తపనతో బాగా వత్తిపలుకుతారు. ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా తప్పకుండా తమ మేళం ఉండడంవల్ల వీరి భుక్తికి లోటు ఉండేది కాదు. మేళం చేయించుకున్నవారు వీరికి ధాన్యం, బట్టలు, డబ్బు మొదలైనవి ఇచ్చి తృప్తులను చేసేవారు. కాలక్రమాన సంప్రదాయాలకు కాలం చెల్లిపోవడంవల్ల వీరు భుక్తికై వేరు వేరు వృత్తులను చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. వీరిలో చాలా మంది విద్యాధికులై పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్నా పెద్దవారు తమసంప్రదాయాన్ని విడువకుండా కాపాడుకుంటూ దాన్ని ముందు తరాలవారికి కూడా నేర్పుతూ ఈకళ పూర్తిగా సమసిపోకుండా సంరక్షిస్తున్నారు.

సంక్రాంతి వచ్చిందంటే తెల్లవారకముందే దట్టమైన పొగమంచులో తమ సన్నాయిరాగాలతో పల్లెప్రజలను మేలుకొలిపి వారిచ్చింది తీసుకుని వెళ్లడం వీరి సంప్రదాయం. వీరికి దానంచేస్తే పుణ్యమని భావించి గ్రామీణులు చేటలకొద్దీ బియ్యం వీరి సంచులలో పోసేవారు. ఈ గంగిరెద్దులవారు తాము తమ భుక్తికి ఆధారభూతమైన బసవన్నను పస్తులుంచరు. బసవన్నకు



పెట్టాకనే వీరు తింటారు. వీరు ఆడించే ఆటలలో గంగిరెద్దుచేత కుస్తీ బస్వరాజు నాట్యం (ఎద్దు నాలుగుకాళ్లను ఆట ఆడించేవానిపై ఉంచి నిలవడం), మెడ కాయ గాయబు, కబడ్డీ, బతకమ్మ, అయ్యవారికి దండం బెట్టు ఆటలు ఆడిస్తారు.

## ఆహార్యం

గంగిరెద్దులనాడించేవారు పింజపోసి పంచకట్టుకుంటారు. పైన చొక్కాదాని మీద కోటు తొడుగుతారు. తలకు పాగా చుడతారు. ఈ పాగా వెనుకవైపు ఒక మూరెడు పొడవున తోకలా వ్రేలాడుతూ ఉంటుంది. వీరికి ముక్కుకాడ తప్పనిసరిగా ఉండాలి. చెవులకు పోగులు ముక్కుకాడమాత్రం బంగారంతోనే చేయించుకుంటారు. మెడలో వెండికంటె, చేతులకు వెండిమురుగులు, కాళ్లకు వెండి కడియాలు ధరిస్తారు. నుదుట తిరుచూర్ణంతో నామం ధరిస్తారు. చేతిలో సన్నాయి, చిటితాళం, డోలు ఒక్కొక్కరు ఒక వాద్యం తీసుకుంటారు. ఒక్కరే ఉంటే సన్నాయి చేతబట్టి చిటితాళాలను మెడలో వ్రేలాడదీసుకుంటారు. ఇద్దరు ఉంటే ఒకరు డోలు,





ఒకరు సన్నాయి, చిటితాళం ధరిస్తారు. వీరు బాలురకుకూడా బాల్యం నుండే ఈ విద్య నేర్పి తమ వెంట తిప్పుకుంటారు.

## గంగిరెద్దు అలంకరణ


గంగిరెద్దును వీరు సాక్షాత్తు కైలాసంలోని నందిగానే భావిస్తారు. తమకు భుక్తిని ప్రసాదించే ఈ బసవన్న అంటే వీరికి భయం, భక్తి, గౌరవం. తాము తిన్నా, తినకపోయినా వీరు ఈ వృషభానికి మంచి పౌష్టికాహారం తినిపిస్తారు. ప్రతిరోజు శ్రద్ధగా వీటికి స్నానం చేయించి, అలంకరించి పూజిస్తారు. గంగిరెద్దుమేళం చేసేటప్పుడు ముందుగా బసవన్నకు స్నానం చేయించి, ముఖానికి పసుపుపూసి నిలువుగా కుంకుమ బొట్టు పెడతారు. బసవన్నకొమ్ములకు చిరుగంటలుకడతారు. మెడలో ఒక గంట వ్రేలాడదీస్తారు. కాళ్లకు చిరు గజ్జెలుకట్టి దిష్టితగలకుండా వెనుక కాళ్లలో ఎడమకాలికి జుట్టుతో పేనిని త్రాడుకడతారు. మెడలో పూసల దండలు, బంతి పూలమాలలు వేస్తారు. రెండుకొమ్ములను కలుపుతూ రంగు రంగుల పూసలదండలు అలంకరిస్తారు. కొమ్ముల చివర ఇత్తడి తొడుగులు అలంకరిస్తారు. మూపుపై బొంతలు వేసి, ఆపైన మంచిమంచిరంగులు, పూలు ఉన్న చీరలుగాని, దుప్పట్లు గాని వేస్తారు. మూపురం చుట్టూ పూల దండలు, పూసలపేర్లు చుడతారు. ప్లాస్టిక్‌యుగంగా మారిన ఈ రోజులలో గంగిరెద్దులకు ప్లాస్టిక్‌పూలు, కాగితంపూలు కూడా అలంకరిస్తున్నారు.

## ప్రదర్శన

వీరు గంగిరెద్దుని తీసుకొనివచ్చి ముంగిటనిలిపి ముందుగా డోలు, సన్నాయి వాయిస్తారు. ఇంటిలోని వారు బయటకు వచ్చాక –

"దూదూదూదూ బసవన్న
దొడ్డదొరండీ బసవన్న
అయ్యగారికీ దండంపెట్టు
అమ్మగారికీ దండంపెట్టు
బాబుగారికీ దండంపెట్టు
బాలదొరలకు దండంపెట్టు
కోటిలాభములు కలగాలండీ
కోటివేల్పుల దయకలగాలండీ
దూదూ దూదూ బసవన్న
తిరుపతికొండకు ప్రయాణమండీ
దేవునిమ్రొక్కులు తీర్చాలండీ
బంగరుగిట్టల బసవన్నండీ
పయిడికొమ్ముల బసవన్నండీ
బాలమెరుంగుల బసవన్నండీ
భాగ్యములిచ్చే బసవన్నండీ
వెండికొండపైవిహారమండీ
విశ్వనాథుని వాహనమండీ
పప్పుబియ్యం పట్టుకురండీ
పట్టువస్త్రములు పట్టుకురండీ
బసవన్నదయ సంపాదించండి
దూదూదూదూ బసవన్న"

అంటూ పాట పాడుతారు. దూదూదూదూ బసవన్న అని అన్నప్పుడల్లా గంగిరెద్దు తల ఊపుతూ ఉంటుంది. ఇలా ఊపినపుడు కొమ్ములకున్న






చిరుగంటలు, మెడలోని గంట చేసే ధ్వనులు మనోరంజకంగా ఉంటాయి. "బసవన్నా అమ్మగారికి దండంబెట్టు" అంటే గంగిరెద్దు ముందుకాలు పైకెత్తి నమస్కరిస్తుంది. అయ్యగారింట బాజాలెప్పుడు మ్రోగుతాయి చెప్పు బసవన్నా చెప్పు అంటూ దాని మూతి దగ్గర చెవి పెట్టి ఓహో! త్వరలోనే పెళ్ళిబాజాలు మ్రోగుతాయంట– మా బసవన్న మాటకు తిరుగులేదు ఏమంటావు? బసవన్న! అనగానే గంగిరెద్దు ఔనన్నట్లు తలవూపుతుంది. ఇదే విధంగా ఆ ఇంటివారివిషయాలు ముందేతెలుసుకొని దాని కనుగుణంగా బసవన్నని ప్రశ్నిస్తూ అన్నీ శుభాలే జరుగుతాయని ఇంటివారికి జోస్యంచెప్పి ఆనందింపజేస్తారు. బసవన్నను ముందుకాళ్లమీద కూర్చోబెట్టి, నృత్యం చేయించి, వివిధభంగిమలలో తల ఊపించి చిత్ర విచిత్రంగా గంగిరెద్దుని ఆడిస్తారు. బసవన్న చెవులు ఊపే తీరుచూస్తే ముచ్చటగొలుపుతుంది. అశ్వహృదయమర్మజ్ఞుల లాగానే వీరు వృషభహృదయాన్ని ఎఱిగినవారు. గంగడోలు నిమరడం, చెవి వెనుక గిల్లడం, తోకను స్పృశించడం ద్వారా వీరు బసవనికి ఆదేశాలు జారీ చేస్తారు.

దూదూదూదూ బసవన్నా/ అయ్యగారికి సలాము చేయి
అమ్మగారికి దణ్ణంబెట్టు/ పిల్లలతో తలలూపి
పిలిచీ నవ్వించూ/ పట్టుబట్టకు చేయి చాపించూ
పండగ ఈనాములడిగి పుచ్చుకో ॥
(సంగీత కదంబమాల – కాకుటూరి పద్మావతి. పుట–99)

ఈ విధంగా వీరు గంగిరెద్దును చిత్రవిచిత్రగతులతో ఆడించి, దండాలు పెట్టించి, గృహస్థులను ఆనందపరచి, వారి నుంచి కానుకలందుకుంటారు. వీరికి ధాన్యం, బట్టలు తప్పక ఇస్తారు. బట్టలు అంటే పాతబట్టలే. చీరలు, దుప్పట్లు, బొంతలు, కోటులు, చొక్కాలులాంటివి ఏవైనా తమకు తోచినవి వీరు ఈయగానే వాటిని గంగిరెద్దుమూపుపై వేసి అవన్నీ బసవన్నకే అర్పితం అంటారు. కానీ వాటిని ధరించేది గంగిరెద్దులవారు, వారికుటుంబసభ్యులే. వీరు యాచించేటప్పుడు కూడా బసవన్నకి అర్పించుకోండి అనే అడుగుతారు.

"ప్రభువుగారికి దణ్ణం బెట్టూ/ పాదంవంచీ భక్తిని పెట్టూ
పట్టుశాలువలు కప్పెదరంటా/ కాసులుమువ్వలు కట్టెదరంటా
..................................................................
దూదూదూదూ యెంకన్నా / యేడుకొండల యాశ్వరుడండీ
యెండి కొండలా యెంకన్నండీ / భమిడికొమ్ములా బసవయ్యండీ
(అడవి బాపిరాజు–వైతాళికులు. పుట 148–149)

ఈ విధంగా గంగిరెద్దు నాడించే తీరుకు తమ వాక్చాతుర్యాన్ని కూడా జోడించి, చూపరులహృదయాలను రంజింపజేసి కానుకలందుకుంటారు. గంగిరెద్దు ధర్మానికి సంకేతం అని, దాని మూపురం శివలింగమని, ఇది నందివాహనంమీద శివుడు వచ్చాడనేందుకు సంకేతం అని కొందరి విశ్వాసం. గంగిరెద్దు వచ్చి ఇంటి ముంగిట ముగ్గులో నిలుచుంటుంది. అప్పుడు ఆ బసవడు ముగ్గులోని గొబ్బెమ్మను తొక్కితే శుభం చేకూరుతుందని జానపదులనమ్మకం. ఆ గొబ్బెమ్మగోవుకు సంకేతం, దానిపై నిలచిన వృషభం నేలనుండి ఉద్భవించిన పంటకు సంకేతం. ఈ ధర్మవృషభానికి ముందువెనుకనున్న గంగిరెద్దులవారు శంకరపరివారమైన భృంగి–భృంగిరిటులకు ప్రతీకలు. సంవత్సరంపాటు శ్రమించగా వచ్చిన ధాన్యాన్ని మన ఇంటికి చేర్చినందుకు మనం ఆనందంతో కప్పే వస్త్రం మన శరీరానికి సంకేతం. "లయకర్త అయిన శంకరా! ఈ శరీరాన్ని నీకు ఇచ్చేస్తున్నాను. పైజన్మకైనా ఉత్తమమైన శరీరాన్నియ్యి లేదా జన్మరాహిత్యాన్ని ప్రసాదించు!" అని ప్రార్థించడమే ఇందులోని అంతరార్థం.



# పరమేశ్వరుడే... ప్రథమ శ్రోత

- బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు



విష్ణుభక్తిని కీర్తించే వైష్ణవపాశురాలను తిరుప్పావై అంటే– శివభక్తితత్పరతని బోధించే శైవపాశురాలను తిరువెంబావై అంటారు. విష్ణుపాశురాల్ని కీర్తించేతల్లి ఆండాళ్ (గోదాదేవి) ఒక్కతే అవుతూంటే, శైవపాశురాలను కీర్తించే వాళ్లంతా యౌవనవతులైన ఎందరో కన్యలు.


ఈ తిరువెంబావైని మాణిక్యవాచకర్ అనే మహాశివభక్తుడు రచించాడు.

## ఇంతకీ ఎవరీ మాణిక్య వాచకర్?

తొమ్మిదవ శతాబ్దానికి చెందిన తమిళకవి 'మాణిక్య వాచగర్'. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మధురకి దగ్గరగా ఉన్న మేలూర్ సమీపంలోని వాధవూర్ అనే గ్రామంలో జన్మించాడు. నిత్యం వైగైనదిలో స్నానాన్ని తెల్లవారుజామునే చేస్తూ, తన తండ్రి అర్చకుడుగా ఉంటున్న శివాలయంలోనే బాల్యంనుండీ కాలం గడిపాడు. వయసొచ్చినకొద్దీ మంచి అవగాహన తోనూ, స్పష్టంగానూ ఈయన మాట్లాడుతున్న కారణంగా 'మాణిక్యంలా వచనం (మాట్లాడడం) చేసేవా'డనే అర్థంలో 'మాణిక్యవాచకన్' అని పిలిచేవారు ఊరు ఊరంతా. గౌరవ వాచకంగా పేరు చివర 'ర్' చేరితే మాణిక్యవాచకర్ (మాణిక్య వాచకులు) అయ్యారు. పాండ్యరాజుఆస్థానంలో ఉద్యోగిగా పనిచేస్తుండే ఈయన, చిదంబరం నటరాజస్వామి ఆలయంలో శ్రావ్యంగా శివకీర్తనలను పాడుతూంటే అందరూ శ్రద్ధగా ఆలకిస్తూండేవారు. పాండ్యరాజుకి ఈయన అన్నా, ఈయన కీర్తనలు అన్నా చెప్పలేని ఇష్టం. అందుకే రాజాస్థానానికి గుఱ్ఱాల్ని కొనాల్సిందని పాండ్యరాజు కొంత సొమ్మునిచ్చాడు ఈయనకు. ఆ సొమ్మును తాను గుఱ్ఱాలను కొనడానికి విని యోగించకుండా తాను కడుతున్న తిరుప్పరెంతురై శివాలయా నికి ద్రవ్యం తక్కువైనప్పుడు వాడేశాడు. పాండ్యరాజు మాణిక్య వాచకర్‌కి ఏ శిక్షా విధించలేదు. "ఆ సొమ్ముని ఈ ఆలయా నికి వాడేశావేమిటి?" అని కనీసం మాటమాత్రంగా కూడా అడగలేదు.



**రోజుకొక్క తిరుప్పావై పాశురం, ఆ వెంటనే తిరువెంబావై పాశురం చదివితే శివ, విష్ణు అనుగ్రహం ఏకకాలంలో లభిస్తుంది. కాబట్టి అలా చేయడం బాగుంటుంది.**



ఈయన శివాలయానికి చేసిన సేవనీ, శివునిపట్ల చూపేభక్తినీ గమనించిన కొందరు మధురలోని మీనాక్షీ సుందరేశ్వరునిఆలయంలో ఈయన జీవితచరిత్రను శిల్పాల్లో చెక్కించారు. ఈ తిరువెంబావై అనే శివకీర్తనల భాగాన్నంతా ఈయనే రచించిన 'తిరువాచకం'లో గ్రంథస్థం చేశాడు.

## కీర్తనల సారాంశ మేమిటి?

ఎందరో ఎందరో శివునిమీద కీర్తనలు వ్రాసి ఉన్నారు గదా! ఇంతకీ ఈయన కీర్తనల్లోని గొప్పతనమేమిటనే ఆలోచన మనకొస్తుందనేది- సహజమే. కొన్నిటిని అనుకుందాం!

శివుడు చేసిన పనులు మన్మథుణ్ణి నిలువునా బూడిద చేసేయడం, దక్షునియజ్ఞాన్ని ధ్వంసం చేయించి, దక్షుని తలను నరికి హోమం చేయించడం, తన లయకర్త బాధ్యతను మరిచి గజుడనే రాక్షసుని బొజ్జలో దూరి కొంతకాలం ఉండి పోవడం, వినాయకునితల నరికివేయడం... వంటి అన్నిటినీ 'లో' అర్థంతో ఆలోచించి చూచే విధంగానూ, తత్త్వమేమిటో తెలిసి శివుని గొప్పతనం అర్థమయ్యేవిధంగానూ ఉంటాయి ఈ కీర్తనలన్నీ. శివుణ్ణి గురించిన చక్కని సంబోధనలతో కన్పిస్తాయి- ఈ పాశురాల్లో.

### వైకుంఠపాళి
### :: 72 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 రం | | 2 భో | జ | | 3 తి | 4 రు | ప్పా | 5 వై |
| గ | | గి | | 6 సు | | మ | | త |
| 7 వ | జ్రి | | 8 ఆ | వ | డ | | 9 తా | ర |
| ల్లు | | 10 గం | | ర్మ | | 11 బం | | ణి |
| లు | | 12 గె | ల్చు | | 13 శ్రు | తు | లు | |
| | | ద్దు | | 14 ధ | | లు | | |
| 15 గొ | | లు | | 16 ను | తి | | 17 వే | 18 క |
| బ్బి | | | | ర్మా | | 19 జ | | ను |
| | 20 మ | క | ర | సం | క్ర | మ | ణ | ము |




చక్కని విభూతిని మూడురేకలుగా నుదుటన ధరించి, చక్కని పరికిణీ రవికె వేసుకున్న చిన్నపిల్లలంతా ఓ వరుసగా ఉంటూ అలా ఎన్నో వరుసల్లో వస్తూ, చిన్నగా నృత్యం చేస్తూ చప్పట్లు కొడుతూ నోటి నిండుగా శివకీర్తనలని (తిరువెంబావై) పాడుతూ, మధ్యమధ్య తెల్లని పలువరుస కన్పించేలా అందంగా నవ్వుతూ, ఆకర్షణీయంగా వస్తూ ప్రతిఇంటికీ వెళ్లి ఒక్కొక్క పిల్లనూ నిద్రలేపి, శివదర్శనానికి తీసుకుపోతూంటే ఆ దృశ్యం ఎంత మనోహరం! అలాంటివాళ్లపాటలో- వాళ్లందరి హావ భావాల్లో అంతరర్థాన్ని తెల్పుతాడు- మాణిక్యవాచకర్.

నిద్రలేపే సందర్భంలో తోటి ఆడుపిల్లల్ని "ఓ" ముత్యాల పలువరుసదానా! చిలుక కంఠం కలదానా! నవ్వుతో ఎదుటివాళ్లని కట్టిపడేసేదానా! గలగలా మాట్లాడే చిన్నారీ! ముద్దబంగారంలాటి కన్యా! వెండికొండా!..." అంటూ ఒక్కొక్కర్నీ ఒక్కో సంబోధనతో పలకరించడం ఎంతో ఆనందాన్నిస్తుంది.

## చిదంబరంలో...

మాణిక్య వాచకర్- తానే కీర్తన వ్రాసినా దాన్ని తన దైవమైన చిదంబరంలోని నటరాజస్వామికి హృదయపూర్వకంగా తన్మయత్వంతో పాడి, ఆయన విని ఆమోదించినట్లుగా భావించి, ఆ మీదటే దాన్ని ఓ కీర్తనగా లోకానికి అందించేవాడట! అలా పరమేశ్వరుడే ప్రథమశ్రోత అయిన కారణంగానేనేమో తిరువెంబావైలోని కీర్తనలన్నీ అర్థవంతంగానూ, ఆనందాన్ని అందించేవిగానూ ఉంటాయి.

*ఓం నమశ్శివాయ*



# నీలోనే ఉంది దైవత్వం

– శ్రీమతి జానపాటి మనస్విని

ఆధ్యాత్మికత సోమరితనం కాదు. వేదాంతం మత్తుమందూ కాదు. ఆధ్యాత్మికత అనగానే వయసుమళ్లినవాళ్ల వ్యాపకం అనే భావన సహజంగా చాలా మందికి కలుగుతుంది. కానీ అది పూర్తిగా అసత్యం. వృద్ధులకన్నా యువకులకే ఆధ్యాత్మికత అవసరం చాలా ఉంది. తమలో దాగున్న దైవాన్ని/ దైవికమైనశక్తిని యువతరం గుర్తించగలిగితే అద్భుతాలు సాధ్యపడతాయి.

## పిరికితనం వదిలెయ్యాలి

విజయాలకు పొంగిపోవటం, పరాజయాలకు క్రుంగిపోవటం యువతలో సాధారణంగా కనిపించే లక్షణాలు. కానీ అవి సరైనవి కావు. అందుకే పరమాత్మ భగవద్గీతలో 'క్షుద్రం హృదయదౌర్బల్యం...' అంటూ క్షుద్రమైన హృదయదౌర్బల్యాన్ని విడిచిపెట్టమంటాడు. పిరికితనానికి పాతరవేసి, పరాక్రమాన్ని ప్రదర్శించమంటూ చైతన్యం నింపుతాడు– అర్జునుడికి. ఎంతో మంది వీరులున్నా అర్జునుణ్ణి మాత్రమే యుద్ధానికి సన్నద్ధుణ్ణి చేశాడు– పరమాత్మ. ఎందుకంటే విలువిద్యానైపుణ్యం, కార్యనిర్వహణసామర్థ్యంతో పాటు పరమాత్మ పై విశ్వాసంకూడా అతడికి ఉంది. మంచి చెడుల విచక్షణజ్ఞానం ఉంది. పని (కర్తవ్యం) చెయ్యటం పట్ల సానుకూలభావన ఉంది. ఈ లక్షణాలు ఉన్న వ్యక్తికే విజయం లభిస్తుంది. కాబట్టే అర్జునుడు విజయుడు అయ్యాడు.

## పనిలోనే దైవం

దైవాన్ని అర్థం చేసుకున్నవాళ్లు పనిని విమర్శించరు. తమకు కేటాయించిన పనిని ప్రసాదంగా స్వీకరిస్తారు. తమకు ఇచ్చిన పనిని అంకితభావంతో ఎవరూ వేలెత్తి చూపడానికి అవకాశం లేకుండా పూర్తిచేసి, తమదైన ముద్ర వేస్తారు. అందుకే ఆదిశంకరులుకూడా 'యద్యత్కర్మ కరోమి తత్త దఖిలం శంభో తవారాధనం'– మన పనిని చిత్తశుద్ధితో నిర్వహించటమే దైవారాధన అంటూ చెయ్యాల్సిన కర్తవ్యంపట్ల మనిషికి ఆరాధనాభావం కలిగించారు.

## దేహమే దేవాలయం

దేవతలు ప్రత్యేకంగా ఎక్కడో వేరే లోకాల్లో ఉండరు. మానవదేహమే దేవతలనివాస మని పెద్దలు చెబుతారు. మనిషి శరీరంలోని శిరస్సునుంచి పాదంవరకు దేవతలు వ్యాపించి ఉంటారు. దేహంలో రకరకాలపనులు నిర్వహిస్తుంటారు. మనం పనుల్ని బాహ్యంగా చేస్తుంటే వాళ్లు శరీరం లోపల తమవిధులు నిర్వహిస్తుంటారు. వాళ్లు చేయాల్సిన పనుల్ని అత్యంత జాగరూకతతో, నిరంతర అప్రమత్తతతో చెయ్యకపోతే మనప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. దేహంలో అంతర్గత కార్యకలాపాలైన రక్తప్రసరణ, గుండె కొట్టుకోవటం, కాలేయం, మూత్రాశయం, మూత్రపిండాలు పనిచేయడం, జీర్ణవ్యవస్థ పనిచేయడం, శిరస్సులో మెదడు కోటానుకోట్ల కణజాలంతో అనుసంధానమై పని చేయడం... ఇదంతా ప్రకృతి చేసిన ఏర్పాటే.

విశ్వవ్యవస్థలో నిరంతరకర్మ జరుగుతూనే ఉంటుంది. సూర్యోదయంనుంచి సూర్యాస్తమయంవరకు ప్రకృతి తన చైతన్యంతో విస్తరించి ఉంటుంది. రాత్రి మరో కర్మకు తెరతీసి జీవులను సేదతీరుస్తూ ఉంటుంది. నిజంగా, శాశ్వతంగా మనం బతకాలనుకుంటే మన పనిని గురించి గొప్పగా, ఉన్నతంగా మన మరణం తర్వాత ప్రతిఒక్కరూ చెప్పుకోవాలి. అలాంటి పని చెయ్యాలి. తప్పకుండా చేద్దాం. భగవంతుడిఉద్దేశాన్ని నెరవేరుద్దాం!



ఆలోచనల్లో వేడి, వాడి లేకపోతే యువకులైనా వృద్ధాప్యాన్ని అనుభవించవలసిందే! పుట్టుకతో అందరికీ గొప్పభావాలు కలగవు. ప్రపంచాన్ని చూచి, మనుషులు పడే బాధలు, పెనుగులాట బతుకును చూచి ఇదేం జీవితం అనుకుంటే– అప్పుడు అన్వేషణ మొదలౌతుంది.

భగవంతు డిచ్చినదేహాన్ని రక్షించుకోవాలి. మనసును ఆధ్యాత్మిక భావాలతో జాగృతం చెయ్యాలి. లోకక్షేమంకోసం అవకాశం దొరికినంత మేర ఆచరణాత్మకసాధన చెయ్యాలి. పాతభావాల్లోని గొప్పతనాన్ని నిలబెడుతూ కొత్తభావాలను స్వీకరించి పోషించాలి. నీరసం, నిస్తేజం, నిర్వీర్యం, జడత్వం, అయోమయం అనే మాటలకు, ఆధ్యాత్మికతకు సంబంధం లేదు. వెలుగే దానిజీవం. ప్రేమే దానిమార్గం. సత్యమే దానిపరమావధి. వెలుగు వృద్ధులను, యువకులను చేస్తుంది. మూర్ఖులను వివేకులను చేస్తుంది.

## జ్ఞానమే పరమావధి

శరీరాలు అందంగా ఉంటే సరిపోదు. శ్రీమంతులైతే సరిపోదు. గొప్పనామగోత్రాలతో జన్మిస్తే సరిపోదు. భావదారిద్ర్యం లేకుండా ఉండాలి. లోకంలో దుఃఖానికి తీవ్రంగా స్పందించగలగాలి. మన ఆలోచనలు మనకు, ఇతరులకు దారి చూపించాలి. వయసుతో సంబంధం లేకుండా జ్ఞానాగ్నిని రగిలించుకుంటూ నింగి వైపు దూసుకుపోవాలి. అటువంటి వ్యక్తులే నిజమైన సంఘసంస్కర్తలు, దైవాంశసంభూతులు.

మన ఆలోచనలను మార్చుకుంటూ కొత్తరకం ఆలోచనలు చేస్తూ మనం సంకల్పించుకున్నది సాధించుకోవాలి. అది చూచి ముందుతరం ప్రేరణ పొందాలి. పిన్నవయసులోనే గొప్పభావాలు ఎలా కలిగాయా? అని అందరూ ఆశ్చర్యపోవాలి.


ప్రహ్లాదుడిమాటలకు, భక్తికి అందరూ ఆశ్చర్యపోయేవారు. హిరణ్యకశ్యపుడికికూడా ఒక్కోసారి మతిపోయి హరినామస్మరణలో పడిపోయేవాడు. తరవాత సర్దుకుని కొడుకు పట్టుదలకు విస్తుపోయేవాడు. నిజానికి అప్పటికి ప్రహ్లాదుడి వయస్సెంత అని ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇక్కడ శారీరక వయస్సు కన్నా మానసికవయస్సు, అది పరిణితి పొందినస్థాయిమాత్రమే లెక్కలోకి వస్తాయి.

చిమ్మచీకటిలో చిన్నదీపకళికైనా వెలుగునిస్తుంది. వంశచరిత్రను మార్చేసే ఒక్క బీజం చాలు. తరతరాలు తరిస్తాయి. రాముడు భువిపై నడయాడటం చూచి దేవతలు, ఋషులు, తల్లిదండ్రులతో పాటు అయోధ్య పులకించింది. ధరణి పల్లవించింది. విశ్వం శ్లాఘించింది.

పద్నాలుగేళ్లకే నిర్భయులై మారీచ, సుబాహులను ఎదుర్కొని, విశ్వామిత్రుడికి సహాయం చేసి, యాగం పూర్తిచేసిన రామలక్ష్మణుల వయస్సెంత? అనుభవమెంత? జగత్తుకు వారేమి సందేశం ఇచ్చారు? ఎప్పుడు మనజీవితం మొదలుపెట్టాలి? ఏ వయసులో జ్ఞానోదయం కావాలి? ఏదో ఒకరోజు అందరం వృద్ధులమవుతాం. కానీ, మన భావాలకు వృద్ధాప్యం రాకూడదు. అవి శిథిలం కాకూడదు. నిత్యనూతనంగా ఉండాలి. దివ్యంగా ఉండాలి. యౌవనంతో తొణికిసలాడాలి.

రథాన్ని వెనక్కి తిప్పకూడదు. శత్రువులకు వెన్ను ఇచ్చి పారిపోకూడదు. నిలబడాలి. కురుక్షేత్రంమధ్యలో నిలబడాలి. జీవనసమరానికి సిద్ధంకావాలి. అప్పుడే దైవసహాయం అందుతుంది. లోపలికన్ను తెరుచుకుంటుంది. సత్యం బోధపడుతుంది. కర్తవ్యం పరుగులు తీయిస్తుంది. విజయం వరిస్తుంది. మానవత్వపు విలువలను తెలియచేస్తూ, మానవజాతి పురోగతికి మార్గనిర్దేశం చెయ్యటమే భారతీయసంస్కృతిలక్ష్యం. యువతలో చైతన్యం వచ్చినప్పుడే సమాజానికి ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉంటుంది.

విశ్వదాభిరామం　　　　వేమన పద్యసూక్తి



## మనసుగాయం మానదు

**ఇనుము విరిగె నేని, యినుమారు ముమ్మారు**
**కాచి యతుకవచ్చు క్రమముగాను;**
**మనసు విరిగె నేని, మరి యంట నేర్చునా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** ఇనుమారు= రెండుసార్లు; ముమ్మారు= మూడు సార్లు; క్రమము= నేర్పు; అంటనేర్చునా= అతుక గలుగునా.

**భావం:** ఇనుము విరిగితే రెండుమూడుసార్లైనా కాచి నేర్పుగా అతుకవచ్చు. కానీ, మనసు విరిగితే మళ్లీ అతుక్కుంటుందా?

**వివరణ:** ఇనుము గట్టిలోహం. అయినా విరిగినపుడు వేడి చేస్తే తిరిగి అతుకుతుంది. మనసుకు ఆకారం లేదు. అది చాలా సుకుమారం. అయినా విరిగితే అతకదు. అంటే మనసుకు గాయం అయితే, ఆగాయం ఎప్పటికీ మానదు. శరీరానికి తగిలినగాయం పైకి కనబడుతుంది. గాయం అయినచోటే నొప్పి ఉంటుంది. మందు వేస్తే మానిపోతుంది. మనస్సుకు అయిన గాయం కనిపించదు. లోలోపల చెలరేగుతూ బాధపెడుతునే ఉంటుంది. శరీరం అంతటినీ కుంగదీస్తుంది. ఆగాయం తగ్గడానికి మందులు కూడా ఉండవు. మానవుడు ఇతరులను నిందించడం మొదలైనవిధంగా మనసును బాధించ గూడదు. ఇతరులమనసుకు కోపం, ద్వేషం మొదలైనభావాలు కలగకుండా, ఆనందం కలిగే విధంగా ప్రవర్తించాలి. అని తాత్పర్యం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## 72 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | ■ | 3 | 4 | | 5 |
| | ■ | | ■ | 6 | ■ | | ■ | |
| 7 | | ■ | 8 | | | ■ | 9 | |
| | ■ | 10 | ■ | | ■ | 11 | ■ | |
| | ■ | 12 | | ■ | 13 | | | ■ |
| ■ | ■ | | ■ | 14 | ■ | | ■ | ■ |
| 15 | ■ | | ■ | 16 | | ■ | 17 | 18 |
| | ■ | ■ | ■ | | ■ | 19 | ■ | |
| ■ | 20 | | | | | | | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)సౌవీరదేశంలోని ఓ అందాలయువతి(2); 3)ధనుర్మాసంలో ఈకావ్యాన్ని పారాయణ చేస్తారు (4); 7)వజ్రాయుధాన్ని ధరించిన వాడు (2); 8)కనుముపండుగ రోజున ఈ పిండివంట చేస్తారు(3); 9)నక్షత్రం(2); 12)విజయం సాధించు(2);13)వేదాలు(3); 16)స్తుతి(2); 17)కైకసి సోదరి (2); 20)సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన రోజును ఇలా అంటారు (8)

### నిలువు

1)ధనుర్మాసం నెలరోజులు ప్రతివాకిలి వీటితో నిండి ప్రకాశిస్తాయి(5); 2)సంక్రాంతి ముందురోజు(2); 4)సుగ్రీవుని భార్య(2); 5)నరకంలో ఒక నది(4); 6)దుర్యోధనుని తమ్ముడు(3); 10)సంక్రాంతిరోజులలో దాసరులు వీటిని ఆడిస్తారు (4); 11)సంక్రాంతి రోజులలోవచ్చే పుష్పాలు(3); 14)సూర్యుడు ధనూరాశిలోకి ప్రవేశించిన క్షణం ఇది మొదలవుతుంది (4); 15)నెలపట్టినప్పటినుండి ముగ్గుల్లో వీటిని పెడతారు(2); 18)పశువుల పండుగ(3) 19)ఆదాయం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు





# చూసే కళ్లు

– శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821

చిత్రకారుడు అయిన చంద్రశేఖరుడు దగ్గరికి ఒక విదేశీయుడు వచ్చాడు. ఒక అందమైన యువతి బొమ్మ గీసి ఇవ్వమని అడిగాడు. జగదేకసుందరి, అతిలోకసుందరిలను మించిన అందగత్తెల బొమ్మలను చంద్రశేఖరుడు గీశాడు. విదేశీయుడికి ఏ బొమ్మా నచ్చలేదు. ఇక వెళ్లొస్తానని లేచి వెళుతుంటే చెత్తబుట్టలో ఒక బొమ్మ కనిపిస్తుంది.

చిత్రకారుడు ఎప్పుడో పొద్దుపోక గీసిన పిచ్చిగీతలవి. బావిలో నీళ్లు చేదుతున్న సాధారణ పల్లెటూరి పడుచుపిల్ల బొమ్మ అది. గీసిన తనకే సరిగా నచ్చక బుట్టపాలు చేసిన నల్లటి యువతి బొమ్మ అది. ఆ బొమ్మను చూచిన విదేశీయుడి ముఖం వెలిగిపోతుంది. అలాంటి బొమ్మ ఒకటి గీసి ఇవ్వమని ప్రాధేయపడతాడు. బొమ్మ వేస్తున్నంతసేపూ చిత్రకారుడి పక్కనే కూర్చొని కన్నార్పకుండా చూచాడు. బొమ్మ పూర్తయ్యాక బొమ్మని భద్రంగా తన చేతిలోకి తీసుకున్నాడు. తన జీవితంలో ఇంత మంచిబొమ్మ ఎప్పుడూ, ఎక్కడా చూడలేదని చెప్పి కృతజ్ఞతలు తెలిపాడు. మంచి పారితోషికం ఇచ్చి సంతోషంగా వెళ్ళాడు.



అంతా గమనించిన చిత్రకారుడిభార్య గబగబా భర్త దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చి ఆశ్చర్యంగా "ఇదేమిటండీ, మంచిమంచి బొమ్మలు వదిలేసి సాధారణమైన బొమ్మను కోరి మరీ గీయించుకున్నాడు" అని అడుగుతుంది.

చిత్రకారుడు నవ్వి నీకొక చిన్న కథ చెబుతాను విను అని ఇలా చెబుతాడు. "ఒక గృహిణి తన ఇంటి ముందర ఒక చిన్నతోట పెట్టాలని అనుకుంది. కూలీలను పిలిపించి పది అడుగుల నేల శుభ్రం చేయిస్తుంది. ఇంతలో అమ్మగారింటి నుంచి పని ఉంది రమ్మని ఆమెకు కబురు వస్తుంది. అమ్మగారింటికి వెళ్లిన ఆమె పదిరోజులు అక్కడే ఉండిపోతుంది.

ఆమె భర్తకు కూడా మొక్కలు నాటడమన్నా, మొక్కలు పెంచడమన్నా చాలా ఇష్టం. భార్య వచ్చేలోగా శుభ్రం చేసిన నేలలో కొన్ని మొక్కలు నాటుదామని భావిస్తాడు. ఇరుగింట్లోనుంచి, పొరుగింట్లోనుంచి కొన్ని మొక్కలను తీసుకొచ్చి నాటుతాడు. తను నాటిన మొక్కలను చూచి మురిసిపోతాడు.

అమ్మగారింటినుంచి ఇంటికి వచ్చిన గృహిణి తీరిక సమయం చూచుకుని చెట్లునాటుదామని శుభ్రం చేసిన నేల వద్దకు వెళ్లి చూచింది. అక్కడ ఆమెకు చిన్నచిన్న మొక్కలు కనిపిస్తాయి. అవి భర్త నాటిన మొక్కలని ఆమెకి తెలియదు. పది రోజులు తాను ఊర్లో లేకపోయేసరికి పిచ్చి మొక్కలు మొలిచాయని బాధపడుతూ మొక్కలన్నీ గబగబా పెరికి పారేసింది. విషయం తెలిసి భర్త లబోదిబో అన్నాడు.

వస్తువు కానీ, విషయం కానీ ఒకటే అయినా చూచే వారిని బట్టి అవి వేరువేరుగా కనిపిస్తాయి. అందుకే తను నాటిన మొక్కలు భర్తకు ఎంతో అందంగా కనిపించాయి. అవే మొక్కలు భార్యకు పిచ్చిమొక్కలుగా అగుపించాయి.


ఏదైనా చూచే వాళ్ల కళ్లనుబట్టి ఉంటుంది. మట్టిపెళ్ల కొందరికి మాణిక్యంలా అగుపిస్తుంది. మరికొందరికి మాణిక్యంకూడా మట్టిపెళ్లలా అగుపిస్తుంది. ఎవరికి ఏది నచ్చుతుందో ఎవరికి తెలుసు? ఒకరికి నచ్చింది, ఇంకొకరికి నచ్చాలని లేదు. 'లోకో భిన్నరుచిః' అని పెద్దలు ఎప్పుడో చెప్పారు కదా" అని బదులిచ్చాడు.


భర్త చెప్పిన కథ నిజమేననుకుని ముక్కు మీద వేలేసుకుంది చిత్రకారుడి భార్య.

చిత్ర కథ

# తెరతీయగరాదా..


కథ–డా॥ కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు–శ్రీ తుంబలి శివాజీ


నాయనా గణపతీ! ఆలయమర్యాదలను, పూజా సంప్రదాయాలను విమర్శించడం ధర్మం కాదు. స్వామివారి పూజలు ఆపి, తెరలు తీయాల్సిన గొప్పతనం ఈ భూమిమీద ఎవరికీ లేదు.
ఆ తెర కన్నా దట్టమైన తెరలు మనలో చాలా ఉన్నాయి. అవి తొలగించమని స్వామిని వేడుకుందాం.
తెరతీయగ రాదా... నాలోని తెరతీయగ రాదా.... తిరుపతివేంకటరమణా.. మత్సరమను తెరతీయగ రాదా..
త్యాగయ్య గానామృతానికి శ్రీవేంకటేశ్వరస్వామి ముందున్న తెరలు తొలగాయి... పూజారులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు.
అద్భుతం నాదబ్రహ్మా! మీ అపూర్వ గానంతో స్వామివారి తెర తొలగించారు. అద్భుతం!! శ్రీవారిని మెప్పించింది మీ గానం...
లోకా: సమస్తా: సుఖినో భవంతు!
2

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### అష్టవిధ మర్యాదలు

01) సాధారణజనమర్యాద
02) రాజమర్యాద
03) సభామర్యాద
04) విద్యామర్యాద
05) సద్గుణమర్యాద
06) వర్ణమర్యాద
07) ఆశ్రమమర్యాద
08) భక్తిమర్యాద

### పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) శ్రీవేంకటేశ్వరస్వామి | అ) శ్రీనివాసమంగాపురం |
| 2) శ్రీసిద్ధేశ్వరస్వామి | ఆ) తిరుపతి |
| 3) శ్రీకపిలేశ్వరస్వామి | ఇ) తిరుమల |
| 4) శ్రీగోవిందరాజస్వామి | ఈ) కపిలతీర్థం |
| 5) శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి | ఉ) తాళ్లపాక |

జవాబులు: 1-(ఇ); 2-(ఉ); 3-(ఈ); 4-(ఆ); 5-(అ)

### మీకు తెలుసా?



1) పెద్దపండుగ అని దేనిని అంటారు?
2) సంక్రాంతి పండుగ ఎన్ని రోజులు జరుపుకుంటారు?
3) సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించటాన్ని ఏమని పిలుస్తారు?
4) సూర్యునికి అయనాలు ఎన్ని?
5) కనుమను ఎవరి పండుగగా జరుపుకుంటారు?
6) సంక్రాంతి రోజుల్లో పిల్లలు వీటిని ఎగురవేస్తారు?
7) భోగిరోజున పిల్లలకు చేసే పేరంటం ఏది?

**జవాబులు:**
1) సంక్రాంతి
2) మూడు
3) మకర సంక్రమణం
4) రెండు
5) పశువుల
6) గాలిపటాలు
7) భోగిపళ్లు

### కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

చె ప కు రా చె డే ర వు

జవాబు:
చెరపకురా
చెడేవు

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.


తిరుమల తిరుపతి దేవస్థానములు
2021
నవంబరు
25 వ తేదీ నుండి
29 వ తేదీ వరకు జరిగిన
తిరుమల
శ్రీ వరాహ స్వామి వారి
ఆలయ అష్ట బంధన,
మహా సంప్రోక్షణ,
విమాన జీర్ణోద్ధరణ దృశ్యాలు.













SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-12-2021 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

